PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 249 | విజయవాడ, ఆదివారం 14 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 14 April 2024 | Rs



8

ఎదురులేని రాజస్థాన్

- ఉత్కంఠ పోరులో పంజాబ్‌పై మూడు వికెట్ల తేడాతో గెలుపు

గ్రూప్-1 స్క్రీనింగ్‌లో 4496 మంది అర్హత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) నిర్వహించిన గ్రూప్-1 స్క్రీనింగ్ ఫలితాలు విడుదలయ్యాయి. దీనిలో 4,496 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను కమిషన్ వెబ్‌సైట్ www.psc.ap.gov.inలో పొందుపరిచినట్లు వెల్లడించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లోని 81 పోస్టుల భర్తీకి డిసెంబర్ 8వ తేదిన ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 17న నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షకు 1,48,881 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 91,463 మంది హాజరయ్యారు. ఒక్కో పోస్టుకు 55 మంది చొప్పున 4496 మందిని కమిషన్ ఎంపిక చేసింది. 567 మంది అభ్యర్థులను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు కార్యదర్శి వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రధాన పరీక్షలను సెప్టెంబర్ 2 నుంచి 9 వ తేది వరకు నిర్వహిస్తామని, 7వ తేది మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.



కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సముద్రతీరంలో నిలిచిన బోట్లు

మత్స్యకారులకు పరిహారం ఏదీ?

- నేటికీ విడుదల కాని పరిహారం మార్గదర్శకాలు
- రేపటి నుండి అమలులోకి చేపల వేట నిషేధం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆటుపోట్ల జీవితంలో మరో ఉపద్రవం! ప్రభుత్వ ఉత్తర్వుల కారణంగా సముద్రంపై వేటకు వెళ్లలేని స్థితి ఒకవైపు! కష్టకాలంలో చేతికందవలసిన పరిహారం ఎప్పటికి అందుతుందో తెలియని స్థితి మరోవైపు! దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకారుల జీవనానికి 'భరోసా' లేని పరిస్థితి ఏర్పడింది. జీవనం ఎలా సాగించాలో తెలియనిస్థితిలో మత్స్యకార కుటుంబాలు చిక్కుకున్నాయి. చేపలు గుడ్లు పెట్టే దశలో సముద్రంలో వేటాడితే మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్రతిఏటా వేటపై ప్రభుత్వం నిషేధం విధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా రేపటి (15వ తేది)నుండి జూన్ 14వ తేదివరకు నిషేధం అమలులోకి రానుంది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే, వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇస్తున్న పరిహారం విషయంలో సందిగ్ధం నెలకొంది. వైఎస్ఆర్ మత్స్యకార భరోసా పేరుతో రైతులకు అందిస్తున్న ఈ పరిహారానికి సంబంధించి ఇంతవరకు మార్గదర్శకాలు జారీ కాలేదు. ఎప్పటికి విడుదలవుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. పెద్ద సంఖ్యలో మత్స్యకారుల రోజువారి జీవనానికి సంబంధించి అత్యంత కీలకమైన ఈ సమస్యపై అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలు పెదవి విప్పడం లేదు. నామమాత్రంగానే ఇస్తున్న పరిహారమైనా మత్స్యకారులకు ఎంతో కొంత ఆదరువుగా ఉండేది. ఎన్నికల కమిషన్‌కు నివేదించామని, అక్కడ నుండి అనుమతి రాగానే పరిహారం ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఏడాది జరుగుతున్న కార్యక్రమాన్ని ఇసికి నివేదించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో అర్థం కాని స్థితి నెలకొంది. ఇసి నుండి అనుమతివచ్చిన తరువాత మార్గదర్శకాలు జారీ చేసి, సర్వేతో మిగిలిన ప్రక్రియ పూర్తిచేసి, చివరకు పరిహారం మిగతా2లో

సకాలంలో చేపలవేట నిషేధ భృతి

- ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మత్స్యకారులకు సకాలంలో చేపల వేట నిషేధ భృతిని అందించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం చేపలు పడక ఇబ్బందులు పడుతున్న మత్స్యకారుల బోట్ కార్మికుల ఎన్‌రోల్‌మెంట్ 2024 జనవరిలోనే చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు చేయకపోవడంతో నిషేధ భృతి ప్రభుత్వం ఇస్తుందా లేదా అనే ఆందోళన మత్స్యకారుల్లో నెలకొందని తెలిపారు. స్పష్టమైన నియమ, నిబంధనలు ఇప్పటివరకు కింది స్థాయి అధికారులకు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని విమర్శించారు. ఇచ్చే రూ.10వేల భృతి కూడా సకాలంలో అందించడం లేదని తెలిపారు. ఒక్క మోటార్ బోటుకు ఆరుగురికి ఇవ్వాల్సి ఉండగా నలుగురికి మాత్రమే ఇస్తున్నారని వివరించారు. ఎన్‌రోల్‌మెంట్ తప్పుల, తడకగా జరుగుతున్నాయని తెలిపారు. మత్స్యకారుల్లో నెలకొన్న అభద్రతాభావ పరిస్థితులను అధికారులు సమీక్ష చేసి తక్షణమే కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. మత్స్యకారులందరినీ జాబితాలో చేర్చి, ఏప్రిల్ 25వ తేదీ లోగా వారి ఖాతాలో నగదు జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల్లో సంప్రదాయ మత్స్యకారులకు, చేపలు అమ్మేవారికి, డ్రెస్సింగ్ చేసేవారికి, ఐస్ ప్యాకింగ్ చేసే వారికీ నిషేధ భృతి అమలు చేస్తామని మాట ఇచ్చి, ఇప్పుడు కొందరికే అమలు చేస్తూ మాట తప్పారని చెప్పారు. ఆ హామీలను అమలు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. భృతిని రూ. 20 వేలకు పెంచాలని, రెండు నెలలకు నిత్యావసర వస్తువులు కార్మికులందరికీ అందజేయాలని కోరారు.

సిఎం జగన్‌పై దాడి

విజయవాడలో రాయి విసిరిన అగంతకుడు

- కనుబొమ్మపై గాయం
- బస్సులోనే ప్రథమ చికిత్స
- మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి
- వెలంపల్లికి కూడా గాయం

ప్రజాశక్తి- విజయవాడ, అర్బన్, సింగ్‌నగర్, గన్నవరం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి ఆయనపై రాయి విసిరాడు. శనివారం రాత్రి విజయవాడలో జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. విజయవాడ సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటరులో మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా బస్సు పైనుండి ప్రజలకు జగన్ అభివాదం చేస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. ఓ వ్యక్తి పూలతోపాటు విసిరిన రాయి అత్యంత వేగంగా వచ్చి ఆయన కనుబొమ్మ పైభాగంలో తాకింది. దీంతో, సిఎంకు గాయమైంది. ఆ సమయంలో ఆయన పక్కనే ఉన్న వైసిపి సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్‌కు కూడా రాయి తగిలి గాయమైంది. ఈ నేపథ్యంలో కొద్దిసేపు యాత్రను నిలుపుదల చేశారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది సిఎంను టాప్‌పై నుండి బస్సులోకి తీసుకెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం సిఎం జగన్ బస్సులోనే కూర్చొని యాత్రను కేశరపల్లి వరకు కొనసాగించారు. అయితే వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జిజిహెచ్)కు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. రాత్రి 12 గంటల వరకూ ఆయన జిజిహెచ్‌లో ఉన్నారు. చికిత్స అనంతరం కేశరపల్లికి తిరిగివెళ్లారు. దాడి విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి సతీమణి వైఎస్ భారతి హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లారు. రోడ్ షోకు వచ్చిన ఆదరణను చూసి ఓర్వలేకే టిడిపి వారు దాడికి పాల్పడ్డారని వెలంపల్లి ఆరోపించారు.

త్వరగా కోలుకోవాలి : ప్రధాని మోడీ

ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ త్వరగా కోలుకోవాలి' అని ఆయన పేర్కొన్నారు.

స్టాలిన్, చంద్రబాబు ఖండన

జగన్‌పై దాడిని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తదితరులు ఖండించారు. జగన్‌పై జరిగిన దాడి ఘటనను ఖండిస్తున్నట్లు స్టాలిన్ తెలిపారు. రాజకీయాలు ఎప్పుడూ హింసాత్మకంగా మారకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో సభ్యత, గౌరవాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రిపై జరిగిన దాడి ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. సంబంధింత అధికారులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆయన కోరారు.

సమగ్ర విచారణ జరిపించాలి : సిపిఎం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాయి విసిరిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనను ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘటన దురదృష్టకరం: షర్మిల

జగన్‌పై జరిగిన దాడి బాధాకరం, దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని భావిస్తున్నట్లు తెలిపారు. అలా కాకుండా ఇది ఎవరైనా కావాలని చేసి ఉంటే ప్రతి ఒక్కరు కచ్చితంగా ఖండించాల్సిందేనని తెలిపారు. జగన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



కనుబొమ్మ పైభాగంలో గాయంతో సిఎం

విజయవాడలో ఘన స్వాగతం

కనక దుర్గ వారధి మీదుగా శనివారం సాయంత్రం 5.30 గంటలకు సిఎం బస్సు యాత్ర విజయవాడ నగరంలోకి ప్రవేశించింది. ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. బస్సు యాత్ర వాటర్ ట్యాంక్ రోడ్, శిఖామణి సెంటరు, చుట్టుగుంట, బిఆర్‌టిఎస్ రోడ్, భగత్‌సింగ్ రోడ్డు, సింగ్‌నగర్, కండ్రిక మీదుగా రామవరప్పాడు రింగ్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుంది. విజయవాడ నగరంలో సుమారు మూడున్నర గంటలకుపైగా సాగింది. అనంతరం రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు మీదుగా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది.

సిడ్నీ మాల్‌లో కత్తి పోట్లు

- ఆరుగురు మృతి

సిడ్నీ : ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో రద్దీగా వుండే షాపింగ్ సెంటర్‌లో ఒక దుండగుడి కత్తిపోట్లకు గురై ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. నిందితుడిని పోలీసులు కాల్చిచంపారు. న్యూ సౌత్‌వేల్స్ పోలీసు అసిస్టెంట్ కమిషనర్ ఆంథోనీ కూక్ శనివారం పత్రికా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గాయపడిన వారిలో తొమ్మిది నెలల బిడ్డ, ఆమె తల్లి కూడా వున్నారని, మొత్తంగా ఎనిమిది మందిని ఆస్పత్రికి తరలించి చికిత్సనందించామని చెప్పారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా వుంది. దాడి జరిగిన సమయంలో ప్రజలతో షాపింగ్ సెంటర్ రద్దీగా వుందన్నారు. వెంటనే ఆ ప్రాంతాన్నంతటినీ తమ అదుపులోకి తీసుకున్న పోలీసులు వందలాదిమందిని సంఘటనా స్థలం నుండి ఖాళీ చేయించారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామని వివరాలు తెలియగానే అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథతోనీ అల్బనీస్ చెప్పారు.

మహిళను మంటల్లోకి నెట్టాడు

- విశాఖలో వైసిపి నేత దాష్టీకం

ప్రజాశక్తి- యంత్రాంగం

తన ఇంటి పక్కన ఉన్న స్థలాన్ని ఆక్రమిస్తున్న వైసిపి వార్డు అధ్యక్షుడిని 'ఇదేం పని' అని అడిగిన మహిళను సదరు వ్యక్తి మంటల్లోకి నెట్టేసిన ఘటన జివిఎంసి 65వ వార్డు భానోజీతోటలో శనివారం చోటుచేసుకుంది. న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాలిబాబు కథనం ప్రకారం... గాజువాక నియోజకవర్గం పరిధి 65వ వార్డు భానోజీతోటలో జలుమూరు రాధ నివసిస్తున్నారు. ఆ వార్డు వైసిపి అధ్యక్షునిగా మొదలవలస లోకనాథం ఉన్నారు. స్థానికంగా ఉంటున్న ఆయన వార్డులోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. దానికి సమీపంలో ఉంటున్న రాధ ఇంటి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్నీ ఆక్రమించేందుకు ప్రయత్నించారు. రాధ లేని సమయంలో అక్కడ భూమిని చదును చేశారు. ప్రహరీ కట్టాలని అనుకున్నారు. చదును చేసే క్రమంలో తుప్పలు, చెత్తాచెదారాన్ని కుప్పగా పోసి పెట్రోల్ పోసి మంటపెట్టారు. ఈ విషయం తెలిసి రాధ అక్కడకు వచ్చారు. తన ఇంటి పక్కనున్న స్థలంలో చెత్తను ఎందుకు డంప్ చేశారని ఆమె ప్రశ్నించారు. ఈ క్రమంలో వారిరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. లోకనాథం ఆమెను మెడ మీద చేయి వేసి బలంగా నెట్టారు. దీంతో, ఆమె మంటల్లో పడడంతో చెయ్యి, నుదురు, ముఖంపై గాయాలయ్యాయి. రాధా కుటుంబీకులు నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సిపి రవిశంకర్ ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాలిబాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి లోకనాథాన్ని అరెస్టు చేశారు. ఆయనకు సహకరించి న ఇద్దరు మహిళలపైనా కేసు నమోదు చేశారు.



కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న రాధ

ఐద్వా ఖండన

మహిళను మంటల్లోకి తోసేయ్యడాన్ని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఓ ప్రకటనలో ఖండించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆడబిడ్డలపై వైసిపి అరాచకాలు : అచ్చెన్నాయుడు

విశాఖలో చోటుచేసుకున్న దారుణ ఘటనను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. ఆడబిడ్డలపై వైసిపి నేతల అరాచకాలు పెరిగిపోతున్నాయని ఆయన ఆరోపించారు. కాగా విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న రాధను టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ పరామర్శించారు. వైసిపి నాయకులు రౌడీలను మించిపోయారని ఆరోపించారు.

జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు

- మే 15 నుంచి దరఖాస్తులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతులు జూన్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. 2024-25 విద్యాసంవత్సరం అడ్మిషన్ల షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి సౌరభ్ గౌర్ శనివారం ఒక ప్రకటన ద్వారా విడుదల చేశారు. మే 15 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. జూన్ 1 వరకు దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. మొదటి దశ అడ్మిషన్ల ప్రక్రియ మే 22 నుంచి జూన్ 1 వరకు ఉంటుందని తెలిపారు. జూన్ 1 నుంచే తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. రెండో దశ అడ్మిషన్ల ప్రక్రియ జూన్ 10 నుంచి జులై 1 వరకు ఉంటుందని పేర్కొన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి రెండు దశల అడ్మిషన్ల ప్రక్రియను విద్యామండలి నిబంధనల ప్రకారం చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన సమాచారంతో జ్ఞానభూమి పోర్టల్‌లో లాగిన్ అయి అడ్మిషన్లు చేయాలని పేర్కొన్నారు.

రాజధానిపై బయటపడిన బిజెపి అసలు నాటకం

- ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధానిపై బిజెపి అసలు నాటకం బయటపడిందని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిజర్వుబ్యాంకు ప్రాంతీయ కార్యాలయం విశాఖలో ఏర్పాటు చేయడానికి 2022లో నిర్ణయం జరిగినా తాత్సారం చేసిన ఆర్‌బిఐ ఇప్పుడు తాజాగా రాజధాని ఎక్కడో తేల్చాకే నిర్ణయిస్తామని పేర్కొనడం రాష్ట్రప్రజల్ని మోసం చేయడం, అవమానపర్చడమేనని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని గతంలోనే కేంద్రప్రభుత్వం గెజిట్‌లో నోటిఫై చేయడమే కాక పార్లమెంటులో పలుమార్లు తెలిపిందని గుర్తుచేశారు. అయినా ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుకు దాన్ని ఒక షరతుగా పేర్కొనడం అసంబద్ధమని తెలిపారు. మూడు రాజధానుల పేరుతో వైసిపి ప్రభుత్వం చేసిన గందరగోళాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏనాడు వ్యతిరేకించలేదని విమర్శించారు. పైపెచ్చు రాష్ట్రప్రభుత్వం ఇష్టమన్న రీతిలో హైకోర్టులో అఫిడవిట్ కూడా దాఖలు చేసిందని తెలిపారు. రాజధాని అమరావతికి పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లు మోడీ గుమ్మరించి పోయారని విమర్శించారు. అనాటి నుంచి అస్పష్టత కొనసాగడంతో బిజెపి దొంగనాటకాలు ఆడుతూనే ఉందని తెలిపారు. ఇప్పటికైనా వాటికి తెరదించి రాష్ట్రంలో ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బోర్నవీటా హెల్త్‌డ్రింక్ కాదు..!

- కేంద్రం కీలక ప్రకటన

3

మోడీకి పోటీ సామాన్యుడే

• బిజెపికి మేమిచ్చే సమాధానం ఇదే • కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇంటర్వ్యూ

మోడీ వర్సెస్ ఎవరు అని బిజెపి ప్రశ్నిస్తే 'మోడీ వర్సెస్ కామన్ మ్యాన్' అనే సమాధానమిస్తానని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. 2022 అక్టోబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన 81 ఏళ్ల ఖర్గే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని ఓడించడమే లక్ష్యమని ఉద్ఘాటించారు. 'ది వీక్' పత్రికకు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖర్గే రామాలయ ప్రారంభోత్సవం, మోడీ నిరంకుశత్వ పాలన, ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి ఎదురవుతున్న ప్రమాదాలు తదితర అంశాలపై తనదైన రీతిలో స్పందించారు. ఆ ఇంటర్వ్యూలోని విశేషాలు...

'మోడీ వర్సెస్ ఎవరు' అనే ప్రశ్నకు ప్రతిపక్షాలు ఏం సమాధానమిస్తాయి?

మోడీ నియంత, నిరంకుశుడు. అటువంటి ఆయన లేదా ఆయన వందిమాగధులు అడుగుతున్నారు 'మోడీ వర్సెస్ ఎవరు?' అని. ప్రజాస్వామ్యంపై మాకు నమ్మకం ఉంది. ఎన్నికల తర్వాత కూటమి పార్టీలు కూర్చొని నిర్ణయం తీసుకుంటాయి. ఇలాంటివి చాలా సార్లు జరిగాయి. జనతా పార్టీ హయాంలో మొరార్జీ దేశాయ్ ఆవిర్భవించారు. ఆ తర్వాత విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, దేవెగౌడ, ఐకె గుజ్రాల్ ఆ విధంగా ప్రధానులైనవారే. 'మోడీకి పోటీ ఎవరు' అని బిజెపి ప్రశ్నిస్తే 'మోడీకి పోటీ సామాన్యుడు'. ఇదే మా సమాధానం.

మీరు , కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రామ మందిర ప్రారంభోత్సవానికి హాజరు కాలేదు. మిమ్మల్ని హిందూ వ్యతిరేకి అనడానికి బిజెపికి ఆస్కారమిచ్చినట్లు మీరు భావించట్లేదా?

ఇది ప్రభుత్వ కార్యమా? ట్రస్ట్ ఫంక్షన్ కాదా? అలాంటప్పుడు మోడీ ఆ క్రెడిట్ ఎందుకు తీసుకుంటున్నారు? అలాగే, మీరు భారత రాష్ట్రపతికే చోటివ్వలేదు. అటువంటిది అంటరాని నాయకుడైన నాకు ప్రధాన మంత్రి దగ్గర చోటిస్తారా? రాజకీయాల కోసం మీరు (మోడీ అండ్ కోను ఉద్దేశించి) నా వైపు, సోనియా గాంధీ వైపు వేలు పెడుతున్నారు.

మీరు నా ప్రజలను ఏ దేవాలయాలలోకి అడుగుపెట్టనివ్వరు. తాగునీరు కూడా ముట్టుకోనివ్వరు. పల్లెటూళ్ళలో వాళ్ళకి చదువు చెప్పనివ్వరు. మా చిన్నపిల్లలు గుర్రం మీద ఊరేగింపుగా వెళితే మీరు వారిని కిందకి లాగి కొడతారు. అలాంటి వారు మమ్మల్ని అడుగుతున్నారు, 'రామ మందిరం ప్రారంభోత్సవానికి మీరు ఎందుకు రాలేదని?

నేను గుల్బర్గాలో భారీ బుద్ధ విహార్‌ను నిర్మించాను. నా సొంత నియోజకవర్గంలో ప్రజలుభిన్నమైన విశ్వాసాలు కలిగినవారు న్నారు. ఎమ్మెల్యేగా 90 హనుమాన్ ఆలయాలు నిర్మించాను. ఒకటి కాదు, రెండు కాదు తొంభై. మేం మత వ్యతిరేకులం కాదు.

2024 లోక్‌సభ ఎన్నికల ప్రాముఖ్యత ఏమిటి?

ప్రతి ఎన్నిక కొన్ని సవాళ్లను ముందుకు తెస్తుంది. ప్రతి ఎన్నిక భిన్నంగా ఉంటుంది. నేను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత చూస్తున్న 14వ లోక్‌సభ ఎన్నికలివి. గత 10 ఏళ్ల మోడీ ప్రభుత్వం దేశానికి పెద్ద విపత్తు. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ఘోరంగా విఫలమైంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం 26 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి బయటపడేయగలిగితే, ఈ ప్రభుత్వం 80 కోట్ల మంది ప్రజలను ఉచిత రేషన్‌తో జీవించే స్థితికి నెట్టింది. నిరుద్యోగ సమస్య చూడండి. 83 శాతం మంది నిరుద్యోగులు 34 ఏళ్లలోపు యువకులే. నోట్ల రద్దు ప్రహసనం సరేసరి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి ఇంధనధరలు ఎన్ని వందల రెట్లు పెరిగాయో చూస్తున్నాం. కోవిడ్ పరిస్థితిని ఎదుర్కోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

ఈ ఎన్నికల్లో మీరు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు ఏమిటి?

రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించు కోవడం మా ముందున్న అతి పెద్ద సవాల్. ఈ రెండు లక్ష్యాల సాధనకు పోరాడుతున్నాం. అందుకే 'ఇండియా బ్లాక్' ఏర్పాటు చేసి, పొత్తులు పెట్టుకున్నాం.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ దాదాపు 300 స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తుంది. ట్రిపుల్-డిజిట్ మార్క్‌ను చేరుకోవడానికి మీకు చాలా ఎక్కువ స్ట్రైక్ రేట్ అవసరం కదా?.

మాకు చాలా ఎక్కువ స్ట్రైక్ రేట్ అవసరమన్నదాంతో నేను అంగీకరిస్తున్నాను, అయితే మనం పరిస్థితికి అనుగుణంగా పోరాడాలి. ఈసారి మాకు వనరులు లేవు, కానీ మా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో, యూ ట్యూబ్, ఇతర మీడియా ద్వారా తమ వంతు కృషి చేస్తున్నారు. మేము మనసులో ఏ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామో, దానిని సాధిస్తాము.

మోడీ కా గ్యారెంటీ'కి కాంగ్రెస్ న్యాయమే సమాధానమా?

మోడీ కా గ్యారెంటీలను ప్రజలు నమ్మడం లేదు. గతంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మోడీ ఇచ్చిన హామీ ఏమైంది? ప్రతి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న హామీ ఏమైంది? రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు. అది ఎక్కడికెళ్లింది? అహ్మదాబాద్ నుంచి ముంబయికి బుల్లెట్ రైలు నడుపుతామన్న హామీని కూడా ఆయన నెరవేర్చలేకపోయారు. ఎన్నికల ముందు చెప్పకపోయినా, యుపిఎ ప్రభుత్వం ఏర్పడ్డాక (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం) పథకం, ఆహార హక్కు, విద్య హక్కు, సమాచార హక్కు , ఆరోగ్య మిషన్ వంటివి తెచ్చాము.. మోడీ ఏం చేశారు? ఇచ్చిన హామీలన్నింటిని తుంగలో తొక్కారు..



దక్షిణాదిపై బిజెపి ప్రత్యేకంగా కేంద్రీకరించడాన్ని మీరు ఎలా చూస్తారు?

ఆయన (మోడీ) తన పార్టీ పునాదిని విస్తరించాలనుకుంటున్నారు.. ప్రధానిగా ఆయనకు చాలా వనరులు ఉన్నాయి. అందుకే దాన్ని పూర్తిగా వినియోగించుకుంటున్నారు.. ఆయనకు పాలనపై శ్రద్ధ లేదు. నిజంగా శ్రద్ధ ఉంటే మారణకాండతో అల్లాడిన మణిపూర్‌లో పర్యటించేవారు. మారణ కాండ సాగిన ఆ ఆరేడు మాసాల్లో ఆయన 14 దేశాలను సందర్శించారు. కానీ ఒక్క రోజైనా మణిపూర్ వెళ్లారా? ఆయన 300కు పైగా ఎన్నికల ప్రసంగాలు, ప్రారంభోత్సవాలు చేశారు. కానీ ఆయన మణిపూర్ వెళ్లి మాట్లాడలేరు. 'నా నిర్ణయం దఢమైనది' అని, 'నాకు 56 అంగుళాల ఛాతీ ఉంది' అని చెబుతారు. మణిపూర్‌లో 'నేను పోరాడతాను, నేను నిన్ను రక్షిస్తాను' అని ఎందుకు చెప్పలేకపోతున్నారు?



తాడికొండ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

అమరావతితో సమాంతరంగా కర్నూలు అభివృద్ధి

- తాడికొండ, ప్రత్తిపాడు సభల్లో చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

అమరావతి తరువాత విశాఖపట్నం, కర్నూలును కూడా సమాంతర నగరాలుగా అభివృద్ధి చేస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. విశాఖను ఆర్థిక రాజధానిగా, కర్నూలును హార్టీకల్చర్, సీడ్ క్యాపిటల్‌గా మార్చి చూపిస్తానని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు జిల్లా తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ప్రజాగళం సభల్లో ఆయన ప్రసంగించారు. రాజధానిలో 33,000 ఎకరాలను స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులను వైసిపి నట్టేట ముంచిందన్నారు. రాజధానిలో రోడ్లు తవ్వేసి మట్టి, ఇసుక కూడా దోచుకెళ్లిపోయారని విమర్శించారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున నిలబడి చెబుతున్నా.. అమరావతిని అంగుళం కూడా ఎవ్వరూ కదపలేరన్నారు. రూ.పది కోట్లతో నిర్మించిన ప్రజా వేదికను సిఎం జగన్ కూల్చారని, తాము అధికారంలోకి వస్తే మళ్లీ అదే ప్రదేశంలో ప్రజావేదిక నిర్మిస్తామని అన్నారు. కౌరవ సభ నుంచి బయటకు వస్తూ చెప్పా.. గెలిచిన తర్వాత గౌరవ సభగా మార్చి జూన్ నాలుగున సభలో అడుగు పెడతాం. ప్రపంచ దేశాలన్నీ అమరావతి వైపు చూడాలని ఆలోచించా. సంపద సృష్టించే కేంద్రంగా తయారు చేయాలనుకున్నాను. జగన్ వచ్చాక రాజధాని లేని రాష్ట్రంగా ఎపిని మార్చేశారు. రాజధాని అంటే పెద్ద పెద్ద భవనాలు కాదు.. ఆంధ్రుల ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం. వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఆ పార్టీ నేతలకు కమిషన్లు ఇవ్వలేక రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయి. బడికి రంగులు వేస్తే విద్యా వ్యవస్థ మారిపోతుందా? రూ.కోట్లు ఖర్చు పెట్టినా జగన్ సభలకు జనం రావడం లేదు' అని చంద్రబాబు అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు, పింఛనుదారులకు మళ్లీ ఒకటో తేదీనే జీతాలిస్తామని, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 26 వేల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పత్తిపాడు అసెంబ్లీ అభ్యర్థి బి.రామాంజనేయులు, తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా తెనాలి శ్రావణ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు.

చేనేతను విస్మరించిన చంద్రబాబు



సిఎంకు చేనేత రాట్నం బహూకరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, లావణ్య

- 98 శాతం హామీలు మరిచారు
- నేతన్నలతో సిఎం ముఖాముఖి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు 98 శాతం అమలు చేయలేదని కేవలం రెండు శాతం మాత్రమే అమలు చేశారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరి సికె కన్వెన్షన్ హాలుతో శనివారం చేనేత కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఎం మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు ఇల్లు, మగ్గం అని చంద్రబాబు మోసం చేశారన్నారు. ఎన్‌డిఎ కూటమి ఆధ్వర్యంలో రూపొందించిన మ్యానిఫెస్టోలో చేనేత కార్మికులకు ఎటువంటి మేలు చేయలేదని చెప్పారు. బిసిల సీట్లను చంద్రబాబు, లోకేష్ లాక్కుని రూ.కోట్లు కుమ్మరిస్తూ మంగళగిరిలో గెలవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలం ఇద్దామని ప్రయత్నిస్తే కోర్టుకు వెళ్లి చంద్రబాబు నాయుడు అడ్డుకున్నారన్నారు. సిఎం జగన్‌కు చేనేత వస్త్రాలు, రాట్నం మెమోంటోను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, లావణ్య బహూకరించారు. అంతకు ముందు నంబూరు అడ్డరోడ్డు నుంచి మంగళగిరి వరకు రోడ్‌షో నిర్వహించారు. చేనేత కార్మికులతో సమావేశం అనంతరం తిరిగి సాయంత్రం బస్సుయాత్ర నిర్వహించారు.



సిఎం జగన్‌కు వైఎస్ భారతి అభివాదం

జగన్‌కు భారతి అభివాదం

బస్సు యాత్రలో భాగంగా విజయవాడ వెళ్తున్న సిఎం జగన్‌కు తాడేపల్లిలో ఆయన సతీమణి వైఎస్ భారతీ అభివాదం చేశారు. తమ ఇంటికి సమీపంలో యాత్ర వెళ్తుండగా ప్రధాన రహదారిపైకి వచ్చి ఆమె అభివాదం చేశారు. ప్రతిగా భారతికి చెయ్యి ఊపి జగన్ అభివాదం చేశారు.

ఎన్‌టిఆర్ జిల్లాలోకి ప్రవేశించిన యాత్ర

కనకదుర్గ బ్యారేజీ మీదుగా విజయవాడలోకి యాత్ర ప్రవేశించింది. శిఖామణి సెంటర్, చుట్టుగుంట, పైపులరోడ్డు మీదుగా కేసరపల్లి వరకూ యాత్ర కొనసాగింది.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

- దళిత ఉద్యమ నేత పాల్తేటి పెంటారావు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సి ఉందని దళిత ఉద్యమ నేత పాల్తేటి పెంటారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1157వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఉండబట్టే రిజర్వేషన్లు అమలై దళిత, బహుజన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమైందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్రంలోని మోడీ సర్కారు కాలరాయడం దుర్మార్గమన్నారు. కార్మిక హక్కులపై దాడిని ఖండించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి స్థాయిలో నడిపేంత వరకూ పోరాటం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పోర్టు గేటు సమీపంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

గంగవరం పోర్టు వద్ద కార్మికుల బైఠాయింపు

- సమస్యలు పరిష్కరించాలని కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అదానీ గంగవరం పోర్టు ప్రధాన గేటు వద్ద కార్మికులు పెద్ద సంఖ్యలో బైఠాయించారు. తమ బాధలను పట్టించుకోని యాజమాన్యం తమ ప్రాంతాన్ని వెంటనే విడిచి వెళ్లిపోవాలని నినదించారు. పోలీసుల సాయంతో ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్మికులు చేస్తున్న ఆందోళన శనివారానికి నాలుగో రోజుకు చేరుకుంది.

'విధుల్లోకి వెళ్లండి. లేకపోతే ఇంటికి వెళ్లండి. అదానీ పోర్టు యాజమాన్యం మీ మాటలు లెక్కచేయదు' అని పోర్టు యాజమాన్యానికి అనుకూలంగా ఆందోళన వద్దకు వచ్చిన డిసిపి మేకా సత్తిబాబు మాట్లాడారు. ఆందోళన కొనసాగిస్తే కేసులు పెట్టాల్సి వస్తుందని బెదిరించినా కార్మికులు జడవలేదు. కార్మికుల పోరాటానికి సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు మద్దతు తెలిపి మాట్లాడారు. విశాఖ పోర్టు కార్మికులతో సమానంగా గంగవరం పోర్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టులో 15 ఏళ్లకుపైగా పనిచేస్తున్న కార్మికులకు రూ.15 వేలు మాత్రమే వేతనం దక్కుతోందని తెలిపారు. గంగవరం పోర్టు కార్మికులకు మద్దతుగా సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.గంగారావు వినతిపత్రం అందజేశారు. అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఇతర పోర్టుల మాదిరిగానే రూ.36 వేలు వేతనం ఇవ్వాలని, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని కలెక్టర్‌ను కోరారు.

ఎన్నికల వేళ బంగారం, నగదు స్వాధీనం

ప్రజాశక్తి- యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వివిధ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. సరైన పత్రాలు లేకుండా పెద్దమొత్తంలో తరలిస్తున్న నగదు, నగలు, ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం పొట్టిలంక 216వ నెంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బొలేరో వాహనంలో తరలిస్తున్న రూ.1.04 కోట్ల విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. కడియం సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా వీటిని గుర్తించారన్నారు. తహశీల్దార్ బి.రమాదేవి సమక్షంలో జిఎస్‌టి, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు పత్రాలను పరిశీలించారన్నారు. తదుపరి విచారణ నిమిత్తం జిల్లా గ్రీవెన్స్ కమిటీకి తరలించామని తెలిపారు.

నంద్యాల జిల్లా పాణ్యం మండలం తమ్మరాజుపల్లె చెక్‌పోస్ట్ వద్ద శనివారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.20 లక్షల నగదు పట్టుబడింది. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళుతున్న రంగారెడ్డి అనే వ్యక్తికి చెందిన కారును తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు పాణ్యం సిఐ నల్లప్ప తెలిపారు.

మత్స్యకారులకు పరిహారం ఏదీ?

మొదటిపేజీ తరువాయి

అందే సమయానికి నెలల సమయం పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాతే పరిహారం అందే అవకాశం ఉందని కొందరు ఉన్నతాధికారులు చెబుతుండటం గమనార్హం.

రాష్ట్రంలో ఎందరు?

రాష్ట్రంలో 8,74,837 మంది మత్స్యకారులు ఉన్నారు. 1.50 లక్షల మందికిపైగా సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. వారిలో 1,23,519 మందికి ప్రభుత్వం గత ఏడాది మత్స్యకార భరోసా అందించింది. కుటుంబానికి రూ.10 వేల రూపాయల చొప్పున రూ.123.52 కోట్లు మత్స్యకారుల ఖాతాలో జమచేసినట్లు ప్రభుత్వ రికార్డులు తెలియజేస్తున్నాయి. 2011లెక్కల ప్రకారం రాష్ట్రంలో 12,747 మోటరైజ్డ్ ,1771 మెకనైజ్డ్ బోట్లు ఉండేవి. ప్రస్తుతం వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది.

జిల్లాల వారీగా

శ్రీకాకుళం జిల్లాలో గతేడాది 15,281 మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో సుమారు 800 మంది మత్స్యకారులకు నేటికీ వారి ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. ఈ ఏడాది కూడా దాదాపుగా అంత సంఖ్యలోనే పరిహారం ఇయ్యవలసి ఉంటుందని భావిస్తున్నారు. విజయనగరం జిల్లాలో 1121 యాంత్రిక బోట్లు నిలిచిపోనున్నాయి. భోగాపురంలో ఐదు, పూసపాటిరేగ మండలంలో 11 గ్రామాల్లో వేటపై ఆధారపడిన కుటుంబాలు సుమారు 5వేలు ఉంటాయని అంచనా. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 13 మండలాల్లో చేపల వేట ద్వారా 66 వేల కుటుంబాలు ఉపాధిని పొందుతున్నాయి. సుమారు 600 మెకనైజ్డ్ బోట్లు, 3 వేలకు పైగా మోటరైజ్డ్ బోట్లపై మత్స్యకారులు సముద్రంలో చేపల వేటను సాగిస్తున్నారు. కృష్ణా జిల్లాలో మెకనైజ్డ్ బోట్లు117, మోటరైజ్డ్ బోట్లు 1500 ఉన్నాయి. మచిలీపట్నం, కత్తివెన్ను, నాగాయలంక, కోడూరు తదితర మండలాల్లో 14 వేల మంది వరకు సముద్రంపై వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. బాపట్ల జిల్లాలో గతేడాది జిల్లాలో 12,466 మంది మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించింది. అయితే మత్స్యకారుల్లో అర్హులైన పలువురికి ప్రభుత్వ సాయం అందలేదని ఆరోపణలు ఉన్నాయి. నెల్లూరు జిల్లాలో 16వేల మంది మత్స్యకారులు, తిరుపతి జిల్లాలో 5వేల కుటుంబాలు సముద్రంలో వేటతో జీవనం సాగిస్తున్నారు.

గత ఏడాది ఇలా...

గత ఏడాది మత్స్యకార భరోసాకు సంబంధించిన మార్గదర్శకాలు ఏప్రిల్ ఆరున విడుదలయ్యాయి. 17 నుంచి ఎన్యుమరేషన్ జరిగింది. అదే నెల 25న ఆర్‌బికెలు, సచివాలయాలో జాబితాలను ప్రదర్శనకు ఉంచారు. అభ్యంతరాలను ఏప్రిల్ 25 నుంచి 27 స్వీకరించారు. వాటిని 28, 29 తేదీల్లో పరిష్కరించారు. 30న తుది జాబితాను ప్రకటించారు. మే 16 నుంచి మత్స్యకారుల ఖాతాలో డబ్బులు జమ అవుతూ వచ్చాయి. ఈ ఏడాది ఇప్పటివరకు ఈ ప్రక్రియే ప్రారంభం కాలేదు.

ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు చర్యలు

ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా మత్స్యశాఖ అధికారి కె కరుణాకరరావు తెలిపారు. ఆ తర్వాతే ఎన్యుమరేషన్ ప్రక్రియ చేపడతామని ఆయన చెప్పారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-మాచర్ల రూరల్ (పల్నాడు జిల్లా)

ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కంభంపాడు గ్రామానికి చెందిన ఈర్ల మహేందర్ (17) నర్సరావుపేటలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ మెదటి సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో మహేందర్ ఫెయిల్ అవడంతో అందరితోనూ ముభావంగా ఉంటున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పొలం పనుల నుండి వచ్చిన తల్లిదండ్రులు మహేందర్ మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ఉపాధి కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పెదకూరపాడు (పల్నాడు జిల్లా)



మృతుడు బాబు (ఫైల్)

గుండెపోటుతో ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఉపాధి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంగుంట్ల గ్రామానికి చెందిన యనబర్ల బాబు (55) తోటి కార్మికులతో కలిసి ఉపాధి పనులకు వెళ్లారు. గ్రామ సమీపంలోని పంట కాలువలో పూడికతీత పనులు చేస్తుండగా పని ప్రదేశంలోనే ఒక్కసారిగా కుప్పకూలారు. తోటి కార్మికులు వెంటనే ఆయనను పెదరకూరపాడులోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాబు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

దేవాదాయశాఖ సిబ్బందిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచండి

సిఇఓకు పురందేశ్వరి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు దేవాదాయశాఖ సిబ్బందిని దూరంగా ఉంచాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి కోరారు. ఈ మేరకు సిఇఓకు ఆమె శనివారం లేఖ రాశారు. ఏప్రిల్, మే, జూన్ నెల్లో ఉగాది, శ్రీరామనవమి, చందనోత్సవం, నృసింహ జయంతి, బ్రహ్మోత్సవాలు, గ్రామ దేవత వార్షిక వేడుకలతో పాటు ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. గతంలో ఎన్నడూ సార్వత్రిక, శాసనసభ ఎన్నికలకు దేవాదాయశాఖ సిబ్బంది సేవలను వినియోగించుకోలేదని ఆమె తెలిపారు.

కొత్త సిఎస్ ఎవరు?

- జూన్‌లో రిటైర్ కానున్న ప్రస్తుత ప్రధాన కార్యదర్శి
- జాబితాలో పలువురి పేర్లు
- ఉన్నతాధికారుల్లో ఆసక్తికర చర్చ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జూన్‌లో పదవీ విరమణ చేయనుండటంతో నూతన సిఎస్ ఎవరన్న విషయం ఉన్నతాధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో అనేక మంది చీఫ్ సెక్రటరీలకు పదవీ విరమణ తరువాత మూడు, ఆరు నెలలపాటు కొనసాగింపులు ఇచ్చిన ఘటనలు కూడా ఉన్నాయి. అయితే ఇది ఎన్నికల ఏడాది కావడంతో కొనసాగింపు విషయంలో ఇప్పటివరకు ఎటువంటి స్పష్టత లేదు. ఆయన తరువాత పూర్తిస్థాయి సిఎస్ రేసులో ప్రస్తుతం నలుగురైదుగురు ఉన్నట్లు కనిపిస్తోంది. 2026 జూన్ వరకు ఉండే విధుల్లో ఉండే ఎర్రా శ్రీలక్ష్మి, ఈ ఏడాది ఆగస్టు వరకు ఉండే రజత్‌భార్గవ, 2027 వరకు ఉండే అనంతరాము పేర్లు అధికంగా వినిపిస్తున్నాయి. గతంలో కేవలం ఒక్క నెల సర్వీసు మాత్రమే ఉన్న సమయంలో కూడా అజయ్ కల్లాంకు సిఎస్ బాధ్యతలు అప్పగించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రజత్ భార్గవ కూడా రేసులో ఉండే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే పూర్తి స్థాయి సిఎస్‌ను నియమించాలన్న ఆలోచన ప్రభుత్వానికి వస్తే మాత్రం శ్రీలక్ష్మి, అనంతరాము పేర్లను పరిశీలించే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో పై జాబితాలో ఉన్న వారికన్నా జూనియర్లు కూడా కొందరు ఈ పదవిని ఆశిస్తున్నారు. . వారిలో 2026 ఏప్రిల్ వరకు సర్వీసు ఉన్న 1991 బ్యాచ్ అధికారి సాయిప్రసాద్, అదే ఏడాది జూలై వరకు సర్వీసులో ఉండే అజయ్‌జైన్, 2028 వరకు సర్వీసు ఉన్న 1991 బ్యాచ్ అధికారి ఆర్‌పి సిసోడియా కూడా సిఎస్ పదవిని కాంక్షిస్తున్నారు. మరోవైపు ఎన్నికల ఫిర్యాదుల నేపథ్యంలో సిఎస్ జవహర్‌రెడ్డిని మార్పు చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయిస్తే ఆ వెంటనే కొత్త సిఎస్‌ను నియమించాల్సి ఉంటుంది. ఇదే జరిగితే మాత్రం సీనియార్టీ ఆధారంగా ముగ్గురు పేర్లు పంపిస్తారా, లేక తాత్కాలిక విధానంతో పేర్లు ఎన్నికల కమిషన్‌కు పంపిస్తారా అన్నది వేచి చూడాలి.

డిజిపి పదవిపైనా

ఇదే సమయంలో రాష్ట్ర డిజిపిని మార్పు చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయిస్తే ఆ పదవిపైనా కొంతమంది సీనియర్ ఐపిఎస్ అధికారులు ఆశలు పెంచుకుంటున్నారు. డిజి స్థాయిలో ఉన్న ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమ9లరావు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అదే స్థాయిలో ఉన్న అంజనా సిన్హా, 1991 బ్యాచ్ అధికారి మాదిరెడ్డి ప్రతాప్, హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న హరీష్‌కుమార్ గుప్తాల పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి.

ధర్మానపై ఇసికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాలంటీర్లను కించపరిచే విధంగా మాట్లాడిన మంత్రి ధర్మాన ప్రసాద్‌రావుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులకు టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కెఎస్ జవహర్ శనివారం ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి కోసం విద్యార్థులతో ఎన్నికల సర్వే చేయిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ విసి ప్రసాద్ రెడ్డిని, వాట్సాప్ దుర్వినియోగం చేసిన నాగార్జున యూనివర్సిటీ సుపరిడెంట్ వెంకటప్పరెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, మన్నవ సుబ్బారావు ఉన్నారు.

టిడిపి పాలనలోనే చేనేతలకు మేలు: కిష్టప్ప

చేనేతలకు టిడిపి పాలనలోనే మేలు జరిగిందని టిడిపి నేత, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప అన్నారు. ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు చేనేతలపై జగన్ కపట ప్రేమ చూపిస్తున్నారని శనివారం విలేకరుల సమావేశంలో విమర్శించారు. చేనేతల ఉచిత విద్యుత్ సబ్సిడీకి గండి కొట్టారని తెలిపారు.

జగన్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని టిడిపి అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు విమర్శించారు. జగన్ అసమర్థత వల్ల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 62 శాతానికి దిగజారిందని టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం ఆగ్రహం వ్యక్తం చేశారు.



డోలీలతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయండి

- గిరిజన మహిళలు వినూత్న నిరసన

ప్రజాశక్తి - రోలుగుంట (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలంలోని అర్ల పంచాయతీ కేంద్రంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్దగరువు, పిత్రిగడ్డ గిరిజన మహిళలు డోలీలు కట్టి శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

ఆర్ల పంచాయతీ పరిధిలోని కొండశిఖర గ్రామాలైన పిత్రిగడ్డ, నీలిబంద, పెద్దకరువు, కొత్తలోసింగి, పాతలోసింగి గ్రామాల నుంచి పాత పంచాయతీ కేంద్రమైన శరభవరంలో ఓటు వేసేందుకు 15 కిలో మీటర్లు నడిచి వెళ్లాల్సి ఉంటుందన్నారు. రోడ్డు మార్గం లేక ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అర్ల పంచాయతీ కేంద్రంలో స్కూల్ బిల్డింగ్, తారు రోడ్డు, మంచినీటి సౌకర్యం, ఇంటర్‌నెట్ సౌకర్యాలు ఉన్నాయని, అక్కడ కాకుండా దూర ప్రాంతంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మూడు కిలో మీటర్ల దూరంలో 600 మంది ఓటర్లు ఉంటే ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తక్షణం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పాంగి శాంతి, కిలో రుక్మ, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు పాల్గొన్నారు.

మూడు గంటలపాటు విచారణ

ఢిల్లీ మద్యం కేసులో కవిత నుంచి సిబిఐ ఆరా



ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తొలిరోజు సిబిఐ అధికారులు సుమారు మూడు గంటల పాటు విచారించారు. కోర్టు ఆదేశాలు, నిబంధనల ప్రకారం... ఢిల్లీ లోధి రోడ్ - జవహర్ లాల్ నెహ్రూ మార్గ్ లోని సిబిఐ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆమె స్టేట్‌మెంట్ ను రికార్డు చేశారు. విశ్వసనీయంగా సమాచారం ప్రకారం..తొలుత ఆమెకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటల తరువాత ఆమెను విచారణ గదికి తీసుకెళ్లి విచారణ చేపట్టారు. మద్యం పాలసి రూపకల్పన, ముడుపులు, సహ నిందితులు, అప్రూవర్ల వాంగ్మూలాలు తదితరాలపై కవితను ప్రశ్నించారు. ముఖ్యంగా అభిషేక్ బోయిన పల్లి, మాజీ సిఏ బుచ్చిబాబు, అరుణ్ రామ చంద్ర పిళ్లై, శరత్ చంద్రా రెడ్డి స్టేట్‌మెంట్లపై ఆరా తీశారు. అలాగే అప్రూవర్లుగా మారిన వైసిపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు రాఘవ రెడ్డి, దినేశ్ అరోరాల వాంగ్మూలాలపై ప్రశ్నించింది. ప్రధానంగా బుచ్చిబాబు వాట్సాప్ చాట్స్, ఫోన్ కాల్స్, ఇతర ఆధారాల ముందు పెట్టుకొని క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ఈ నెల 15న ఆమెను కోర్టు ముందు ప్రవేశపెట్టనున్నారు.

కవితను కలిసిన భర్త అనిల్, న్యాయవాది మోహిత్ రావు

సిబిఐ కస్టడీలో ఉన్న కవితను తొలి రోజు భర్త అనిల్, న్యాయవాది మోహిత్ రావు, పీఏ శరత్ లు కలిసారు. కస్టడీలో ఉన్న సమయంలో ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య కవితను కలిసేందుకు వీరికి కోర్టు అనుమతించింది. తొలుత అరగంట న్యాయవాది కవితను కలిసేందుకు అనుమతి ఇచ్చింది. మరో 15 నిమిషాలు కుటుంబ సభ్యులు కలవొచ్చని ఆదేశాల్లో పేర్కొంది. దీంతో శనివారం సాయంత్రం 5:50 గంటలకు భర్త అనిల్, మోహిత్ రావు, శరత్ లతో కలిసి సిబిఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. తొలి రోజు కావడంతో... కోర్టు ఆదేశాల కాపీ, వ్యక్తిగత సమాచారాన్ని అందించిన తరువాత వీరిని కవితను కలిసేందుకు అనుమతించారు.

కోడికత్తి డ్రామా 2.0 వెర్షన్

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల నుంచి స్పందన కరువవడంతో కోడికత్తి 2.0 వెర్షన్‌కు వైసిపి అధినేత జగన్ తెరలేపారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆరోపించారు. ముఖ్యమంత్రి పర్యటన జరుగుతుంటే కరెంటు తీసేయడం ముందుగా వేసుకున్న పథకంలో భాగం కాదా? అని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇది ఉద్దేశపూర్వకంగా చేయించుకున్న దాడే అని ఆరోపించారు. డిజిపి, ఇంటెలిజెన్స్ ఐజి నేతృత్వంలో రూపొందించిన డ్రామా అని ఆరోపించారు. 2019 ఎన్నికలకు ముందు విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన కోడికత్తి డ్రామాకు, సింగ్ నగర్‌లో సిఎంపై జరిగిన గులకరాయి దాడికి పెద్ద తేడా ఏమీ లేదని పేర్కొన్నారు.

సంఘటన జరిగిన నిమిషాల వ్యవధిలోనే జగన్ అండ్ కో పేర్నినాని, అంబటి రాంబాబు చంద్రబాబు చేయించాడని ప్రచారం చేయడం ముందస్తు ప్రణాళికలో భాగం కాదా? అని ప్రశ్నించారు. ఇటువంటి డ్రామాలు నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్న విషయాన్ని జగన్ గుర్తించాలని అన్నారు.

గ్రాన్యూల్స్ విశాఖ యూనిట్‌లో ఎఫ్‌డిఎ తనిఖీలు

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియాకు చెందిన విశాఖపట్నం అనకాపల్లిలోని యూనిట్‌లో అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్ ఎఫ్‌డిఎ) తనిఖీలు పూర్తి చేసింది. ఏప్రిల్ 8 నుంచి 12వ తేదీ మధ్య విజయవంతంగా తనిఖీలు పూర్తి చేసిందని గ్రాన్యూల్స్ పేర్కొంది. 483 పరిశీలనలతో జీరో అని తేలిందని వెల్లడించింది. ఈ ఆడిట్ ఆంకాలజీ, నాన్ ఆంకాలజీ ఉత్పత్తుల కోసం యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్ (ఎపిఐ), ఫార్ములేషన్స్ (ఎఫ్‌డిలు) కోసం ప్రీ అప్రూవల్ ఇన్‌స్పెక్షన్ (పిఎఐ), సిజిఎంపి ఆడిట్‌కు ఉద్దేశించిన వని గ్రాన్యూల్స్ ఇండియా ఎండి కృష్ణ ప్రసాద్ తెలిపారు. తమ యూనిట్‌కు జీరో అబ్జర్వేషన్ సర్టిఫికెట్ లభించడమంటే అధిక నాణ్యత ప్రమాణాలు, అత్యుత్తమ ప్రపంచ ప్రమాణాలతో పోల్చదగినదన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- మేడికొండూరు (గుంటూరు జిల్లా)


మరియదాసు మృతదేహం

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మందపాడులోని ఎస్‌సి కాలనీకి చెందిన కటారి మరియదాసు (42) ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని మూడేళ్లుగా మిర్చి సాగు చేస్తున్నారు. పంట సాగు కోసం సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. సరైన దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పు తీర్చడం కష్టమైంది. అప్పు తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపంతో శుక్రవారం రాత్రి తన పొలంలోకి వెళ్లి పురుగుల మందు తాగి పడిపోయారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మరియదాసుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'ఇండియా' వేదికకు సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో దాని పొత్తు, తొత్తు పార్టీలను ఓడించడమే లక్ష్యంగా ఏర్పాటైన 'ఇండియా' వేదికకు సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సమితి అధ్యక్షులు జి కుమార్ చౌదరి, ప్రతినిధులు వీరేందర్, గౌరీ శంకర్, గోపాలకృష్ణ తదితరులు శనివారం విజయవాడలోని దాసరి భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ..రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని, వ్యవసాయం, పారిశ్రామిక, నీటిపారుదల రంగాల అభివృద్ధి పడకేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తానని గత ఎన్నికల వేళ ప్రగల్భాలు పలికిన జగన్మోహన్‌రెడ్డి.. అధికారం చేపట్టాక మాట తప్పారని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు కేవలం 'ఇండియా' వేదికతోనే సాధ్యమని చెప్పారు. 'ఇండియా వేదిక గెలుపు – ఎపి అభివృద్ధికి మలుపు' అని అన్నారు. జి కుమార్ మాట్లాడుతూ, ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపుకోసం ప్రతి నియోజకవర్గంలో సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి కృషి చేస్తుందని చెప్పారు. రాహుల్, వేణుచారి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల పోరాటం స్ఫూర్తిదాయకం

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరామమ్మ
- విశాఖ సెంట్రల్ జైల్ నుంచి విడుదలైన కార్మికలకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


జైలు నుంచి విడుదలైన వారికి పూలమాల వేస్తున్న సిఐటియు నాయకులు సుబ్బరావమ్మ

మిమ్స్ యాజమాన్య నిరంకుశత్వాన్ని, పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొని జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చిన మిమ్స్ కార్మికులు ఈశ్వరమ్మ, లక్ష్మి, రమణ, రామశేఖర్‌లకు విజయనగరం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మిమ్స్ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున పోరాడుతున్నారు. కక్ష కట్టిన యాజమాన్యం తప్పుడు కేసులు పెట్టి 21 మంది కార్మికులను అరెస్టు చేయించింది. వారిలో ఐదుగురిని విశాఖ సెంట్రల్ జైలుకు పంపగా, మిగతా 16 మంది విజయనగరం సబ్‌జైలులో ఉన్నారు. శనివారం నలుగురు బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా వీరికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు, మిమ్స్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మిరప నారాయణరావు స్వాగతం పలికి పూలదండలు వేసి అభినందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ యాజమాన్యం, అధికార యంత్రాంగం, పోలీస్ వైఖరిని దుయ్యబట్టారు. తప్పు యాజమాన్యం చేస్తే కార్మికులను, అందులోనూ మహిళలను సైతం జైల్లో నిర్బంధించడం వంటి చర్యలతో జిల్లా ప్రతిష్టను దిగజార్చారన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో వారం రోజులుగా చర్చలు జరుగుతున్నాయని, కార్మికులందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందంతోనే విధులకు హాజరవుతారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా మిమ్స్ యాజమాన్యం ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని హితవుపలికారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.రామారావు, మిమ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం మా ఊరు రావొద్దు

- ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్ (ప్రకాశం జిల్లా)

'మేము ఎన్నికలను బహిష్కరిస్తున్నాం.. ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు, ఓట్లు అడిగేందుకు మా ఊరికి ఎవ్వరూ రావొద్దు' అని ప్రకాశం జిల్లా సిఎస్‌పురమ మండలంలోని డిజిపేట పంచాయతీ దర్శిగుంట్ల, బొంతవారిపల్లి గ్రామాల ప్రజలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామస్తులు మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో నాయకులు వస్తారని, ఓట్లు వేయించుకొని గెలిచిన తరువాత తమ గ్రామాల వైపు కన్నెత్తి చూడరని, ఇక తామెందుకు ఓట్లు వేయాలంటూ ప్రశ్నించారు. తమ గ్రామాలకు రోడ్డు వేయించాలని దాదాపు 25 సంవత్సరాలుగా పాలకులకు విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తాము చందాలు వేసుకొని రహదారికి మట్టి తొలించుకుంటే.. తాము అభివృద్ధి చేసినట్లు పంచాయతీ నాయకులు బిల్లులు పెట్టుకున్నారని తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని దర్శిగుంట్ల గ్రామానికి చెందిన డిజిపేట మాజీ వైస్ సర్పంచ్ వేముల నారాయణ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలను బహిష్కరించాలని తమ రెండు గ్రామాల ప్రజలు నిర్ణయించుకొని గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని తెలిపారు.



ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద గ్రామస్తులు


పసుపు దంచుతున్న మహిళలు, అర్చకులు

సీతారాముల కల్యాణానికి పసుపు తయారు

ప్రజాశక్తి- ఒంటిమిట్ట

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట సీతారాముల కల్యాణ మహోత్సవాలు 'హరిద్రా ఘటనం'తో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది తొలిసారిగా టిటిడి ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా మహిళలు సుమారు మూడు కిలోల పసుపును సంప్రదాయబద్దంగా దంచారు. అంతకుముందు గర్భాలయం లోపల పసుపు కొమ్ములకు, రోకళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రవణ స్వామి మాట్లాడుతూ.. హరిద్రా ఘటనంతో సీతారామ కల్యాణ మహోత్సవ ఏర్పాట్లకు నాంది పలికినట్లు అయిందన్నారు. ఈ కార్యక్రమం ప్రాధాన్యత వివరించారు. ఈ పసుపును కల్యాణం నాడు నిర్వహించే స్నపనం, తలంబ్రాలు తయారీకి ఉపయోగిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రాఘువాచార్యులు, ఒంటిమిట్ట ప్రత్యేక అధికారి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.


వైసిపి పి.గన్నవరం ఎమ్మెల్యే చిట్టిబాబును కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న షర్మిల

బిజెపితో స్నేహం కోసం రాష్ట్రం తాకట్టు

- భూమి పూజకే 'ఉక్కు' పరిమితం
- సిఎం జగన్‌పై విమర్శలు గుప్పించిన వైఎస్.షర్మిల

ప్రజాశక్తి – వైఎస్ఆర్ జిల్లా యంత్రాంగం

బిజెపితో స్నేహం కోసం పోలవరం ప్రాజెక్టు, స్పెషల్ స్టేటస్, రాజధానిని తాకట్టు పెట్టిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి, జిల్లా అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊసే లేదన్నారు. శనివారం వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజవకర్గాల్లో ఆరో రోజు ఆమె బస్సుయాత్ర నిర్వహించారు. బస్సుయాత్రల్లో ఆమె మాట్లాడుతూ..యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు వైసిపి ప్రభుత్వం ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వివేకానందరెడ్డిని క్రూరంగా హత్య చేసింది ఎంపి అవినాష్‌రెడ్డి అని సిబిఐ ఆధారాలు చూపుతున్నా నిందితుడిని సిఎం జగన్ కాపాడుతున్నారని ఆరోపించారు. తన పర్యటనకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి కడప ఎంపి అభ్యర్థిని మార్చేందుకు సిఎం జగన్ అడుగులు వేస్తున్నారన్నారు. 'ప్రశాంతంగా ఉన్న పులివెందులలో షర్మిల, సునీత అల్లర్లు రేపుతున్నారని, వివేకాను ఎవరు చంపారో తేలకుండా ఎలా మాట్లాడుతారని' షర్మిల మేనత్త విమలారెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. వివేకానందరెడ్డి హత్య కేసులో ఆధారాలతోనే మాట్లాడుతున్నామని అన్నారు. వివేకా హత్య విషయంలో మేము ఆరోపణలు చేయడం కాదు, సిబిఐ చూపించిన ఆధారాలను మాత్రమే మేము ఎత్తి చూపిస్తున్నామని చెప్పారు. రైతుకు మద్దతు ధర ఎక్కడ అని ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాల వల్ల కడప ఇండస్ట్రియల్ ఏరియా మూతపడుతున్న పట్టించుకోవడం లేదన్నారు. అంతకుముందు వైఎస్ వివేకానందరెడ్డి సమాధి వద్ద సునీత, షర్మిలతో పాటు పలువురు కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిన పి.గన్నవరం ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం వైసిపి ఎమ్మెల్యే చిట్టిబాబు షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. షర్మిలను చిట్టిబాబు సన్మానించారు.


పరిశ్రమ, లక్ష ఉద్యోగాలు ఎక్కడ?

కడప ఉక్కు పరిశ్రమ కేవలం భూమి పూజకే పరిమితమైందని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులతో కలిసి జమ్మలమడుగులోని ఉక్కు పరిశ్రమ స్థలాన్ని ఆమె పరిశీలించారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రెండుసార్లు ఇక్కడికి వచ్చారని..మొదటిసారి శంకుస్థాపనకు, రెండోసారి భూమిపూజకు పరిమితమయ్యారే తప్ప ఒక ఇటుక కూడా పేర్చలేదని తెలిపారు. ఉక్కు పరిశ్రమ, లక్ష ఉద్యోగాలు ఎక్కడని నిలదీశారు. ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ.. విభజన చట్టంలోని 13వ షెడ్యూల్లో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మించాలని ఉన్నా పూర్తి చేయలేని స్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు.

ఆర్థిక కేంద్రీకరణతో నియంతృత్వం

- ప్రముఖ ఆర్థికవేత్త పాపారావు

ప్రజాశక్తి-గుంటూరు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్థికవేత్త పాపారావు

ఆర్థిక కేంద్రీకరణ పెరుగుతున్న కొద్దీ.. రాజకీయ కేంద్రీకరణ కూడా సమాంతరంగా పెరుగుతుందని ఆర్థికవేత్త, స్వతంత్ర జర్నలిస్టు డి.పాపారావు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో విద్యా సదస్సు నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సదస్సులో పాపారావు మాట్లాడుతూ.. సంస్కరణల అమలు వల్ల ఆర్థిక అసమానతలు మరింత పెరిగాయన్నారు. 1982 నాటికి వంద రూపాయల ఆదాయంలో 6 శాతం ఆదాయం ఒక్క శాతంగా ఉన్న ధనవంతులకు వెళ్లేదని, ఇప్పుడదని 22.5 శాతానికి చేరిందన్నారు. ఆర్థికవేత్త తామస్ పికెట్ విడుదల చేసిన పత్రాల ప్రకారం వలసపాలన నాటి కంటే ప్రస్తుత బిలీయనీర్ల రాజ్యంలో ఆర్థిక అసమానతలు పెరిగాయని వివరించారు. 1930–1979 వరకూ సంక్షేమ రాజ్యాలు ఏర్పడ్డాయని, ఫలితంగా సామాన్యులకు కొన్ని సబ్సిడీలు, కార్మికులకు హక్కులు వచ్చాయన్నారు. ఆ తర్వాత కాలంలో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం, సంస్కరణల అమలు ఫలితంగా సంక్షేమ రాజ్యాలు క్రమంగా నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. అన్ని రంగాలపై సంస్కరణల ప్రభావం పడిందన్నారు. ఫలితంగా ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు పెరిగాయన్నారు. ఈ క్రమంలోనే కొద్దిమంది చేతుల్లో సంపద పోగుపడుతుండడంతో ప్రజా స్వామ్య పాలన క్రమంగా నీరు గారుతుందని, నియంతృత్వ ధోరణి పెరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు 'ఆర్థిక సంస్కరణలు – విద్యా రంగంపై ప్రభావం' అనే అంశంపై మాట్లాడారు. రాజ్యాంగ లక్ష్యాలైన ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం విద్య ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని, అందుకోసం ఉపాధ్యా యులు కృషి చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణకు అనుసరించాల్సిన విధానాలపై త్వరలోనే టీచర్స్ మేనిఫెస్టో విడుదల చేస్తామని తెలిపారు. సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ సంక్షేమ పథకాలే చంద్రబాబుకు స్ఫూర్తి

- 'నిజం గెలవాలి' ముగింపు సభలో నారా భువనేశ్వరి

ప్రజాశక్తి – తిరువూరు (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ సంక్షేమ పథకాలే చంద్రబాబుకు స్ఫూర్తి అని నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి" పేరుతో అక్టోబర్ 25న ఆమె ప్రారంభించిన యాత్ర శనివారం కృష్ణా జిల్లా తిరువూరులో ముగిసింది. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక చనిపోయిన ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మండలం కాకర్లకు చెందిన విశ్వనాథం, తిరువూరుకు చెందిన కుంచం సుబ్బారావు కుటుంబాలను ఆమె పరామర్శించారు. బాధిత కుటుంబాలకు సాయం అందించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో భువనేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలోని 95 నియోజకవర్గాల్లో పర్యటించి సుమారు 203 కుటుంబాలను పరామర్శించానని, ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున సాయం అందించామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉంటానన్నారు. పేదలకు ఎన్‌టి రామారావు అనేక సంక్షేమ పథకాలు తెచ్చారని, అదే స్ఫూర్తితో చంద్రబాబు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం పేదలకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే జగన్ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసి పేదల పొట్ట కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు సిఎంగా కొనసాగి ఉంటే పోలవరం పూర్తయ్యేదని, రాష్ట్రానికి కరువు పరిస్థితి ఏర్పడేది కాదన్నారు. చంద్రబాబు విజన్ ఐటి రంగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని సాయినాథ్ (చిన్ని), తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బహిరంగ సభలో ప్రసంగిస్తున్న బాలకృష్ణ, పక్కన కందికుంట వెంకటప్రసాద్, తదితరులు

జగన్ పాలనంతా నయవంచనే

- వైసిపిని ఇంటికి పంపేందుకు ప్రజలందరూ సిద్ధం
- నవ్యాంధ్ర సాకార యాత్రలో బాలకృష్ణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆంధ్రప్రదేశ్‌ను రాజధాని లేని రాష్ట్రంగా మార్చిన వైసిపిని ఇంటికి పంపేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన మొత్తం నయవంచనతో సాగిందన్నారు. అభివృద్ధిలో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని విమర్శించారు. 'నవ్యాంధ్ర సాకర యాత్ర' పేరిట బాలకృష్ణ చేపట్టిన యాత్ర శనివారం సత్యసాయి జిల్లా కదిరి నుంచి ప్రారంభమైంది. ముందుగా కదిరిలో శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పివిఆర్ గ్రాండ్‌లో గిరిజనులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి, అక్కడి నుంచి రోడ్‌షో చేపట్టారు. కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో జీవిమాన్ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో బాలకృష్ణ మాట్లాడారు. అన్ని రంగాల్లోనూ రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని విమర్శించారు. సిఎం చుట్టూ దుష్ట చతుష్టయం ఉందని అన్నారు.

నవరత్నాలు అంటూ నవనాడులను కుంగతీశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం టిడిపి పార్లమెంట్ అభ్యర్థి బికె.పార్థసారథితో పాటు పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభిమానిపై చేయి చేసుకున్న బాలయ్య

ఓ అభిమానిపై బాలకృష్ణ చేయిచేసుకున్నారు. కదిరిలో హెలిప్యాడ్ వద్దకు బాలయ్యను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు, టిడిపి కార్యకర్తలు వచ్చారు. ఈ క్రమంలో ఓ అభిమాని ఆయన దగ్గరకు దూసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆ అభిమానిపై బాలకృష్ణ చేయి చేసుకుని పక్కకు నెట్టేశారు.

బోర్నవీటా హెల్త్‌డ్రింక్ కాదు..!

- కేంద్రం కీలక ప్రకటన



న్యూఢిల్లీ : బోర్నవీటాను తయారు చేస్తున్న మోండెలెజ్ ఇండియా ఫుడ్స్‌కు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ భారీ షాక్ ఇచ్చింది. బోర్నవీటా హెల్త్ డ్రింక్ కాదని స్పష్టం చేసింది. ఈ విషయమై ఆ సంస్థ సహా, ఇ కామర్స్ కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. బోర్నవిటా సహా ఇతర పానియాలను హెల్త్ డ్రింక్స్' కేటగిరీ నుంచి తొలగించాలని ఇ–కామర్స్ వేదికలకు కేంద్రం ఏప్రిల్ 10న జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. పిల్లల హక్కుల పరిరక్షణ చట్టం– 2005 సెక్షన్ 3 ప్రకారం దేశంలోని ఆహార చట్టాలలో 'హెల్త్ డ్రింక్' అని ఎక్కుడా వినియోగించకూడదని రెగ్యూలేటరీ బాడీ తెలిపింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం 2006లో హెల్త్ డ్రింక్ అని దేన్నీ నిర్వచించలేదు. ఈ క్రమంలోనే బోర్నవీటా సహా అన్ని పానియాలను హెల్త్ డ్రింక్స్ కేటగిరీ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ)కి సమర్పించిన నియమాలు, నిబంధనల్లో బోర్నవీటాను హెల్త్ డ్రింక్‌గా నమోదు చేసినట్లు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇకపై హెల్త్ డ్రింక్ పేరుతో అమ్మకాలు నిర్వహిస్తే సదరు కంపెనీలపై చర్యలుంటాయని తెలిపింది.

ఎఫ్‌డిలపై శ్రీరామ్ ఫైనాన్స్ వడ్డీ రేట్ల పెంపు

హైదరాబాద్ : వివిధ కాలపరిమితుల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించినట్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ తెలిపింది. పలు ఎఫ్‌డిలపై 0.05 శాతం నుంచి 0.20 శాతం వరకు వడ్డీ రేట్లను పెంచినట్లు పేర్కొంది. డిపాజిట్, రెన్యువల్ సమయంలో 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పెట్టుబడిదారులు సంవత్సరానికి 0.50 శాతం అదనపు వడ్డీని పొందుతారని తెలిపింది. మహిళా పెట్టుబడి దారులకు ఏడాదికి 0.10 శాతం అదనపు వడ్డీని అందిస్తున్నట్లు పేర్కొంది.

హెచ్‌పి నుంచి కొత్త ఎఐ ల్యాప్‌టాప్‌లు

హైదరాబాద్ : ప్రముఖ కంప్యూటర్ల తయారీదారు హెచ్‌పి కొత్తగా కృత్రిమ మేధా (ఎఐ)తో కూడిన ల్యాప్‌టాప్‌లను విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో ఒమెన్ ట్రాన్సెండ్14, హెచ్‌పి ఎన్వీ ఎక్స్360 14 మోడళ్లను హెచ్‌పి ఇండియా కన్స్యూమర్ అండ్ గేమింగ్ పిసి హెడ్ గణేష్ టి ఆవిష్కరించారు. వీటి ధరలను వరుసగా రూ.1,74,999, రూ.99,999గా నిర్ణయించా మన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ల్యాప్‌టాప్‌లు మరింత వేగంగా, సమర్థంగా పనిచేయడానికి వాటిలో ఎఐ ఫీచర్లను జోడించా మన్నారు. ఒమెన్ ట్రాన్సెండ్14 విండోస్ 11 హోం ఆపరేటింగ్ సిస్టమ్, ఇంటెల్ కోర్ ఆల్ట్రా 9 ప్రాసెసర్, 14 అంగుళాల డిస్‌ప్లే, 11.5 గంటల బ్యాటరీ బ్యాకప్, ఎన్‌వీడియా జిఇఫోర్స్ ఆర్‌టిఎక్స్ 4060 గ్రాఫిక్‌కార్డుతో లభిస్తుందన్నారు. హెచ్‌పి ఎన్వీఎక్స్ 360 14 4జిబి గ్రాఫిక్ మెమరీ కెపాసిటీ, ఇంటెల్ 7 ప్రాసెసర్, 1టిబి ఎస్ఎస్‌డి, 16 జిబి ర్యామ్‌తో అందుబాటులోకి తెచ్చామన్నారు.



CHANGE OF NAME

I, Pratapaneni Ramdevi (Old Name), W/o Murali Rao, Resident of D. No : F-401, KNR Residency, Poranki - Nidamanuru Road, Poranki Krishna Dist, 521137. A.P. I have changed my name as Prathapaneni Ramdevi (New Name), W/o. Murali Rao, Hereafter my name is known as Prathapaneni Ramdevi (New name), S/o. Murali Rao

భారత రియాల్టీపై విదేశీ ఇన్వెస్టర్ల అనాసక్తి

- పెట్టుబడుల్లో 55 శాతం పతనం
- వెస్టియన్ రిపోర్ట్

న్యూఢిల్లీ : భారత రియల్ ఎస్టేట్ రంగంపై విదేశీ ఇన్వెస్టర్లు అనాసక్తిగా ఉన్నారు. ఈ రంగంలో ప్రస్తుత ఏడాది జనవరి నుంచి మార్చి కాలంలో 55 శాతం పతనంతో 552 మిలియన్ డాలర్ల (రూ.4600 కోట్లు)పెట్టుబడులు మాత్రమే పెట్టారని గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెంట్ వెస్టియన్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. 2023 ఇదే త్రైమాసికంలో 1.23 బిలియన్ డాలర్ల (రూ.10వేల కోట్లు) పెట్టుబడులు నమోదయ్యాయి. 2024 మార్చి త్రైమాసికంలో స్టాక్ మార్కెట్లలో ఈ విభాగంలో ఏకంగా 99 శాతం పతనంతో 11 మిలియన్ డాలర్ల పెట్టుబడులు చోటు చేసుకున్నాయి. ఈ విభాగంలో గతేడాది ఇదే త్రైమాసికంలో 791.4 మిలియన్ డాలర్ల విదేశీ నిధులు నమోదయ్యాయి. మరోవైపు గత జనవరి–మార్చితో ముగిసిన త్రైమాసికంలో దేశీయ ఇన్వెస్టర్లు రియాల్టీ సూచీల్లో 21 శాతం వృద్ధితో 541.1 మిలియన్ల పెట్టుబడులు పెట్టారు. అంతర్జాతీయంగా సూక్ష్మ ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక ఆందోళనలు, అనిశ్చితి నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడుల అంశంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని వెస్టియన్ సిఇఒ శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. గడిచిన మార్చి త్రైమాసికంలో వాణిజ్య ఆస్తులపై అత్యధికంగా 231.6 మిలియన్ల పెట్టుబడులు పెట్టారు. గతేడాది ఇదే సమయంలో ఏకంగా 484.8మిలియన్ల పెట్టుబడులు నమోదయ్యాయి.

భారత్‌లోకి ఎలన్ మస్క్ ఇంటర్నెట్ కంపెనీ..!

న్యూఢిల్లీ : ఎలన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్ భారత్‌లో ప్రవేశానికి ప్రయత్నిస్తోందని సమాచారం. టెస్లా కంపెనీ ప్రవేశానికి అనుకూలంగా ఇటీవల కేంద్రం విద్యుత్ వాహనాల పాలసీని రూపొందించిన విషయం తెలిసిందే. ఇక్కడ ప్లాంట్ పెట్టడానికి టెస్లా అధినేత ఎలన్ మస్క్ ఏప్రిల్ 21న భారత్‌కు రానున్నారు. టెస్లా ప్లాంట్ సహా స్టార్‌లింక్ అంశమై అధికారులతో చర్చించనున్నారు. శాటిలైట్ ఇంటర్నెట్ యూనిట్‌కు సంబంధించి లైసెన్స్ ప్రక్రియ ఇప్పటికే టెలికమ్యూనికేషన్స్ విభాగం(డిఒటి) పరిశీలనలో ఉంది. ఇటీవల శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల కోసం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఒఐ), ట్రయల్ స్పెక్ట్రమ్‌పై పని చేసేందుకు డిఒటి అనుమతులు కూడా ఇచ్చింది. స్టార్‌లింక్‌కు అనుమతులిస్తే.. ఎయిర్‌టెల్, జియోకు గట్టి పోటీ ఎదురు కానుంది. ప్రముఖ ఇ–కామర్స్ సంస్థ అమెజాన్ సైతం శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం దరఖాస్తు చేసుకుంది.

IN THE COURT OF THE HON'BLE VI ADDL. DISTRICT& SESSIONS JUDGE RANGA REDDY DISTRICT AT :: KUKATPALLY
O.S. No. 233 OF 2023

Between:
M/s. GSMH INFRASTRUCTURE DEVELOPERS INDIA PVT.LTD & 1 Other.
...Petitioners

AND


27 ADITRI INFRA, Rep by its Managing Partner-R Raghuveerreddy, S/o. Narsimha Reddy, Aged 42 Years, R/o. Plot No.11, Madhava Nagar,Miyapur, Serlingampally Mandal, R.R. District
41 Rayudu Venkata Ramani W/o. R.Mohan Rao Age 68 years, Occ: House wife, R/o. Vallivari village, Tenali Taluka, Guntur District.
...Respondents / Defendants

PUBLIC NOTICE


M/s. GSMH INFRASTRUCTURE DEVELOPERS INDIA PVT.LTD and another, in O.S. No. 233 OF 2023, on the file of VI ADJ, Kukatpally, R.R.District gives this public notice. The above defendants herein are informed to appear either in person or through their Counsel before the Honourable VI ADJ Court, Kukatpally, R.R. District on **22-04-2024** at **10.30** either in person or counsel failing which the matter will be decided in your absence.

Sd/-
Smt. A.V.S. Laxmi
Advocate
Ph: 9849013254

కేరళలో ఎల్‌ఎడిఎఫ్ ప్రచార జోరు









- బాలారిష్టాలతో యుడిఎఫ్
- విద్వేష కుట్రలతో బిజెపి

తిరువనంతపురం నుంచి సజిత్ సుబ్రమణియన్

లోక్ సభ ఎన్నికలు ఏడు దశల్లో జరుగుతుండగా, మొదటి దశ పోలింగ్ ఈ నెల 19 కాగా, రెండవ దశలో కేరళలోని అన్ని లోక్‌సభ స్థానాలకూ పోలింగ్ జరుగుతోంది. దక్షిణాది రాష్ట్రమైన కేరళ బిజెపికి లక్ష్యంగా మారింది. మరోవైపు కాంగ్రెస్ కూడా రాష్ట్రంలో బలం పుంజుకోవాలని ప్రయత్నిస్తోంది. పైగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు దేశ వ్యాప్తంగా ఇండియా ఫోరం నెలకొల్పగా, అందులో ఉన్న సిపిఎం, వామపక్షాలపై కేరళలో టార్గెట్ చేసి మరీ కాంగ్రెస్ పోటీ చేస్తోంది. ఈ ఎన్నికల్లో కేరళలో త్రిముఖ పోటీ జరుగుతున్న నేపథ్యంలో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్, బిజెపి ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మిగతావారి కంటే ఎల్‌డిఎఫ్ ప్రచారంలో ఎంతో ముందుంది. కాంగ్రెస్ ప్రచారం నెమ్మదిగా సాగుతోంది.

కాంగ్రెస్ ఎంపీల మౌనంపైనే చర్చ

ఈ ఎన్నికల ప్రచారంలో పౌరసత్వ సవరణ బిల్లు, ఎన్ఐఎ, యుసిసి, అయోధ్య రామ మందిరం వంటి అంశాలను బిజెపి ప్రచారాస్త్రాలుగా ఉపయోగిస్తోంది. కాంగ్రెస్ మృదు హిందూత్వ విధానాన్ని అవలంబించడంతో రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ ఎంపీల పనితీరు చూసుకున్నా.. నాయకత్వంపైనా ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఉదాహరణకు గతంలో యుడిఎఫ్ నుంచి గెలిచిన 18 మంది ఎంపీలు పార్లమెంట్ చర్చల్లో నోరు మెదపలేదు. ముఖ్యంగా మైనారిటీల సమస్యల్ని లేవనెత్తడంలోనూ వారు చాలా పేలవంగా వ్యవహరించారు. మోడీ ప్రభుత్వం కేరళపై ఆర్థిక ఆంక్షలు విధించినప్పుడు కూడా యుడిఎఫ్ ఎంపీలు నోరు మెదపలేదు. మోడీ ప్రభుత్వానికి అనుకూలంగానే వ్యవహరించారు. ఇదే సమయంలో సిపిఎం ఎంపీలు ఎ.ఎం ఆరిఫ్, థామస్ చజికదన్ మోడీ ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను నిరసించి వ్యతిరేకించడంలో పార్లమెంటులో క్రియాశీలక పాత్ర పోషించారు.

హస్తం మెతక వైఖరి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఏకె ఆంటోనీ కుమారుడు అనిల్ ఆంటోనీ, మరో కాంగ్రెస్ నేత, మాజీ కేరళ ముఖ్యమంత్రి కె. కరుణాకరన్ కుమార్తె పద్మజ బిజెపిలో చేరినా కాంగ్రెస్ వారి పట్ల మెతక వైఖరి వ్యవహరించింది. ఈ అంశం కూడా కేరళ రాజకీయాల్లో ప్రముఖంగా చర్చనీయాంశమైంది.

ముఖ్యమంత్రి పినరయ్ సారథ్యంలో..

బిజెపి ప్రధానంగా తిరువనంతపురం, త్రిస్సూర్ స్థానాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. తిరువనంతపురం నుంచి రాజీవ్ చంద్రశేఖర్, త్రిస్సూర్ నుంచి సురేష్ గోపి పోటీ చేస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పలుమార్లు ప్రచారంలో పాల్గొన్నారు. ఇటీవల త్రిస్సూర్‌లోని సిపిఎం ఆధ్వర్యంలోని సహకార బ్యాంకులపై దాడులు చేసేందుకు ఐటి అధికారుల బృందాన్ని రంగంలోకి దింపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లెఫ్ట్ ఫ్రంట్ ఎంపీల సంఖ్యను పెంచేందుకు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి గోవిందన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం సహా ఎల్‌డిఎఫ్ నేతలు అవిరళ కృషి చేస్తున్నారు.

ఎవరెక్కడ?

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ గతంలో ప్రాతినిధ్యం వహించిన పాలక్కాడ్‌లో పోటీ చేస్తున్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు కె.కె శైలజ వడకర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. గత మూడు ఎన్నికల్లో ఈ స్థానం నుంచి కాంగ్రెస్ గెలుపొందుతోంది. కొజికోడ్ నుంచి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎలమరం కరీం, డాక్టర్ థామస్ ఇసాక్ (పతనంతిట్ట), రాధాకృష్ణన్ (అలత్తూర్) నుంచి పోటీ చేస్తున్నారు. వయనాడ్‌లో రాహుల్‌గాంధీపై ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నేత అన్నీ రాజా పోటీ చేస్తున్నారు. అలప్పుజలో ఎం.ఎ ఆరిఫ్ పోటీ చేశారు. సిపిఎం కన్నూర్ జిల్లా కార్యదర్శి ఎం.వి జయరాజన్ (కన్నూర్), కాసర్‌కోడ్ జిల్లా కార్యదర్శి ఎం.వి బాలకృష్ణన్ (కాసర్‌కోడ్), తిరువనంతపురం జిల్లా కార్యదర్శి వి. జాయ్ (అట్టింగల్)లో పోటీ చేస్తున్నారు. మాజీ విద్యాశాఖా మంత్రి సి. రవీంద్రనాథ్ (చలకుడి), నటుడు ఎం. ముఖేష్ (కొల్లం), జాయిస్ జార్జ్ (ఇడుక్కి), కె.ఎస్ హంస (పొన్నాని), డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వి వసీఫ్ (మలప్పురం)), కె.జె షైన్ (ఎర్నాకులం) పోటీ చేస్తున్నారు. ఎల్‌డిఎఫ్‌లో భాగంగా సిపిఐ వయనాడ్‌లో ఎ. రాజాతోపాటు వి.ఎస్. సునీల్ కుమార్ (త్రిస్సూర్), పన్నయన్ రవీంద్రన్ (తిరువనంతపురం), సి.ఎ అరుణ్ కుమార్ (మావెలిక్కర)లను బరిలోకి దింపింది.

నాలుగు నెలల్లో యాడ్స్ కోసం

బిజెపి రూ.39 కోట్ల ఖర్చు

ఈ ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావాలని బిజెపి ఎత్తులు వేస్తోంది. ముందస్తు వ్యూహంగా యాడ్స్ రూపంలో విపరీతంగా ఖర్చు పెట్టింది. ఈ ఐదేళ్ల కాలంలో ఎన్‌డిఎ హయాంలో చేసిన పనులను ఏకరువు పెడుతూ.. మోడీ నిలువెత్తు ఫొటోలతో హంగామా చేసింది. ఆన్‌లైన్ యాడ్స్ కోసమే కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టింది. కేవలం ఈ ఏడాది నాలుగు నెలల (జనవరి - ఏప్రిల్ 11 వరకు) కాలంలో ఆన్‌లైన్ యాడ్స్ కోసం బిజెపి సుమారు రూ.39 కోట్లు ఖర్చు చేసిందని గూగుల్ యాడ్స్ ట్రాన్స్‌ప్రెన్సీ సెంటర్ లెక్కలే చెబుతున్నాయి. నాలుగు మాసాల్లో 80,667 గూగుల్ రాజకీయ ప్రకటనల కోసం రూ. రూ.39,41,78,750 పే చేసింది.

ఆ రాష్ట్రాలే టార్గెట్

ఉత్తరప్రదేశ్, ఒడిశా, బీహార్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలను బిజెపి లక్ష్యంగా చేసుకుని ప్రకటనల రూపంలో కోట్లాదిగా ఖర్చుపెట్టింది. ఒక్కో రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల కంటే ఎక్కువే ప్రకటనల రూపంలో ఖర్చుపెట్టినట్లు గూగుల్ ఇన్‌సైట్స్ వెల్లడించింది. రాష్ట్రాల వారీగా చూసుకుంటే యుపిలో 3.38 కోట్లు, లక్షద్వీప్‌లో 5 కోట్లను ఖర్చు చేసింది. దాదాపు మొత్తంగా 39.4 కోట్లలో 75 శాతం గూగుల్ వీడియో ప్రకటనలకు, 9.58 కోట్లు చిత్ర ప్రకటనల కోసం ఖర్చు చేసింది. హిందీ, ఇంగ్లీషు, వంటి వివిధ భాషలలో యాడ్స్‌ను రూపొందించారు.

కాంగ్రెస్ సైతం..

దేశంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ కూడా గూగుల్ యాడ్స్ కోసం కోట్లాది రూపాయల్ని ఖర్చు చేసింది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ 11 వరకు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సి) 736 ఆన్‌లైన్ యాడ్స్ కోసం రూ.8.12 కోట్లు ఖర్చు చేసింది. మహారాష్ట్ర, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుని ఖర్చు చేసింది. బిజెపి నాలుగు నెలల నుంచే పక్కా ప్రణాళికగా ఖర్చు పెట్టింది. కాంగ్రెస్ మాత్రం కేవలం ఏప్రిల్ ప్రారంభం నుంచే యాడ్స్‌పై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ వీడియో ఆధారిత ప్రకటనలకే కాంగ్రెస్ మొగ్గుచూపింది.

ఎలక్షన్ డెస్క్



గంగానగర్, షెకావతి ప్రాంతాల్లో బిజెపి లెక్కలు తలకిందులు

- అసెంబ్లీకి భిన్నంగా లోక్‌సభ ఎన్నికలు
- ఇండియా ఫోరంలో భాగంగా సిపిఎం, ఆర్‌ఎల్‌పి పోటీ
- ఆ పార్టీలకు బలమైన ఓట్ బ్యాంక్

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్ రాజకీయాల్లో కీలకమైన షెకావతి, గంగానగర్ ప్రాంతాలు లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా బ్లాక్‌కు సహాయపడతాయని బిజెపి ఆందోళన చెందుతోంది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్ బిజెపి వెంటే ఉంది. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బిజెపి విజయం సాధించింది. అయితే కొన్ని నెలల తరువాత రాష్ట్ర రాజకీయాల్లో చోటు చేసుకున్న కొన్ని మార్పులు బిజెపికి ప్రతికూలంగా మారాయి. తొలి విడత పోలింగ్ జరిగే షెకావతి, గంగానగర్ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా ప్రతిబింబిస్తుందని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పేమారామ్ తెలిపారు.

షెఖావతి ప్రాంతంలోని చురు, జున్‌ఝున్, సికార్, నాగౌర్ నియోజక వర్గాలు, గంగానగర్, బికనీర్ నియోజక వర్గాల్లో బిజెపి సవాళ్లను ఎదుర్కోనుంది.

తప్పు సరిదిద్దుకున్న కాంగ్రెస్

అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఇండియా ఫోరం ఆలోచన నుంచి కాంగ్రెస్ వెనక్కి తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పును లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సరిదిద్దుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం వామపక్షాలు, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీతో అవగాహనకు సుముఖత వ్యక్తం చేసింది. సికార్ సీటును సిపిఎంకు, నాగౌర్ సీటును ఆర్‌ఎల్‌పికి కేటాయించారు. ఈ రాజకీయ మార్పు వల్లే బిజెపి ఆందోళన చెందుతోందని పేమారామ్ అన్నారు.

ప్రభావవంతం

షెకావతి, గంగానగర్ ప్రాంతాల్లో సిపిఎం, ఆర్‌ఎల్‌పి రెండూ బలంగా ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లోని నియోజకవర్గాల నుంచి సిపిఎంకు దాదాపు నాలుగు లక్షల ఓట్లు వచ్చాయి. రెండు సీట్లల్లో రెండో స్థానంలో నిలిచింది. భద్ర నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో నిలిచిన రెండు స్థానాల్లో సిపిఎంకు 60 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌ఎల్‌పి అభ్యర్థి హనుమాన్ బేనివాల్ విజయం సాధించారు. సిపిఎం, ఆర్‌ఎల్‌పిలకు ఐదు శాతం ఓట్లు ఉన్నాయి. ఈ అంశాలన్నీ షెకావతి, గంగానగర్ ప్రాంతంలో బిజెపి లెక్కలను తలకిందులు చేస్తాయని పేమారామ్ అన్నారు. రాజస్థాన్‌లోని 12 లోక్‌సభ నియోజకవర్గాల్లో తొలి దశలో ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది. షెఖావతి, గంగానగర్ ప్రాంతాల్లోని సీట్లతో పాటు, జైపూర్, జైపూర్ రూరల్, దౌసా, కరౌలి, ధోల్పూర్, అల్వార్, భరత్‌పూర్ నియోజకవర్గాలు కూడా ఇందులో ఉన్నాయి.

గత ఐదేళ్లలో 15 శాతం పెరిగిన అవినీతి


- సిఎస్‌డిఎస్-లోక్‌నీతి ప్రీ పోల్ సర్వే వెల్లడి

యుపిఎ ప్రభుత్వ హయాంలో అవినీతి పెరిగిపోయిందని, అవినీతిని అంతమొందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చింది. కానీ ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో.. ముందటి కంటే అవినీతి పెరిగిపోయిందని పలు సర్వేలు వెల్లడించాయి. మరీ ముఖ్యంగా గత (2019-2024) ఐదేళ్లలో అవినీతి గణనీయంగా పెరిగిందని తాజా సిఎస్‌డిఎస్ - లోక్‌నీతి ప్రీ పోల్ సర్వేలో వెల్లడైంది. 2019 ప్రీ పోల్ సర్వేతో పోలిస్తే 2024లో దాదాపు 15 శాతం అవినీతి పెరిగిందని సిఎస్‌డిఎస్ లోక్‌నీతి ప్రీ పోల్ సర్వే బట్టబయలు చేసింది.

15 శాతం పెరుగుదల

2019లో 40 శాతం అవినీతి ఉంటే.. ఇప్పుడు 2024కి 55 శాతం అవినీతి పెరిగింది. కానీ దీనికి విరుద్ధంగా బిజెపి నేతలు వాదిస్తారు. 2019లో 37 శాతం ఉన్న అవినీతి కాస్తా.. 2024కల్లా 19 శాతానికి తగ్గిందని నీతులు చెబుతున్నారు. బిజెపి నేతలు చెబుతున్నదానికి వాస్తవ విరుద్ధంగా అవినీతి ఉందని లోక్‌నీతి ప్రీ పోల్ సర్వే లెక్కలు చెబుతున్నాయి.

దేశంలో అవినీతి పెరిగిందా, తగ్గిందా అని గ్రామీణ ప్రజలను అడిగితే.. కచ్చితంగా అవినీతి పెరిగిందనే అభిప్రాయం వెలిబుచ్చారు. పట్టణ, నగర జనాభాలో కూడా ఇదే అభిప్రాయం ఉంది. ఇక పేద, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి, ధనిక వర్గాల అభిప్రాయం చూసుకున్నా.. దాదాపు 55 శాతం మంది అవినీతి పెరిగిందని చెబుతున్నారు. అవినీతిపై తటస్థంగా ఉన్న వారు 20శాతానికి పైగానే ఉన్నారు.



కేంద్రానిదే ఎక్కువ పాత్ర

ప్రధానంగా అవినీతి పెరగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణంగా భావిస్తున్నట్లు 56 శాతం మంది సర్వేలో తెలిపారు. కానీ దేశంలో ఎక్కువగా అవినీతి పెరగడానికి రాష్ట్ర ప్రభుత్వానికన్నా.. కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అని చాలామంది ప్రజానీకం అభిప్రాయపడ్డారు. మరి ఎన్‌డిఎ హయాంలో జరిగిన అవినీతి ప్రభావం ఓటింగ్‌పై ప్రతికూలంగా ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. ఏ మేరకు ఓటర్లపై అవినీతి ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సిందే.

ఎలక్షన్ డెస్

జనాభా	పెరిగింది	తగ్గింది	తటస్థం
గ్రామీణ జనాభా	55 శాతం	19 శాతం	18 శాతం
పట్టణ జనాభా	53 శాతం	19 శాతం	23 శాతం
నగర జనాభా	57 శాతం	19 శాతం	16 శాతం

ఆర్థిక తరగతి	పెరిగింది	తగ్గింది	తటస్థం
పేద వర్గం	58 శాతం	16 శాతం	17 శాతం
దిగువ మధ్యతరగతి	54 శాతం	19 శాతం	19 శాతం
మధ్యతరగతి	53 శాతం	20 శాతం	20 శాతం
ధనిక వర్గం	57 శాతం	23 శాతం	17 శాతం

పుదుచ్చేరిలో కాంగ్రెస్ వర్సెస్ బిజెపి

- పోటీ పెట్టకుండా బిజెపికి వదిలేసిన సిఎం రంగస్వామి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- పుదుచ్చేరి

కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నికలకు ముందు రాజకీయం రసవత్తరంగా మారింది. ఇక్కడ ఇండియా ఫోరం తరపున డిఎంకె, వామపక్షాలు, విసికె బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పోటీ చేస్తున్నారు. మరోవైపు ఎఐఎన్‌ఆర్సి పార్టీ నేత, ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి బలపరిచిన బిజెపి అభ్యర్థి పోటీ చేస్తున్నారు. ఇటీవల ఎన్డిఎ నుంచి బయటకొచ్చిన అన్నాడిఎంకె సైతం పోటీలో ఉంది. మూడు పార్టీలు పోటీ చేయడంతో పుదుచ్చేరిలో త్రిముఖ పోటీ నెలకొంది. ఏది ఏమైనా బిజెపి గెలుపు అంత సులువేం కాదని తెలుస్తోంది. ఇక్కడ ఏప్రిల్ 19న ఎన్నికలు జరగనున్నాయి.

ఎల్‌జిల తలనొప్పి


పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం కావడంతో ప్రతిదానిలో లెఫ్టినెంట్ గవర్నర్ల జోక్యం చేసుకుంటున్నారు. దీంతో ప్రజల ఓట్లతో గెలుపొందిన ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేయడానికి రాజీనామా చేసిన ఇన్‌ఛార్జి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళ సై సౌందరరాజన్, ఎన్నికైన ప్రజా ప్రభుత్వానికి సమాంతరంగా పరిపాలన చేశారని, ఇది సమాఖ్య వ్యవస్థపై దాడి అని ప్రతిపక్షం విమర్శించింది. దీనిపై ముఖ్యమంత్రి రంగస్వామి స్పందించాలని డిమాండ్ చేసింది. అలాగే అంతకు ముందు ఉన్న పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ కూడా ఇలానే వ్యవహరించారని, ఆమెను తప్పించాలని స్వయానా నాటి ముఖ్యమంత్రి నారాయణ స్వామిమి కేంద్రానికి ఫిర్యాదు చేశారు.

సామాజిక పరిస్థితులు

పుదుచ్చేరిలో ప్రదానంగా తమిళం, మలయాళం, తెలుగు మాట్లాడే ప్రజలు ఉన్నారు. పుదుచ్చేరి, కారైకాల్ దక్షిణ స్థావరాలలో తమిళం ప్రధానమైనది. మహీలో మలయాళం ఎక్కువగా ఉంది. తెలుగు ప్రధానంగా యానాంలో మాట్లాడతారు. ఉర్దూ, ఫ్రెంచ్, కన్నడ, హిందీ, గుజరాతీ, ఇంగ్లీష్, మరాఠీ కూడా ఉన్నాయి. నాలుగు ప్రాంతాలలో హిందువులు మెజారిటీగా ఉన్నారు. పుదుచ్చేరి, కారైకల్, మాహే, యానాంలో ముస్లింలు ముఖ్యమైన మైనారిటీగా ఉన్నారు. పుదుచ్చేరిలో క్రైస్తవులు అధిక సంఖ్యలో ఉన్నారు. కొంతమంది సిక్కులు, బౌద్ధులు, జైనులు కూడా ఉన్నారు.హిందువులు 83.39 శాతం, క్రైస్తవులు 10.88 శాతం, ముస్లింలు 4.37 శాతం ఉన్నారు. పుదుచ్చేరిలో ఎస్సి 16.19 శాతం, వన్నియర్ 39 శాతం,



ఎన్. రంగస్వామి



ఎ. నమశ్శివాయం

ఏ పార్టీ నుంచి ఎవరు పోటీ

పుదుచ్చేరిలో ఒకే ఒక ఎంపి స్థానం ఉంది. అక్కడ ప్రస్తుత కాంగ్రెస్ ఎంపి వి.వైతిలింగం ఉన్నారు. ఆయనే తిరిగి ఇండియా ఫోరం తరపున పోటీ చేస్తున్నారు. అన్నాడిఎంకె నుంచి తమిజ్వేందన్ బరిలో ఉన్నారు. బిజెపి అభ్యర్థిగా ప్రస్తుత పుదుచ్చేరి హోం మంత్రి ఎ. నమశ్శివాయం పోటీ చేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బిజెపిల మధ్యే కీలక పోటీ ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న రంగస్వామి తన పార్టీ ఎఐఎన్‌ఆర్సి తరపున అభ్యర్థిని బరిలోకి దింపకపోవడంపై ఆ పార్టీలో అసంతృప్తి పెరిగింది. మొత్తం ఓట్లు: 10,20,914, పురుషులు, 4,79,329, మహిళలు 5,41,437, ట్రాన్స్ జండర్ 148.

రాష్ట్ర హోదా డిమాండ్



పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని కూడా ఆమోదించింది. దాన్ని కేంద్రానికి పంపారు. ఇప్పటికీ మోక్షం రాలేదు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డిఎ ప్రభుత్వం ఉంది. డబుల్ ఇంజిన్ సర్కార్ పుదుచ్చేరికి ఎందుకు రాష్ట్ర హోదా ఇవ్వలేదని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇస్తామని పేర్కొంది.


కలం బాణాలు

ముస్లిం రిజర్వేషన్లు వద్దని నేను చెప్పలేదు... పురంధేశ్వరి



అయితే కావచ్చు గాని
ఈ కథనం ఫేకు
మన విధానమదేకదా
పురంధరీ స్పీకు

అమిత్ భాయ్ నోటివెంట
వచ్చినట్టి పలుకులు
ఫేకు షేకు ఏమున్నది
ఇవి పైపై తళుకులు



ధరలు,ఉద్యోగాలే ఎన్నికల సమస్యలు-సర్వే

రామాలయ నిర్మాణం
మన్ కీ బాత్ సందేశం
ఎవరికి కావాలండి
విశ్వగురూ విన్యాసం

జనమేమిటి కోరతారు
కూడుగుడ్డ కొలువు
అవికూడా కొరవడితే
ఎందుకు మీ కల్పతరువు?

ఎపి ప్రజలు తెలంగాణ కన్నా తెలివైన వారు- కెటిఆర్



హైదరాబాద్ సీట్లన్నీ
బిఆర్‌ఎస్ కైవశం
తెలివిగ ఓట్లేశారని
కెటిఆర్ పరవశం

నీటికన్న చిక్కనకద
సహోదరుల సంబంధం
సర్కారులు ఏవైనా
చరితార్థపు అనుబంధం

- తె.ర



'అన్నమయ్య'లో అసంతృప్తి సెగలు

● టిడిపికి తప్పని తిరుగుబాటు బెడద

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

అన్నమయ్య జిల్లా ఆరు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాన్ని కలిగి ఉంది. రాయచోటి అసెంబ్లీ బరిలో వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, టిడిపి నుంచి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ తరుపున అల్లాబకాష్ పోటీ పడుతున్నారు. రాయచోటి అసెంబ్లీలో 2.50 లక్షల ఓటర్లలో సుమారు లక్ష మంది ముస్లిం ఓటర్లు ఉన్నారు. టిడిపి అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి బక్రీద్ పండుగ సందర్భంగా విహెచ్‌పి కార్యకర్తలకు మద్దతుగా ఒంటెలను రానివ్వక పోవడం వంటి చేష్టలతో ముస్లిం ఓటర్లలో విముఖతను ఎదుర్కొంటున్నారు. రాయచోటి టిడిపి ఇన్‌ఛార్జి రమేష్‌రెడ్డికి టికెట్ లభించలేదు. ఫలితంగా ఆయన తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఆయన పార్టీ మారే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. పార్టీ మారితే లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాల్లో గణనీయ ప్రభావం పడనుంది. రాజంపేటలో వైసిపి తరుపున జడ్పీ చైర్మన్ అకేపాటి అమరనాధరెడ్డి, కూటమి తరుపున టిడిపి అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం బరిలో ఉన్నారు. కాంగ్రెస్ టికెట్ కేటాయించాల్సి ఉంది. టిడిపి టికెట్ కేటాయింపులో గందరగోళం నెలకొంది. టిడిపి ఇన్‌ఛార్జి బత్యాలకు టికెట్ ఇవ్వకపోవడం, పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారం సాగిన సుగవాసి బాలసుబ్రమణ్యానికి అసెంబ్లీ టికెట్ కేటాయించడం అసంతృప్తుల్ని రాజేస్తోంది. మాజీ ఎమ్మెల్సీ బత్యాల ఇండిపెండెంట్‌గా ఎన్నికల బరిలో దిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. రైల్వేకోడూరు రిజర్వుడ్ స్థానంలో వైసిపి తరుపున సిట్టింగ్ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, కూటమి తరుపున జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, కాంగ్రెస్ టికెట్ గోశాలాదేవి పోటీ చేయనున్నారు. రైల్వేకోడూరు కూటమి అభ్యర్థికి ముక్కా రూపానందరెడ్డి అంతా తానై వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. టిడిపి సీనియర్ నాయకులు కస్తూరి విశ్వనాధనాయుడు నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది.



చిత్తూరులో మూడు

మదనపల్లిలో వైసిపి నుంచి కొత్త అభ్యర్థి నిస్సార్ అహ్మద్, టిడిపి తరుపున మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, కాంగ్రెస్ నుంచి పవన్ కుమార్‌రెడ్డి పోటీ చేయనున్నారు. వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది.

రాజంపేటలో మాజీ సిఎం

రాజంపేట లోక్‌సభ స్థానంలో సిట్టింగ్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కూటమి తరుపున బిజెపి అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి బరిలో దిగుతున్నారు. గత ఎన్నికల్లో ప్రస్తుత బిజెపి అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి పోటీ చేసి ఓటమి పాలు కావడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రాజంపేట పార్లమెంట్ బరిలో స్థానికుడిని బరిలో నిలపాలనే ఉద్దేశంతో పీలేరుకు చెందిన మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డిని బరిలో నిలిపినట్లు తెలుస్తోంది. పీలేరు అసెంబ్లీ సొంత నియోజకవర్గం కావడం, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో స్వంత సామాజిక వర్గంలో పలుకుబడిని కలిగి ఉండడంతో గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. వైసిపి అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సైతం పుంగనూరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో తండ్రి, పినతండ్రులు పోటీ చేస్తుండడం కలిసొచ్చే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

పీలేరులో వైసిపి తరుపున చింతల రామచంద్రారెడ్డి, టిడిపి తరుపున నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి సోమశేఖర్‌రెడ్డి పోటీ చేయనున్నారు. వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే, టిడిపి తరుపున పోటీ పడుతున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి మధ్య తీవ్రమైన పోటీ నెలకొనే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. తంబళ్లపల్లిలో వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి, టిడిపి తరుపున జయచంద్రారెడ్డి, కాంగ్రెస్ నుంచి ఎం.ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేయనున్నారు. వైసిపి, టిడిపి మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది.

ఏలూరులో సం'కుల' సమరం

● అభ్యర్థులు ఖరారు
● సమరానికి సిద్ధమైన పార్టీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానం ఉన్నాయి. ఈ స్థానాల్లో గత ఎన్నికల్లో వైసిపి ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుని క్లీన్‌స్వీప్ చేసింది. ఈసారి ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఎన్నికల బరిలోదిగా, వైసిపి ఒంటరిగా ముందుకు సాగుతోంది. ఇరుపార్టీలు అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయడంతో ఎన్నికల బరిలో నువ్వానేనా అన్నట్లు అంతా తలపడుతున్నారు. ఈ క్రమంలో అభ్యర్థులు తమ బలాలు, బలహీనతలను గుర్తించి ఎన్నికల ప్రణాళికలు రచిస్తున్నారు.

ముక్కోణ పోటీకి అడుగులు

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలిచారు. మరోసారి వైసిపి నుంచి ప్రస్తుత ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి ఆళ్ల నాని పోటీ చేస్తున్నారు. గతంలో ఎంఎల్‌ఎగా గెలుపొందిన అనుభవం ఉంది. సొంతబలంతోపాటు పార్టీబలం కూడా ఈయనకు కలిసొస్తోంది. టిడిపి నుంచి మాజీ ఎంఎల్‌ఎ బడేటి బుజ్జి సోదరుడు చంటి ఇక్కడ పోటీ చేస్తున్నారు. పార్టీబలంతోపాటు కుటుంబపరంగా సొంత బలం ఉన్న వ్యక్తి. ఈ సీటు ఇండియా వేదికలో భాగంగా సిపిఐకు కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా కార్మిక, వ్యవసాయ కార్మిక నేతగా గుర్తింపు పొందిన బండి వెంకటేశ్వరరావు బరిలో నిలవనున్నారు. దెందులూరులో 2019లో వైసిపి అభ్యర్థి గెలుపొందారు. ప్రస్తుత ఎంఎల్‌ఎ కొఠారు అబ్బాయిచౌదరి మరోసారి పోటీ చేస్తున్నారు. టిడిపి నుంచి మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పోటీచేస్తున్నారు. గతంలో ఈయన ఇదే నియోజకవర్గంలో రెండుసార్లు ఎంఎల్‌ఎగా పని చేశారు. కాంగ్రెస్ నుంచి ఆలపాటి నరసింహారావు ఇక్కడ పోటీ చేస్తున్నారు. ఉంగుటూరులో గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి వైసిపి అభ్యర్థి గెలుపొందారు. ప్రస్తుత ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు మరోసారి ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నారు. పార్టీబలంపైనే ఎక్కువగా ఆధార పడాల్సిన పరిస్థితి ఉంది. పొత్తులో భాగంగా ఈస్థానం జనసేనకు కేటాయించారు. జనసేన అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు పోటీ చేస్తున్నారు. రాజకీయాల్లో కొత్తగా ప్రవేశించిన వ్యక్తి. ఆర్థిక బలంతోపాటు జనసేనకు బలమైన ఓటుబ్యాంకుగా ఉన్న ఒక సామాజిక తరగతి ఇక్కడ ఎక్కువగా ఉండటం కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. కాంగ్రెస్ నుంచి పాతపాటి హరికుమార్‌రాజు పోటీ చేస్తున్నారు. ఎస్‌సి రిజర్వ్‌డ్‌గా ఉన్న చింతలపూడిలో గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా రవాణాశాఖ అధికారిగా పనిచేసిన కంభంపాటి విజయరాజు పోటీ చేస్తున్నారు. పార్టీబలంపైనే ఆధాపడటం తప్ప సొంత బలం పెద్దగా లేదు. టిడిపి నుంచి ఎన్‌ఆర్‌ఐ సొంగా రోషన్‌కుమార్ పోటీ చేస్తున్నారు. ఈయన పార్టీబలంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఎక్కువగా ఉంది. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రస్తుత వైసిపి ఎంఎల్‌ఎగా ఉన్న ఎలిజా పోటీ చేస్తున్నారు. ఇటీవలే ఆయన కాంగ్రెస్‌లో చేరి టిక్కెట్ దక్కించుకున్నారు. ఎస్‌టి నియోజకవర్గంగా ఉన్న పోలవరంలో గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో వైసిపి నుంచి ప్రస్తుత ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు భార్య తెల్లం రాజ్యలక్ష్మి పోటీచేస్తున్నారు. సొంత బలంతోపాటు, పార్టీ బలం ఇక్కడ ఉంది. పొత్తులో భాగంగా ఈస్థానం జనసేనకు కేటాయించారు. జనసేన అభ్యర్థిగా చిర్రిబాలరాజు పోటీచేస్తున్నారు. 2019లోనూ జనసేన నుంచి పోటీచేసి ఓటమిచెందారు. కాంగ్రెస్ నుంచి దువ్వెల సృజన పోటీ చేస్తున్నారు. ఈమె వైసిపి నుంచి కాంగ్రెస్‌లో చేరారు.




బిజెపికి 'కొల్లేరు'

కైకలూరు నియోజకవర్గంనుంచి గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో ప్రస్తుత ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు మరోసారి పోటీలో ఉన్నారు. అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. పొత్తులో భాగంగా ఈ స్థానం బిజెపికి కేటాయించారు. మాజీ ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ ఇక్కడ నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. గతంలో బిజెపి ఎంఎల్‌ఎగా, మంత్రిగా పని చేశారు. కాంగ్రెస్ నుంచి బొడ్డు నోబుల్ పోటీ చేస్తున్నారు. నూజివీడులో గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో ప్రస్తుత ఎంఎల్‌ఎగా ఉన్న మేకా వెంకటప్రతాప్ అప్పారావు మరోసారి పోటీ చేస్తున్నారు. అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. టిడిపి అభ్యర్థిగా వైసిపి నుంచి ఇటీవలే టిడిపిలో చేరిన పెనమలూరు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారధి పోటీచేస్తున్నారు. సామాజిక తరగతి బలంగా ఉండటం ఈయనకు కలిసొచ్చే అంశంగా అంచనా వేస్తున్నారు. టిడిపి నుంచి టిక్కెట్ ఆశించి భంగపడిన మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు రెబల్‌గా పోటీ చేస్తానని చెప్పడం టిడిపికి ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉంది. కాంగ్రెస్ నుంచి మరీదు కృష్ణ పోటీచేస్తున్నారు.

లోక్‌సభలో సోషల్ ఇంజనీరింగ్‌పై ఆశలు

గత ఎన్నికల్లో ఏలూరు ఎంపీగా వైసిపి అభ్యర్థి గెలుపొందారు. ఈసారి ఎన్నికలో వైసిపి నుంచి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్ యాదవ్ పోటీ చేస్తున్నారు. సొంతబలం ఏమీలేదు. పార్టీబలంతోనే ముందుకు సాగుతున్నారు. టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్‌యాదవ్ పోటీచేస్తున్నారు. ఇయనకు వ్యక్తిగత బలం లేదు. పార్టీబలంపైనే ఆధాపడాల్సిన పరిస్థితి. ఈపార్లమెంట్ స్థానంలో ఒక సామాజిక తరగతి ఓట్లు ఎక్కువగా ఉండటంతో రెండుపార్టీలు అదే సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులకు టిక్కెట్ కేటాయించిన పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ నుంచి ఎంపీ అభ్యర్థిగా కావూరు లావణ్య పేరు ప్రకటించారు.



కాస్ట్‌లీ ఎన్నికలు గురూ!

● బరిలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు
● నిఘా అధికారుల కన్నుగప్పి నగదు తరలింపు
● నోటిఫికేషన్‌కు ముందే రూ.100కోట్లు నగదు, డ్రగ్స్,లిక్కర్ పట్టివేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సాధారణ ఎన్నికలు వైసిపి, టిడిపికి ప్రతిష్టాత్మకంగా మారాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార పీఠమే లక్ష్యంగా ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న అభ్యర్థులను రెండు పార్టీలు పోటీలో నిలిపాయి. అభ్యర్థుల్లో అత్యధికంగా పారిశ్రామిక వేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు, వ్యాపారవేత్తలు ఉండటంతో డబ్బును మంచినీళ్ల ప్రాయం ఖర్చు చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈ ఎన్నికలు అత్యంత కాస్ట్‌లీ ఎన్నికలుగా మారనున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 18 న విడుదల కానుండగా, ఇప్పటికే రూ.100కోట్ల విలువైన డబ్బు, మద్యం, లిక్కర్, డ్రగ్స్, ప్రెషస్ మెటల్స్, ఫ్రీ బీస్సు(ఉచితాలు) ఇతర వస్తువులను ఈనెల 11 నాటికి జప్తు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా వెల్లడించారంటే ఈ ఎన్నికల్లో ధన ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. నోటిఫికేషన్ వెలువడక ముందే పోటీలో ఉండే అభ్యర్థులు విచ్చల విడిగా కోట్లాది రూపాయిలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి యదేశ్చగా తరలిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీలు విచ్చల విడిగా ఖర్చు చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయపార్టీలు ఒక్కోనియోజకవర్గానికి ఆయా పార్టీలు రూ.70 నుంచి రూ.100 కోట్లు ఖర్చు ఖర్చు పెట్టే అవకాశం లేక పోలేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నిఘా కళ్లుకప్పిగప్పి...

అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘాను ఉంచేందుకు ఎన్నికల కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. వీటికి తోడు అదనంగా పోలీస్, ఎక్సైజ్, ఇన్‌కమ్ ట్యాక్స్, ఫారెస్ట్, ఇడి, ఎన్‌సిబి, ఆర్‌పిఎఫ్, కస్టమ్స్‌కు తోడు అదనంగా మరో 20 ఏజెన్సీలను ఎన్నికలను రంగంలోకి దించారు. ఓటర్లను ప్రభావితం చేసే వస్తువులపై నిరంతరం నిఘా వేసేందుకు ఏజెన్సీలు పనిచేస్తుండగా వీరి కళ్లు గప్పి నగదును భారీగా తరలించేందుకు రాజకీయపార్టీలు గతానికి భిన్నంగా ఆర్టీసీ కార్గోలను సైతం ఉపయోగించుకుంటున్నతీరును ఎన్నికల అధికారులు బయటపెట్టారు. ఇందుకు తాజా ఉదాహరణగా ఈనెల 7న ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో ఎపిఎస్ ఆర్‌టిసి కార్గో సర్వీస్ వాహనంలో డ్రైఫ్రూట్స్ పెట్టెల మధ్య తరలిస్తున్న రూ.22.63లక్షల నగదును ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి జంగారెడ్డి గూడెం వస్తున్న ఆర్‌టిసి కార్గో వాహనం పట్టణంలోకి ప్రవేశించే సమయంలో అధికారులు పట్టుకున్నారు. నగదుకు సంబందించి ఎటువంటి రసీదులు లేక పోవడంతో జంగారెడ్డి గూడెం పోలీసులు సీజ్ చేశారు.



1978 ఎన్నికలు - ఐదేళ్లలో నలుగురు ముఖ్యమంత్రులు


మర్రి చెన్నారెడ్డి


టంగుటూరు అంజయ్య


భవనం వెంకట్రామరెడ్డి


కోట్ల విజయభాస్కరరెడి

1978 అసెంబ్లీ ఎన్నికల నాటికి రెండు కొత్త పార్టీలు రంగ ప్రవేశం చేశాయి. అప్పటివరకూ అధికారంలో ఉన్న 'భారత జాతీయ కాంగ్రెస్' చీలిపోయింది. చీలినవర్గం 'భారత జాతీయ కాంగ్రెస్ (ఇందిర)' పేరుతో ఆ ఎన్నికల్లో పోటీ చేసింది. అలాగే 1977 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసింది. ఈ పార్టీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. అప్పటివరకూ దాదాపు 26 యేళ్ల పాటు అధికారంలో కొనసాగిన కాంగ్రెస్ కేవలం 30 సీట్లతో మాత్రమే సంతృప్తి పడాల్సి వచ్చింది. సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పుచ్చలపల్లి సుందరయ్య స్వరాష్ట్రం వచ్చి మళ్లీ తన పాత నియోజకవర్గమైన గన్నవరం నుంచి పోటీ చేసి మంచి మెజారిటీతో విజయం సాధించి శాసనసభలో అడుగుపెట్టారు.

కేంద్రంలో అప్రతిహతంగా ప్రధానిగా కొనసాగుతూ వచ్చిన ఇందిరాగాంధీ 1977 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పార్టీగా మొదటిసారిగా పోటీ చేసి విజయం సాధించారు. 1977 లోక్‌సభ ఎన్నికల్లోనే కాంగ్రెస్‌ను ఓడించి అధికారం చేపట్టిన జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రతిపక్ష పాత్రకు పరిమితమైంది. దేశంలో ఒక తీర్పు, రాష్ట్రంలో మరో తీర్పు వెలువడింది. ముఖ్యమంత్రిగా మర్రి చెన్నారెడ్డి పదవి చేపట్టారు. ప్రతిపక్ష నాయకుడుగా గౌతు లచ్చన్నకు ప్రభుత్వ గుర్తింపు లభించింది. కాంగ్రెస్‌కు జలగం వెంగళరావు, సిపిఐ(ఎం)కు పుచ్చలపల్లి సుందరయ్య శాసనసభా పక్ష నేతలుగా ఎన్నికయ్యారు. సిపిఐ(ఎం), సిపిఐ శాసనసభా పక్షాలుగా సమర్థవంతంగా పనిచేశాయి. గమ్మత్తేమిటంటే.. అనంతర కాలంలో ప్రధాన ప్రతిపక్షం జనతా పార్టీ నుంచి.. అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ నుంచి.. గెలిచిన వారంతా ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ (ఇందిర)లో కలిసిపోయారు. చివరికి ఆ రెండు పార్టీలకూ శాసనసభా పక్ష నేతలు మినహా ఏ ఒక్క శాసనసభ్యుడూ మిగల్లేదు.

ముఖ్యమంత్రుల మార్పులో ఇందిరా కాంగ్రెస్ మార్క్

1978 ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ (ఇందిర) పార్టీ ఐదేళ్లు పరిపాలించడానికి తగిన మెజారిటీ ఉన్నప్పటికీ పూర్వపు కాంగ్రెస్ మాదిరిగా ఇందిరా కాంగ్రెస్ కూడా ముఖ్యమంత్రులను మార్చేసింది. ఒకరూ, ఇద్దరూ కాదు. ఏకంగా నలుగురు ముఖ్యమంత్రులను. ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రిగా మర్రి చెన్నారెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన 1980 అక్టోబరు 11 వరకూ ముఖ్యమంత్రిగా పనిచేశారు. అంటే రెండు సంవత్సరాల 219 రోజులు. అదే రోజు ఆరణాల కూలి అని ప్రచారంలో ఉన్న టంగుటూరు అంజయ్యను ముఖ్యమంత్రిని చేశారు. ఆయన 1982 ఫిబ్రవరి 24 వరకూ అంటే ఒక ఏడాదీ 136 రోజులు పాలించారు. ఇక భవనం వెంకట్రామరెడ్డి 1982 ఫిబ్రవరి 25 నుంచి అదే సంవత్సరం సెప్టెంబరు 20 వరకూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అంటే 218 రోజులు. మళ్లీ అదే సంవత్సరం సెప్టెంబరు 20 నుంచి 1983 జనవరి 9 వరకూ అంటే 111 రోజులపాటు కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

\- యు. రామకృష్ణ

ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ (ఇందిర)

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ (ఇందిర) ప్రభుత్వం రాష్ట్రంలో మంచి పరిపాలన అందివ్వలేకపోయింది. కాంగ్రెస్ (ఇందిర) ప్రభుత్వం పట్ల ప్రజలు పెట్టుకున్న భ్రమలు క్రమంగా పటాపంచలయ్యాయి. స్థానిక సమస్యలు కూడా పరిష్కరించలేని దుస్థితి ఏర్పడింది. ధరల పెరుగుదల, ఉద్యోగాల కోత పెరిగింది. ఈ కారణాలతోనే చీరాలలో, ఇబ్రహీంపట్నంలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ (ఇందిర) పార్టీ ఓడిపోయింది. ఈ కాలంలోనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున సమీకృతులయ్యారు. దీనికి పుచ్చలపల్లి సుందరయ్య నిర్వహించిన అఖిలపక్ష బహిరంగ సభే ఉదాహరణ. సుందరయ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా1980లో పెద్ద సభను కృష్ణానది తీరంలో నిర్వహించారు. కాంగ్రెస్ మినహా అన్ని ప్రతిపక్షాలనూ కూడగట్టలిగారు. ప్రభుత్వ వ్యతిరేకత పెరగడానికి తరచూ ముఖ్యమంత్రులను మార్చడం కూడా కారణమైంది.

1978 ఎన్నికల్లో పార్టీల బలాబలాలు

పార్టీ	పోటీ	గెలుపు	ఓట్లు	శాతం
కాంగ్రెస్ (ఇందిర)	290	175	79,08,220	39.25
జనతా పార్టీ	270	60	58,12,532	28.85
కాంగ్రెస్	257	30	34,26,850	17.01
సిపిఐ(ఎం)	22	08	5,46,262	2.71
సిపిఐ	31	06	5,01,452	2.49
ఇండిపెండెంట్లు	640	15	18,52,808	9.20.


గౌతు లచ్చన్న


పుచ్చలపల్లి సుందరయ్య

మోషాయి.. ద్వేషాయి..

నా పేరేదైతే మోషాయి..
నా పేరెనుక తోకేదైతే నీకెందుకు చెప్పాలోయి..
నా భాషేదైతే మోషాయి..
దాని యాసేదైతే నీకెందుకు చెప్పాలోయి..
నా మతమేదైతే మోషాయి..
నా గతమేదైతే నీకెందుకు చెప్పాలోయి..
నా పౌరుసత్వం అడుగుడెందిరా మోషాయి
మతమేదైతే.. గతమేదైతే.. ఏంటి..
అతుకుల బొంత కింద బతుకులు
తెల్లారుతున్నాయి.. చూడవోయి..
మోషాయి.. ద్వేషాయి.. పోవోయి.. ॥2॥

నువ్వు లీడరువైతే ఏంది మోషాయి..
నీ లక్ష్యం ఏదైతే మాకెందుకోయి..
నువ్వు ఇల్లొదిలి వస్తే ఏమిటోయి ..
భార్యను చూడకుండ ఉండుటలో ఏంటి నీ బడాయి..
దేశ పౌరాలమా అని అడుగుతావేందోయి..
రెచ్చగొట్టి ఈ చిచ్చుపెట్టుదేందిరోయి..
చూస్తూ వూరుకోమురా నీ లడాయి..
తేల్చి లెక్క చెప్తాముర మోషాయి..
మోషాయి.. ద్వేషాయి.. పోవోయి.. ॥2॥

నీ మతతత్వ బోధలేంది మోషాయి..
పరమతము పడనియ్యవుగా ద్వేషాయి..
మీరు రెచ్చగొడితే మేము రెచ్చిపోవుడు ఏందిరో.. చల్..
తరిమి తరిమి కొడతాముర్రోయి..
మోషాయి.. ద్వేషాయి.. పోవోయి.. ॥2॥

నీ జెండా రంగేదైతే మోషాయి..
నీ హిందూత్వ ఎజెండా దేశమంత ఎందుకోయి..
బిన్నత్వంలో ఏకత్వం మనదోయి..
హేయి.. కులము.. మతమొదిలి రండోయి
మనసారా అలుముకుందాము ..
మోషాయి.. ద్వేషాయి.. పోవోయి.. ॥2॥

(రామ్ మిర్యాల పాటకు ప్యారడీ..)

శాంతిశ్రీ

సంపాదకీయం

ఐక్యతే ఆయుధం

'మతం వేరైతేను యేమోయ్?/ మనసు లొకటై మనుషులుంటే/ జాతి యన్నది లేచి పెరిగీ/ లోకమున రాణించునోయ్!...' అంటారు గురజాడ. మనం నిశితంగా పరిశీలిస్తే... ప్రతి మతం వారికీ ఒక ప్రత్యేక జీవన విధానం ఉంటుంది. కట్టు, బొట్టు, జుట్టు, ఆరాధనా పద్ధతుల్లో వైవిధ్యం ఉంటుంది. వివిధ మతాలను అనుసరించే వారిలో తమ మతంపై ఎంత అభిమానం ఉన్నప్పటికీ... వారిలో పరమత సహనం కూడా ఉంటుంది. 'ఒక జాతి సమైక్యతకు ఒకే ఆరాధనా విధానం వుండాలన్నది నియంతృత్వ మతాలు, సిద్ధాంతాల పూనకం. భారతీయులంగా మేము ప్రజాస్వామ్యులం. ఎవరి ఇచ్చవచ్చిన దేవుణ్ణి వాళ్లు ఆరాధిస్తారు. అయినా మాది ఒకే భారతజాతి' అంటాడు దాశరథి రంగాచార్య 'ఋగ్వేద సంహిత'లో. దీనికి గాంధీజీయే పెద్ద ఉదాహరణ. ఆయనకు హిందూమతంపై ఎంత గాఢాభిమానం ఉందో అంతే పరమత సహనమూ ఉంది. కోట్లాది మంది భారతీయుల్లో మతాభిమానంతో బాటు పరమత సహనం కూడా వుంటుంది. కనుకనే 'భారతదేశం నా మాతృభూమి/ భారతీయులందరూ నా సహోదరులు/ నేను నా దేశమును ప్రేమించుచున్నాను/ సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం' అని ప్రతిజ్ఞ చేస్తుంటాం. భారతీయులలో పరమత సహనానికి ఇదొక సంకేతం. ప్రపంచానికి ఇదొక సందేశం. మతానికి రాజకీయాలను జోడించడంతో, మతతత్వంగా... మట్టికాళ్ల మహారాక్షసిగా మారింది. బిజెపి అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్ల కాలంలో మత విద్వేషాన్ని ఒక పథకం ప్రకారం ముందుకు తెచ్చింది.

'రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక విలువలకు తిలోదకాలిస్తూ మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాల వల్ల భారత ప్రజాస్వామ్యానికి పెను ముప్పు తలెత్తనుందని 'ది ఎకనమిస్ట్' మ్యాగజైన్ హెచ్చరించింది. సహనశీల, భిన్న మతాలకు నిలయమైన భారత్‌ను హిందూ దేశంగా మార్చడానికి ప్రధాని మోడీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని 'ది ఎకనమిస్ట్' వ్యాఖ్యానించడం గమనార్హం. హిందూ మతం నుంచి ఎవరైనా బౌద్ధ, జైన, సిక్కు మతాల్లోకి మారాలనుకుంటే ముందస్తు అనుమతి తప్పనిసరి-అంటూ తాజాగా గుజరాత్ బిజెపి ప్రభుత్వం హుకుం జారీ చేసింది. ఎకనమిస్ట్ హెచ్చరిక నూటికి నూరుపాళ్లు నిజమేనని బిజెపి చర్య రుజువు చేస్తోంది. దేశ ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛలో రాజ్యం జోక్యం చేసుకోవడం అంటే రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. మతం పేరు మీద పౌరసత్వం ఇవ్వడం నుంచి, అనేక మతోన్మాద చర్యల్ని నిరసిస్తున్న వారినందరినీ దేశద్రోహులుగా చిత్రించడం వరకు అనేక ప్రమాదకర చర్యలు దేశాన్ని ముంచెత్తుతున్నాయి. 'హిందూ రాజ్యమనేది అస్థిత్వంలోకి వస్తే ఈ దేశానికి కచ్చితంగా అదో పెద్ద విపత్తుగా తయారవుతుంది. హిందువులు ఎన్ని మాటలు చెప్పినా-హిందూయిజమనేది స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు పెద్ద గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యానికి, హిందూయిజానికి అస్సలు పొసగదు. కాబట్టి ఎట్టి పరిస్థితులల్లోనూ హిందూ రాజ్యాన్ని ఏర్పడకుండా చూడాల్సిందే' అంటారు అంబేద్కర్.

దేశంలో 80 శాతంగా వున్న హిందువులకు తానే రక్షకుడినని, మరో దఫా ఎన్నికల్లో గెలవడానికి బిజెపి అనుసరిస్తున్న విధానాలు ఆందోళనకరంగా వున్నాయి. ఈ మతోన్మాద పోకడలు లౌకిక వ్యవస్థకు తూట్లు పొడిచేవిగాను, దేశ విచ్ఛిన్నానికి దారితీసేవిగాను వున్నాయి. 'ప్రజల మధ్య అంతర్గత విభజన వల్ల రాజ్యాలే నాశనమయ్యాయి. అందుకే ప్రజల మధ్య ఐక్యత, సత్సంబంధాలు సాధించేందుకు ప్రతి రాజ్యమూ నిరంతరం ప్రయత్నిస్తుండాలి' అంటాడు మహాభారతంలో వ్యాసుడు. దీనికి ఐక్యతే ఆయుధం. ఇది ఏ ఒక్క మతానికో సంబంధించిన అంశం కాదు. మొత్తం దేశ ప్రజలకు, లౌకికవాద మనుగడకు సంబంధించినది. 'భారత సంస్కృతి సూర్యునిలాంటిది. దానికి గ్రహణం పడుతుంటుంది. ఇది తాత్కాలికమే! గ్రహణాన్ని వదిలించే మహామహులు అవతరిస్తుంటారు' అంటారు దాశరథి. దేశ ప్రజలంతా ఐక్యంగా దీన్ని ఎదుర్కోవాలి. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన హక్కులను పరిరక్షించుకోవాలి.

నివాళి



ఏ మతమైతే నిన్ను
అంటరాదనీ ముట్టుకోరాదనీ
నీవు అభివృద్ధి చెందరాదనీ
శాసిస్తుందో...
అది నిజంగా మతం కాదు.
- డా॥బి.ఆర్. అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

B.R. Ambedkar

జననం : 14.4.1891
మరణం : 6.12.1956

ఎన్‌డిఏ హ్యా'ట్రిక్' ఎంత నిజం?





తెలకపల్లి రవి

మరో వారం రోజుల్లోనే దేశంలో ఎన్నికల ఓటింగు తొలి దశ మొదలవుతుంది. నెల రోజుల్లో అంటే మే 13వ తేదీన తెలుగు రాష్ట్రాల్లో పోలింగు జరుగుతుంది. అదే విధంగా ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న కొద్ది రాజకీయ కథనాల సమర్పణలో చాలా మార్పు గమనించవచ్చు. పోల్ నేరేటివ్స్ అనబడే ఈ ఎన్నికల కథనాలు రెండు మాసాల కిందటికీ ఇప్పటికీ ఎలా మారిపోతున్నాయో చూస్తే ఆశ్చర్యం కలగొచ్చు. నమో, మోడీ తప్ప మరో మాటే లేని పరిస్థితి మారిపోవడం ఎవరైనా ఒప్పుకోక తప్పని స్థితి. అదే తెలంగాణలో చూస్తే మూడు నాలుగు నెలల కిందట కెసిఆర్, బిఆర్ఎస్ నామజపమే. అంతకు ముందు తెలంగాణలో రాబోయేది బిజెపినే అన్న మోతలో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు పదేపదే ప్రదక్షిణలు చేసేవారు. ఇప్పుడు అది గతం. ఎ.పి లోనూ బిజెపి, జనసేన, ఎన్‌డిఏతో టిడిపి కలిస్తే ఏదో మంత్రజాలం జరిగిపోతుందని వారి అనుకూల మీడియా మోత మోగిస్తుండేది. ఇప్పుడు చూస్తే వారి కూటమి ఏర్పడి మోడీ కూడా సందర్శించి వెళ్లారు గానీ సీట్ల సర్దుబాటు, ఎన్నికల ఎజెండా స్పష్టత లేని స్థితి. పాలక వైసిపి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మోడీకి చాలా దగ్గర గనక పొత్తుకు ఒప్పుకోరనే కథనం వారి వైపు నుంచి వినిపిస్తూనే వుండేది. ఎంతసేపటికీ టిడిపిని, ఎ.పి బిజెపి నాయకత్వాన్ని తప్ప జాతీయ బిజెపిని కనీసం ప్రస్తావించేవారు కాదు. మొత్తంపైన ఇరు పక్షాలూ బిజెపి దిశలోనే వున్నా మరోవైపు చూస్తే? 2014లో బిజెపి, టిడిపి, జనసేన కూటమి ఎ.పి ని మోసం చేసిందని ముఖ్యమంత్రి జగన్ అనక తప్పని స్థితి. దాన్నిబట్టి ఆయన ఏదో మోడీపై పోరాడుతున్నారనుకున్నా పొరబాటే. ఆ మాటకొస్తే పొత్తు పెట్టుకున్న టిడిపి కూడా కేంద్ర బిజెపిని ప్రసన్నం చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్న పరిస్థితి. ప్రతి సభలో ఎన్‌డిఏ పొత్తును సమర్థించుకోలేక తంటాలు పడుతున్న చంద్రబాబు తీరు ఆసక్తిగొల్పుతుంది. సిపిఎం నాయకులు చెబుతున్నట్టు పొత్తు పార్టీలు, తొత్తు పార్టీలు కూడా భరించలేని విధంగా బిజెపి వ్యవహరిస్తున్నదంటే దానికి కారణం దేశవ్యాపితంగా ఆ పార్టీ ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులే.

ఈ స్థానాలైనా ఎలా నిలుస్తాయి?

మోడీ బిల్డప్‌ను మోయవలసిన అగత్యం లేదని గత వారం ఈ శీర్షికలో చెప్పుకున్న విషయం. ఎంతటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ఒక రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ప్రయత్నం కొనసాగవలసిందేనన్నది దాని సారాంశం. జాతీయ మీడియా దాదాపుగా బిజెపి గుప్పిట్లో వుండిపోయింది గనక ఇప్పటి వరకూ బిజెపి కోణంలోనే నడిచిన ఎన్నికల కథనాలు మరింత సమగ్రంగా వీక్షిస్తే తప్ప సంపూర్ణ దృశ్యం బోధపడదు. మోడీకి 400 స్థానాలు వస్తాయనేది కేవలం మైండ్ గేమ్ మాత్రమేనని ఇప్పుడు అందరూ ప్రస్తావిస్తున్న మాట. అదే సమయంలో రెండోవైపున కాంగ్రెస్ 'ఇండియా' వేదికల మాటేమిటని కూడా చూడాలి. ప్రేమ్ ఫణిక్కర్ అనే ఓ జర్నలిస్టు ఇదే భావనతో 'వైర్' పత్రికలో కీలకమైన వ్యాఖ్యలు చేశారు. బిజెపికి ఇప్పుడు పార్లమెంటులో 289 మాత్రమే వున్నాయని ఆయన మొదట తేల్చేశారు. ఈ స్థానాలన్నీ ఎలా నిలుపుకోవడమనేది పెద్ద సవాలు కాగా ఏకంగా అది రెట్టింపు కావడమేంటని ఆయన ప్రశ్న వేశారు. ఇప్పటికిప్పుడే మోడీ ఓడిపోతాడని తాను చెప్పడం లేదని కూడా ఆయన స్పష్టం చేస్తూనే ఆయన ఈ పోల్ నేరేటివ్ ఎంత అవాస్తవమో నిరూపించే ఉదాహరణలిచ్చారు. ఒక విధంగా ఇది 'ఇండియా' గురించిన కథనం కూడా.

రద్దయ్యే పదిహేడవ లోక్‌సభలో బిజెపి 303 స్థానాలతో బయలుదేరిన మాట నిజమే. 303 స్థానాలు గెలిచినప్పటికీ అందులో 14 మంది వివిధ కారణాల వల్ల రాజీనామా చేయడం, ఇద్దరు చనిపోవడం జరిగాయి. చత్తీస్‌గఢ్‌లో ముగ్గురు, మధ్యప్రదేశ్‌లో అయిదుగురు, రాజస్థాన్‌లో ముగ్గురు అసెంబ్లీలకు మారారు. ఇది నిస్సందేహంగా ఆ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో సవాలును చెబుతుంది. ఇక మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో ఇద్దరు చనిపోయారు. బెంగాల్‌లో బిజెపి ఎం.పి స్థానం శతృఘ్న సిన్హా టిఎంసి తరపున గెలిచారు. కనుక ఇప్పుడు 370 లేదా 400 స్థానాలంటే వున్నవన్నీ గెలుచుకోవడమే గాక మరో 67 తెచ్చుకోవాలి. ఆ అవకాశం ఎక్కడుంది? కర్ణాటకలో గతంలో 28కి 25 వచ్చాయి. ఇప్పుడు ఇందులో సగమైనా కాంగ్రెస్‌కు పోతాయి. ఢిల్లీలో గతసారి మొత్తం ఏడు స్థానాలు తెచ్చుకుంది. ఈసారి తమకే సందేహం వుండి దాదాపు అభ్యర్థులందరినీ మార్చినా ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టు తర్వాత కాంగ్రెస్, ఆప్ కలసి పోటీ చేస్తున్నందున ఏమయ్యేది చెప్పలేని పరిస్థితి. మహారాష్ట్రలో గతంలో అవిభక్త శివసేనతో కలసి 23 తెచ్చుకుంటే ఇప్పుడు ముక్కలుముక్కలై పోయిన పార్టీలతో కలసి ఆ ఫలితం రావడం అసాధ్యం. ఉత్తర ప్రదేశ్‌లో గతంలో 80కి 62 వచ్చాయి. కానీ ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు పూర్తి అవగాహనతో ఢీకొంటున్నాయి. ఆప్ పూర్తి మద్దతు ప్రకటించింది. కనుక తగ్గడమే తప్ప పెరగడం వుండదు (మాయావతి ఊగిసలాట కూడా ఇందుకు దోహదం చేయొచ్చు). బీహార్‌లో గతంలో 40కి 17 వచ్చాయి కానీ ప్రతిష్ట కోల్పోయిన నితీశ్ కుమార్ నాయకత్వంలోని ఎన్‌డిఏ కన్నా తేజస్వి యాదవ్ నాయకత్వంలో పూర్తి అవగాహనకు వచ్చిన 'ఇండియా' బ్లాక్ అవకాశాలు మెరుగ్గా వుండబోతాయి. గతసారి వున్న 29లో 28 తెచ్చుకున్న మధ్యప్రదేశ్‌లోనూ తగ్గడమే (శాసనసభలో కాంగ్రెస్ ఓటింగు కూడా అదే చెబుతుంది). హర్యానాలో రైతాంగ ఉద్యమ ప్రభావం బిజెపికి వ్యతిరేకంగానే వుంది. ఇక రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రచార బాధ్యత యువనేత సచిన్ పైలెట్‌కు అప్పగించడంవల్ల బిజెపి గతంలో వలె 25కు 24 తెచ్చుకోవడం జరిగేపని కాదు. అంటే ఈ రాష్ట్రాల్లో గతసారి 285లో 210 తెచ్చుకున్న బిజెపి కోల్పోయే అవకాశాలే అత్యధికం. అంటే తక్కిన దేశంలో 128 స్థానాలున్న దక్షిణాది న, 42 స్థానాలు గల బెంగాల్‌లో, 13 సీట్లున్న పంజాబ్‌లో ఫలితాలు తారుమారు కావాలి. ఎందుకంటే 2019లో ఇక్కడ 128లో బిజెపి కేవలం 29 మాత్రమే గెలవగలిగింది. అందులోనూ 24 కర్ణాటకను తుడిచిపెట్టడం వల్లనే. మరో నాలుగు తెలంగాణ. ఇప్పుడు కర్ణాటకలో సగం కోల్పోవడం అనివార్యం. తెలంగాణలో ఒకటో అరో తప్ప మరెక్కడా ఆ అవకాశం లేదు. కనుక 370-400 సీట్ల కథలు ఎన్ని వందల సార్లు చెప్పినా అవి కథలే తప్ప నిజాలు కాబోవు.

బిజెపి యేతర శక్తుల బలం

ఇంకోవైపున 'ఇండియా' వేదిక సంగతి చూస్తే తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, బెంగాల్, ఢిల్లీ, పంజాబ్ వేదిక పార్టీల ఆధ్వర్యంలో వున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో 'ఇండియా' పూర్తి అవగాహనతో ముందుకు పోతున్నది. కేరళ, బెంగాల్‌లో 'ఇండియా' లోని పార్టీలే అటూ ఇటూ వున్నాయనేది ప్రతికూలంగా చూపుతుంటారు గానీ నిజానికి అది ఎన్‌డిఏ కు వ్యతిరేకమైన అంశమే. ఎందుకంటే ఎటూ అవి 'ఇండియా'తోనే వుంటాయి. కాశ్మీర్‌లో లోక్‌సభ సీట్లు రెండే అయినా జాతీయ ప్రాధాన్యత వుంటుందనేది వాస్తవం. ఒరిస్సాలో బిజెడి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బిజెపితో చర్చలు జరిపినా పొత్తుకు సిద్ధం కాలేదు. వైసిపి ఎ.పి లో బిజెపినే బలపరుస్తున్నా పొత్తు వుండదు. ఈ విధంగా చూస్తే బిజెపి యేతర పార్టీల బలం ఎక్కువగా వుంటుంది. వాస్తవానికి ఈ మొత్తంలో ఇటు నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు అటు మారకపోయి వుంటే పరిస్థితి మరింత భిన్నంగా వుండేది. కానీ బిజెపి వల్ల టిడిపికి నష్టం తప్ప లాభం వుండదనే అత్యధికుల అభిప్రాయంగా వుంది. ఆ భయం వారి నాయకత్వంలోనూ వుంది. మోడీ నాయకత్వం అనేదే ఎన్‌డిఏకు పెద్ద అనుకూలాంశమని చెప్పుకోగా తాజా సర్వేల్లో అది కూడా బాగా పడిపోతున్నది. ఉదాహరణకు లోక్‌నీతి, సిఎస్‌డిఎస్ సర్వేలో మోడీ పట్ల మొగ్గు చూపినవారు 48 శాతం మాత్రమే వున్నారు. ఇది గతంలో 67 శాతం వరకూ వుండేది. కొద్దిగానో పూర్తిగానో ఈ ప్రభుత్వం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసినవారి శాతం 30 నుంచి 39కి పెరిగింది. నిరుద్యోగం, పేదల సంక్షేమం వంటి విషయాల్లో కేవలం 90 శాతం వరకూ అసంతృప్తి నెలకొంది. మోడీకి 48 శాతం రాహుల్ గాంధీకి 27 శాతం వుంది గనక ఆయనకు తిరుగు లేదని చిత్రించవచ్చు గాని వాస్తవానికి రాహుల్ ప్రధాని అభ్యర్థి అని 'ఇండియా' ప్రకటించిందేమీ లేదు. కనుక ఈ పోలికే నిరాధారమైంది. వివిధ జాతీయ, రాష్ట్ర స్థాయి అంశాలు, విజయాలు కలిసి బిజెపి యేతర కలయికకు దారి తీసే అవకాశం కాదనలేనిది.

సిద్ధరామయ్య జోస్యం

ఈ విషయంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆసక్తికరమైన కోణం ఆవిష్కరించారు. 'ఇండియా'కూ స్పష్టమైన ఆధిక్యత రాకపోయినా ఎన్‌డిఏ కు కూడా ప్రభుత్వ ఏర్పాటుకు తగినన్ని సీట్లు రాబోవని అంచనా చెప్పారు. బిజెపి లేకుండా కేంద్రంలో సర్కారు ఏర్పాటుకు అవకాశం వుంటుందన్నారు. దేశవ్యాపితంగా బిజెపికి వ్యతిరేకంగా కనిపించని నిరసన వున్నదనీ, ఈ నిశ్శబ్ద ఓటింగు మోడీ సర్కారును ఓడిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. బిజెపికి 200 పైన సీట్లు రావచ్చేమో గాని మెజార్టీ చేరుకోజాలదని స్పష్టం చేశారు. దక్షిణాది పార్టీలు, బిజెపి వ్యతిరేక శక్తులు కలిస్తే నవీన్ పట్నాయక్ కూడా చేతులు కలపొచ్చని వ్యాఖ్యానించారు. 1991లో 1996లో కూడా దక్షిణాది బలమే ప్రత్యామ్నాయ ప్రభుత్వాలకు దారితీయడం ఇక్కడ గుర్తుచేసుకోవచ్చు. రాబోయే కాలంలో దక్షిణాది నుంచి ప్రధాని రావచ్చుని రేవంత్ రెడ్డి కూడా వ్యాఖ్యానించడం గమనార్హం. ఎవరికీ మెజార్టీ రాకూడదని జగన్ కూడా పదేపదే చెబుతుంటారు. కనుక ఎన్నికల అనంతర దృశ్యాన్ని ఏకపక్షంగా అంచనా వేయడం పొరబాటే.

'ఇండియా' గెలిస్తే దేశ ఆయుధ శక్తిని దెబ్బ తీస్తుందని మోడీ తాజాగా ఆరోపించడం చూస్తే రెచ్చగొట్టడానికి ఎంతగా ప్రయత్నం జరుగుతున్నదీ తెలుస్తుంది. కాశ్మీర్‌లోనూ ఇదే విధమైన ప్రచారం చేసి వచ్చారు. కాంగ్రెస్ రామమందిరం కట్టనివ్వలేదని మరో చోట ఆరోపించారు. ఏదో విధంగా మతపరమైన ఉద్వేగాలను పొరుగు దేశాలతో వివాదాలను ముందుకు తెచ్చే పాత ఎత్తుగడ పునరావృతం చేస్తున్నారు. ఇవన్నీ కూడా ఎన్‌డిఏ మరీ ముఖ్యంగా బిజెపి కంగారునే సూచిస్తాయి. ఎ.పి లో టిడిపితో పొత్తు కుదర్చుకోవడంలోనూ ఈ అనివార్యతే గోచరిస్తుంది. అయితే ఇవన్నీ మెజార్టీ తెచ్చిపెట్టబోవు. ప్రతిపక్షాలపై మోడీ నిరంకుశ దాడి కేజ్రీవాల్ అరెస్టుతో పరాకాష్టకు చేరిందనీ, ఇదే బిజెపికి నష్టదాయకం అవుతుందని కేంద్ర కాబినెట్ మాజీ కార్యదర్శి కె.ఎం.చంద్రశేఖర్ రాస్తున్నారు. ఈ పరిస్థితులలో 'ఇండియా' వేదికలో పెద్ద పార్టీగా వున్న కాంగ్రెస్ తన పాత్ర సక్రమంగా నిర్వహించడం చాలా కీలకం. ఎ.పి లో ఎలాగో చర్చలు, సిపిఎం సర్దుబాట్ల తర్వాత ఒక అవగాహన కుదిరింది గాని తెలంగాణలో ఇప్పటికి ఇంకా వామపక్షాలతో చర్చలకు చొరవ తీసుకున్నదే లేదు. కాంగ్రెస్ బలంగా వున్న చాలా రాష్ట్రాలలోనే 'ఇండియా' పొత్తులు కుదరకపోవడం ఒక నిజం. బిజెపి మత రాజకీయాలు ఏకపక్ష ధోరణులపై నిరసన ప్రజల తీర్పులో ప్రతిబింబించాలంటే కాంగ్రెస్ మరింత వాస్తవికంగా వ్యవహరించాలి.

★

మోడీకి 400 స్థానాలు వస్తాయనేది కేవలం మైండ్ గేమ్ మాత్రమేనని ఇప్పుడు అందరూ ప్రస్తావిస్తున్న మాట. అదే సమయంలో రెండోవైపున కాంగ్రెస్ 'ఇండియా' వేదికల మాటేమిటని కూడా చూడాలి. ప్రేమ్ ఫణిక్కర్ అనే ఓ జర్నలిస్టు ఇదే భావనతో 'వైర్' పత్రికలో కీలకమైన వ్యాఖ్యలు చేశారు. బిజెపికి ఇప్పుడు పార్లమెంటులో 289 మాత్రమే వున్నాయని ఆయన మొదట తేల్చేశారు. ఈ స్థానాలన్నీ ఎలా నిలుపుకోవడమనేది పెద్ద సవాలు కాగా ఏకంగా అది రెట్టింపు కావడమేంటని ఆయన ప్రశ్న వేశారు. ఇప్పటికిప్పుడే మోడీ ఓడిపోతాడని తాను చెప్పడం లేదని కూడా ఆయన స్పష్టం చేస్తూనే ఆయన ఈ పోల్ నేరేటివ్ ఎంత అవాస్తవమో నిరూపించే ఉదాహరణలిచ్చారు. ఒక విధంగా ఇది 'ఇండియా' గురించిన కథనం కూడా.

ఈ పరిస్థితులలో 'ఇండియా' వేదికలో పెద్ద పార్టీగా వున్న కాంగ్రెస్ తన పాత్ర సక్రమంగా నిర్వహించడం చాలా కీలకం. ఎ.పి లో ఎలాగో చర్చలు, సిపిఎం సర్దుబాట్ల తర్వాత ఒక అవగాహన కుదిరింది గాని తెలంగాణలో ఇప్పటికి ఇంకా వామపక్షాలతో చర్చలకు చొరవ తీసుకున్నదే లేదు. కాంగ్రెస్ బలంగా వున్న చాలా రాష్ట్రాలలోనే 'ఇండియా' పొత్తులు కుదరకపోవడం ఒక నిజం. బిజెపి మత రాజకీయాలు ఏకపక్ష ధోరణులపై నిరసన ప్రజల తీర్పులో ప్రతిబింబించాలంటే కాంగ్రెస్ మరింత వాస్తవికంగా వ్యవహరించాలి.

సందర్భం

అలుపెరగని అక్షర యాత్రికుడు

చెరుకూరి సత్యనారాయణ

చిన్నతనంలో నెయ్యి వలకపోసి ఇంట్లో కొడ్తారనే భయంతో కొద్దిరోజులు ఇల్లు వదిలి పారిపోయినప్పుడు పడిన బీజంతో భారతదేశంలో విస్తృతంగా పర్యటించడంతో పాటు రష్యా, చైనా, సింహళం, టిబెట్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, జపాన్, కొరియా తదిరత దేశాల్ని సందర్శించటమే గాక వెళ్లిన ప్రతిచోటా అక్కడి భాషల్ని నేర్చుకున్నాడు. సుమారు 30 భాషలు తెలియటంతోపాటు అనేక భాషల్లో విశేష పాండిత్యం కల్గివున్నాడు. 150కి పైగా పుస్తకాలు, వందలాది వ్యాసాలు రాశారు. కాని ఆయన రచనలు మాత్రం ఎక్కువగా హిందీలోనే చేశారు. ఇతర భాషల నుండి అనేక రచనల్ని హిందీలోకి అనువదించారు.

"ఈ రోజున నా ఆనందానికి మేర లేకపోయింది. పార్టీ సభ్యత్వం లేకుండానే చివరకు చనిపోతానేమోననే మనో వేదనతో బాధపడుతూ వుండేవాడిని. ఇప్పుడు జీవితాంతం వరకూ నేను పార్టీ సభ్యుడినే. నా జీవిత లక్ష్యం పూర్తయింది". 1955 ఫిబ్రవరిలో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని అభ్యర్థించి ఆనాటి పార్టీ కేంద్ర కమిటి కార్యదర్శి అజయ్ ఘోష్ దానికి అంగీకరించిన తర్వాత మహా మహోపాధ్యాయుడు, విశ్వవ్యాపితంగా ఎంతోమంది సాహితీవేత్తలకు మేధో స్ఫూర్తి కలిగించిన రాహుల్ సాంకృత్యాయన్ అన్న మాటలవి. భాషా సమస్యపై పార్టీతో వచ్చిన భేదాభిప్రాయంతో 1948లో పార్టీకి దూరమైనా...ఆయన చనిపోయే నాటికి పార్టీ సభ్యుడిగా వుండాలనే వాంఛని నెరవేర్చుకున్నాడు.

చిన్నతనంలో నెయ్యి వలకపోసి ఇంట్లో కొడ్తారనే భయంతో కొద్దిరోజులు ఇల్లు వదిలి పారిపోయినప్పుడు పడిన బీజంతో భారతదేశంలో విస్తృతంగా పర్యటించడంతో పాటు రష్యా, చైనా, సింహళం, టిబెట్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, జపాన్, కొరియా తదిరత దేశాల్ని సందర్శించటమే గాక వెళ్లిన ప్రతిచోటా అక్కడి భాషల్ని నేర్చుకున్నాడు. సుమారు 30 భాషలు తెలియటంతోపాటు అనేక భాషల్లో విశేష పాండిత్యం కల్గివున్నాడు. 150కి పైగా పుస్తకాలు, వందలాది వ్యాసాలు రాశారు. కాని ఆయన రచనలు మాత్రం ఎక్కువగా హిందీలోనే చేశారు. ఇతర భాషల నుండి అనేక రచనల్ని హిందీలోకి అనువదించారు. ఈ పుస్తకాల్లో 'మేరీ జీవన్ యాత్ర' పేరిట ఆరు భాగాలుగా రాసిన రాహుల్జీ ఆత్మకథతో పాటు, తత్వశాస్త్ర సహితంగా చెప్పదగ్గ 'దర్శన్-దిగ్దర్శన్'తోపాటు 'ఋగ్వేద ఆర్యులు, ఓల్గా సే గంగా, దివోదాసు, సింహ సేనాపతి, జయ మేధీయ...'లాంటి ప్రసిద్ధ పుస్తకాలు వున్నాయి. ఇందులో 'ఓల్గా సే గంగా' దాదాపు అన్ని భారతీయ భాషల్తో పాటు అనేక ఇతర భాషల్లోకి కూడా అనువదించబడింది. టిబెటన్ భాషలో ఈయన రాసిన వ్యాకరణం, బాలశిక్ష ఇటీవల వరకు అక్కడ పాఠ్యగ్రంథాలుగా వున్నాయి.


సంస్కృతం, పాళీ భాషల్లో రాహుల్‌కు వున్న పాండిత్యం కారణంగా ఏ రకమైన డిగ్రీలు, చదులూ లేకపోయినా లెనిన్ గ్రాండ్ విశ్వవిద్యాలయంలోనూ, సింహళ విశ్వవిద్యాలయం లోనూ సంస్కృతం ఆచార్యునిగా పనిచేశారు.

1893 ఏప్రిల్ 9న ఉత్తరప్రదేశ్ లోని పందహా గ్రామంలో జన్మించిన కేదార్ పాండే ఆ తర్వాత దామోదర్ స్వామిగా వ్యవహరించిన సింహళంలోని బౌద్ధవిహారంలో వున్నప్పుడు రాహుల్‌గా పేరు మార్చుకున్నారు. సాంకృత్యాయన్ అనేది ఆయన ఇంటి పేరు. రష్యాలో వున్న కాలంలో లోలా అనే ఆమెను వివాహం చేసుకొని కొద్దికాలమే వుండి భారతదేశం వచ్చేశారు. వారికి ఇగోర్ అనే కొడుకు జన్మించాడు. వారు భారతదేశం రాలేక, ఈయన రష్యా వెళ్లలేని పరిస్థితుల్లో కమల అనే రచయిత్రిని వివాహం చేసుకోగా వారికి జయ, జేత అనే పిల్లలు కలిగారు.

టిబెట్‌ని అనేకసార్లు దర్శించటమేగాక శతాబ్దాల క్రితం బౌద్ధ భిక్షువులు భారతదేశం నుండి తరలించుకుపోయిన అనేక చిత్రాల్ని, గ్రంథాల్ని 22 కంచర గాడిదలపై మోసుకొచ్చి భారతదేశానికి చేర్చారు. ఈ చిత్రాల్ని పారిస్‌తో సహా కొన్ని చోట్ల ప్రదర్శనకు పెట్టారు. ఒక అమెరికన్ మ్యూజియం వారు లక్ష రూపాయలకు కొన్ని చిత్రాలు అమ్మమనగా తిరస్కరించి వాటిని భారతదేశానికి తెచ్చి పాట్నాలోని మ్యూజియమ్‌కి ఉచితంగా ఇచ్చారు. మన దేశంలో బస్తా బియ్యం ఒక్క రూపాయి అమ్మే రోజుల్లో లక్ష రూపాయలు చాలా పెద్ద మొత్తం. అలాగే ఆయన యాత్రా సమయంలో సంవత్సరానికి వేలల్లో ఆదాయం వున్న తిరుమణి మఠానికి అధిపతిగా వుండమని కోరినా తిరస్కరించారు. ఈ భాషాధ్యయనాలు, సాహిత్య కృషితో పాటు స్వాతంత్ర్య సమరంలో పాల్గొని అనేకసార్లు జైలు జీవితం గడిపారు. జైలు జీవితం నిరంతర అధ్యయనానికి ఉపయోగపడింది. బహుముఖమైన ఈ పనులతో పాటు కమ్యూనిస్టు పార్టీతో కూడా పరిచయమై 1939 అక్టోబర్ 19న ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ బీహార్ శాఖకు వ్యవస్థాపక కార్యదర్శిగా వున్నారు. రాహుల్జీ హజారీబాగ్ జైల్లో వున్న సమయంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు డాంగే, భాట్లీవాలా, భరద్వాజ, సోహన్‌సింగ్ భక్నా, డాక్టర్ అహమ్మద్, అజయ్ ఘోష్ కూడా వున్నారు. వారి సాహచర్యం కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆయన నిబద్ధతను మరింత పెంచింది.

ఆ తర్వాత 1940లో అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా ఎన్నికై ఆ హోదాతో మన రాష్ట్రంలోని విజయవాడలో 1944 మార్చి 14, 15 తేదీల్లో జరిగిన జాతీయ కిసాన్ మహాసభలో పాల్గొన్నారు. రైళ్లు, బస్సుల్లో జనం రాకుండా కట్టడి చేసినా 1500 ఎడ్ల బళ్లలోనూ, కాలినడకనా వేలాది ప్రజలు హాజరైన చారిత్రక మహాసభ అది. ఆ సమయంలోనే మన ప్రాంతంలోని తుమ్మపూడి, దావులూరు (తెనాలి తాలూకా), కాటూరు (కృష్ణా జిల్లా)ల్లో రాహుల్జీ పర్యటించారు. ప్రముఖ చిత్ర విమర్శకులు, రచయిత సంజీవ దేవ్‌తో కల్సి నాగార్జున కొండను దర్శించుకున్నారు. ఆ సమయంలోనే పుల్లారెడ్డిగూడెం అనే ఒక లంబాడి తండాని దర్శించి వారు మాట్లాడే భాషను కేవలం నిముషాల వ్యవధిలో నేర్చుకుని వారితో సంభాషించారట. ఆ భాష కాశ్మీర్ ప్రాంతంలో ఒక ప్రాంతంలో మాట్లాడే భాషతో పోలివుందని చెప్పారట.

డెబ్బయి సంవత్సరాల తన జీవిత కాలంలో ముప్పయి నాలుగేళ్ల కాలం నిర్విరామ యాత్రలకే వెచ్చించిన పరివ్రాజకుడు రాహుల్. జాగల్పూరు విశ్వవిద్యాలయం వారు డి.లిట్ ఇచ్చినా సింహళ పండితుల సభ సాహిత్య చక్రవర్తి



బిరుదుతో సత్కరించినా, కాశీ విశ్వవిద్యాలయం వారు "మహా పండిత" బిరుదు ఇచ్చినా, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి ఇచ్చినా చివరకు 1963లో భారత ప్రభుత్వం "పద్మభూషణ్"గా గౌరవించినా ఇవేవీ ఆయన పాండిత్య ప్రతిభకు సరితూగేవి కావు. చివరకు అనారోగ్యంగా వున్నప్పుడు కమ్యూనిస్టు పార్టీ చొరవతో ఆయనను వైద్యం కోసం మాస్కో పంపించారు. ఆరోగ్యం కుదుటపడకుండానే ఆయన డార్జిలింగ్ తిరిగి వచ్చారు. ఐదు రోజులు అక్కడ హాస్పిటల్‌లో వుండి 1963 ఏప్రిల్ 14న రాహుల్జీ కన్నుమూశారు. రాహుల్జీ భార్య కమల అక్కడే ఒక చైత్యాన్ని నిర్మించారు.

ఆయన చితాభస్మాన్ని కాశీకి తీసుకుపోయినప్పుడు ఆర్య సమాజికులు, బౌద్ధులు అంతిమ సంస్కారాల్ని తమ తమ పద్ధతుల్లో జరపాలని తీవ్రంగా జడగమాడుకున్నారు. పూర్వం కబీరుదాసు శవ సంస్కారం విషయంలో కూడా ధర్మప్రవక్తల మధ్య ఇదే రకం పోట్లాట జరిగిందట.

కమ్యూనిస్టుల కారణంగా రాహుల్ సాంకృత్యాయన్‌కు, ఆయన కారణంగా కమ్యూనిస్టు పార్టీకి భారత సమాజంలో గౌరవం పెరిగింది. 'కట్టిన దస్తులు పసుపు, పట్టిన జెండా ఎరుపు' (ఎల్లో రోబ్-రెడ్ ఫ్లాగ్) అని ఆయన గూర్చి ఆస్ట్రేలియాకి చెందిన భంతే యస్. ధమ్మిక ఒక పుస్తక శీర్షిక ఆ మహావ్యక్తిని ఒక్క ముక్కలో ఆవిష్కరించింది.

(ఏప్రిల్ 14 రాహుల్ సాంకృత్యాయన్ వర్ధంతి)

కవిత్వం

అతడు శాస్త్రం నిత్య చలన సూత్రం

చైతన్యం అతని
ఇంటి పేరు
పోరాటం అతని ఊరు
పేరు
సమ సమాజం అతని
అసలు పేరు.
అక్షరం అతన్ని
వరించింది
అంటరానితనమే
ప్రపంచాన్ని
జయించింది.
అజ్ఞానం కాలిపోయింది
మనుధర్మం బూడిద
కుప్పయింది
అతడు నిలువెత్తు
జ్ఞానం.
మత మౌఢ్యానికి
సంకెళ్లు
అతని ప్రశ్నలు.
సకల చీకట్లను
చీల్చుకుంటూ..
అతడు సూర్యుడు.
యుగయుగాల తీర్పు
తన చూపు
చూపుడు వేలు వైపే
మార్పు.
కులం గుట్టు విప్పిన
వాడు
మనోధర్మ శాస్త్రాన్ని
తలకిందులు చేసినవాడు
అతని మాటే
ప్రజాస్వామ్యం.
ప్రపంచం గుండెల్లో
ప్రజాస్వామ్యపు హక్కుల్లో
అతడు సజీవుడు.
నేల పొరల్లోంచి
నింగి చుక్కల వరకు
అతడు ఒక స్వేచ్ఛా
జ్వలనం.
నియంతృత్వం
భయపడినా
మానవత్వం నిలబడినా
అది అతని న్యాయం.
అబద్ధం నోరు మెదపని
చోటు
సత్యం ఓడిపోని చోటు
అది అతని వ్యక్తిత్వం.
మానవులున్నదే అసలైన
చరిత్ర
మానవుడు లేనిదే
దేవుడికేది చరిత్ర
అది అతని తత్వం.
సామాజిక చలన
సూత్రం
సత్య పరిణామ శాస్త్రం
విశ్వవిజ్ఞాన నేత్రం
నిత్య నూతనుడు
అతడు అంబేద్కరుడు.

(నేడు భారతరత్న డా॥ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి)

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

కె.వి.రామకృష్ణన్ కన్నుమూత

- ఎఐకెఎస్ సంతాపం

న్యూఢిల్లీ : శాస్త్రీయ దృక్పథం కలిగిన నేత, ప్రముఖ రైతు నాయకుడు కె.వి.రామకృష్ణన్ (74) కన్నుమూశారు. కేరళ కర్షక సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులైన రామకృష్ణన్ పాలక్కడ్ జిల్లా పొన్నాని తాలుకా కుమరనెల్లూర్‌లో 1950 ఏప్రిల్ 8న జన్మించారు.



కెవి.రామకృష్ణన్ (ఫైల్)

అఖిల భారత కిసాన్ సభ కేంద్ర కమిటీ సభ్యుడిగా కూడా ఆయన వున్నారు. కేరళలో రైతాంగ ఉద్యమాన్ని నిర్మించడానికి తన జీవితాన్ని ధారపోసిన ఆయన మంచి నిర్మాణదక్షుడు. కేరళ రైతు సంఘం రాష్ట్రంలో అతిపెద్ద సంఘంగా అవతరించడంలో ఆయన ముఖ్య భూమిక వహించారు. కేరళ రాష్ట్ర వ్యవసాయ ప్రణాళిక రూపకల్పనలో ఆయన కృషి వుంది. సంయుక్త కర్షక సమితి కన్వీనర్‌గాను, కేరళ కర్షక సంఘం పత్రిక 'కర్షక నాదమ్' మేనేజర్‌గాను ఆయన వున్నారు. కేరళ రాష్ట్ర రైతు రుణ విముక్తి కమిషన్‌కు సభ్యుడుగా కూడా పనిచేశారు. వరి, కొబ్బరి, రబ్బర్ వంటి పంటల విషయాల్లో ఆయన విశేషమైన కృషి చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన చాలా అధ్యయనం చేశారు. వాటినన్నింటినీ ఉద్యమంగా మార్చడంలో ముందుండేవారు.

కె.వి.రామకృష్ణన్ మృతి పట్ల ఎఐకెఎస్ తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలియజేసింది. రైతాంగ ప్రయోజనాల పట్ల రామకృష్ణన్‌కు గల నిబద్ధత తిరుగులేనిదని అఖిల భారత కిసాన్ సభ వ్యాఖ్యానించింది. దేశంలో వ్యవసాయ ఉద్యమానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన మృతికి గౌరవ సూచకంగా ఎఐకెఎస్ పతాకాలను అవనతం చేశారు.

నిరంకుశత్వంతో దేశానికి ముప్పు : ఉద్ధవ్ థాకరే

ముంబయి : నిరంకుశత్వం దేశానికి హానికరమని, కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావాలని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే పేర్కొన్నారు. దేశంలో 'ఇండియా వేదిక' సంకీర్ణ ప్రభుత్వాన్ని అందించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. జల్గావ్ జిల్లా నుండి బిజెపి, బిఆర్ఎస్, వంచిత్ బహుజన్ అఘాడీ (విబిఎ)ల నుండి పలువురు కార్యకర్తలు శివసేనలో చేరారు. ఈ సందర్భంగా ముంబయిలోని తన నివాసం మాతోశ్రీ నుండి ఉద్ధవ్ మాట్లాడారు. గత పదేళ్లలో మొదటిసారి దేశంలో పెద్ద ఎత్తున అసంతృప్తి కనిపించిందని అన్నారు. నిరంకుశత్వం దేశానికి హానికరమని చెప్పారు. సంకీర్ణ ప్రభుత్వం ఉండకూడదన్న భావన గతలో ఉండేదని, కానీ పి.వి. నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్‌ల హయాంలోని సంకీర్ణ ప్రభుత్వాలు బాగా పనిచేశాయని తెలిపారు. సంకీర్ణ ప్రభుత్వంలో బలమైన దేశం కావాలని అన్నారు.

కర్ణాటకలో ఓట్లడిగే నైతిక హక్కు మోడీకి లేదు

సిఎం సిద్ధరామయ్య

బెంగళూరు : కర్ణాటకలో కరువుపై ఉదాసీనంగా వ్యవహరించిన ప్రధాని నరేంద్రమోడీకి ఓట్లడిగే నైతిక హక్కు లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శించారు. మైసూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కృష్ణరాజ అసెంబ్లీ స్థానంలో శనివారం నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. కరువు వల్ల 48 లక్షల హెక్టార్లకుపైగా పంటలు దెబ్బతిన్నాయని, రూ.35 వేల కోట్ల విలువైన పంటలను రైతులు నష్టపోయారని చెప్పారు. రాష్ట్రంలో సహాయక చర్యలు చేపట్టేందుకు రూ.18,171 కోట్లు కావాలని కోరినప్పటికీ, ఒక్క పైసా కూడా మోడీ విడుదల చేయలేదని విమర్శించారు. వందేళ్లలో ఎన్నడూ లేనంత కరువు ఏర్పడినా, ప్రధానిలో చలనం లేదని విమర్శించారు. ఆదివారం మోడీ మైసూరులో ఉంటారని, ఈ విషయమై ఆయనను ప్రశ్నించాలని ప్రజలను కోరారు. గత ఎన్నికల్లో 27 మంది బిజెపి ఎంపిలను గెలిపించినా, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఒక్కరూ ప్రశ్నించలేదని, వారికి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు.

కార్మికులు, వ్యవసాయ కూలీల ఆదాయం..

కేరళలో అత్యధికం.. గుజరాత్‌లో అత్యల్పం

న్యూఢిల్లీ: కార్మికులు, వ్యవసాయ కూలీల ఆదాయంలో కేరళ ముందుండగా, గుజరాత్ వెనుకబడి ఉంది. కార్మిక మంత్రిత్వ శాఖకు చెందిన లేబర్ బ్యూరో డేటాను ఎఐకెఎస్ నాయకుడొకరు శనివారం బయట పెట్టారు.. కార్మికులు, వ్యవసాయ కూలీల ఆదాయాలు దేశంలోనే అతి తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో గుజరాత్ ఒకటి. గుజరాత్‌ను దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రమని, స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో అధిక వాటా కలిగివున్న రెండవ అతి పెద్ద రాష్ట్రమని (మొదటిది మహారాష్ట్ర) ఊదరగొడుతున్న బిజెపి నాయకులు దీనికి ఏం సమాధానం చెబుతారని కిసాన్‌సభ నాయకుడు ప్రశ్నించారు. గుజరాత్ అనే కాదు, బిజెపి పాలిత రాష్ట్రాలన్నిటా ఇదే పరిస్థితి.. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే పారిశ్రామికీకరణ బాట పట్టడం, వ్యవసాయ ఉత్పత్తి తగినంతగా ఉండడం, భౌగోళిక, నైసర్గిక పరిస్థితులు అనుకూలించడం ఇవన్నీ గుజరాత్ అభివృద్ధిలో ప్రధాన భూమిక వహించాయి. 1990ల నాటికి అంటే బిజెపి అధికారంలోకి రాక ముందే ఆ రాష్ట్రం అభివృద్ధి మార్గంలో ఉంది. గత ఇరవై ఏళ్లకు పైగా బిజెపి పాలన కింద ఉన్న ఈ రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలకు అత్యల్ప వేతనాలు లభిస్తున్నాయి. కేరళలో ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి మనకు కనిపిస్తుంది. వామపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉండడం వల్ల ఈ రాష్ట్రంలో కార్మికుల, వ్యవసాయ కూలీల వేతనాలు దేశంలోనే అత్యధికం. చాలా రాష్ట్రాల నుంచి కూలీలు పని కోసం కేరళకు వెళుతుంటారు.



వలసకార్మికులను అక్కడి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అతిధి కార్మికులుగా గౌరవిస్తూ, వారికి కొన్ని ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టింది. కేరళలో వ్యవసాయ కూలీల రోజువారీ వేతనం రూ.764.30 కాగా, మధ్యప్రదేశ్‌లో రూ. 229.20 రూపాయలు, గుజరాత్‌లో రూ. 241.90 మాత్రమే. ఇది జాతీయ సగటు కన్నా తక్కువ. ఈ కష్టజీవులు సృష్టించే సంపదకు, వారికి లభించే వేతనానికి మధ్య చాలా వ్యత్యాసముంది గుజరాత్‌లో. పారిశ్రామిక రంగంలో కార్మిల పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. వీరికి కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదు. ఈజ్ డూయింగ్ ఆఫ్ బిజినెస్ పేరుతో పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారులకు అధిక రాయితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం, కార్మికుల హక్కులను బాహాటంగా కాలరాస్తోంది.

2011 జనాభా లెక్కల ప్రకారం గుజరాత్‌లో 68.39 లక్షల మంది భూమి లేని వ్యవసాయ కార్మికులున్నారు. ఈ దశాబ్దన్నర కాలంలో వీరి సంఖ్య మరింత పెరిగింది. వీరు కాక అయిదు లక్షల మంది వలసకార్మికులు, 15 లక్షల మంది నిర్మాణ కార్మికులు, వ్యవసాయేతర పనులు చేసే కూలీలు ఉన్నారు. వీరిలో చాలా మందికి కనీస వేతనం కూడా లభించడం లేదు. గుజరాత్ మోడల్‌ను దేశమంతటికీ విస్తరిస్తామని చెబుతున్న బిజెపి నేతలు కార్మికులు, వ్యవసాయకూలీలు ఎదుర్కొంటున్న ఈ దయనీయ స్థితి గురించి ఎందుకు మాట్లాడరని ఎఐకెఎస్ నాయకుడు ప్రశ్నించారు.



దిండిగల్ సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి



మధురై సభలో మాట్లాడుతున్న డి.రాజా

తమిళనాడులో ఏచూరి, రాజా విస్తృత ప్రచారం

చెన్నై : తమిళనాడులో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వామపక్ష అభ్యర్థుల, ఇండియా వేదిక అభ్యర్థుల విజయం కోసం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దిండిగల్ లోక్‌సభ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి ఆర్.సచ్చితానందానికి మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభలో సీతారాం ఏచూరి ప్రసంగించారు. ప్రతిపక్ష నేతలను బిజెపిలో చేర్చుకోవాలనే రహస్య అజెండాతో కేంద్ర ఏజెన్సీలతో మోడీ ప్రభుత్వం దాడులు చేయిస్తోందని విమర్శించారు. వరద సహాయం అందించడం, తమిళనాడు అభివృద్ధికి నిధులు కేటాయించడంపై మాట్లాడకుండా తమిళనాడులో ప్రధాని పర్యటించడం వల్ల ఉపయోగమేమిటని ఆయన ప్రశ్నించారు.

మదురైలో సిపిఎం అభ్యర్థి సు వెంకటేశన్‌కు మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెక్యులర్ ప్రోగ్రసివ్ అలయన్స్ నాయకులు పాల్గొన్నారు.

'మేఘా' లంచాలు..

- ఎంఇఐఎల్‌పై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు
- 10 మంది అధికార్లపై కూడా..
- రూ.78 లక్షల ముడుపులు..!
- రూ.315 కోట్ల అవినీతి..
- బిల్లుల క్లియరెన్స్‌కు తప్పుడు మార్గాలు
- ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలులో టాప్2 కంపెనీ

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(ఎంఇఐఎల్)పై లంచం కేసులో సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. మెకాన్, ఎన్ఐఎస్‌పి, ఎన్ఎండిసికి చెందిన 10 మంది అధికారులు రూ.315 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ప్రధాన అరోపణ. జగదల్‌పూర్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ పనులకు సంబంధించి రూ.174 కోట్ల బిల్లులను పొందడానికి మెకాన్ అధికారుల చేతులు తడిపినట్లు ప్రధాన అరోపణ. ఈ ప్రాజెక్టులో అధికారులకు దాదాపు రూ.78 లక్షలు లంచాలు ముట్టజెప్పిందని ప్రాథమిక విచారణలో తేలింది.

ముడుపుల ఆరోపణలపై ఎన్ఐఎస్‌పి, ఎన్ఎండిసికి చెందిన ఎనిమిది మంది అధికారులు, మెకాన్‌కు చెందిన ఇద్దరు అధికారుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. మేఘా ఇంజనీరింగ్‌కు ఎన్ఎండిసి సంబంధించిన ఐరన్ అండ్ స్టీల్ ప్లాంట్ లిమిటెడ్ (ఎన్ఐఎస్‌పి) ఐదేళ్ల పాటు పాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ వచ్చింది. దాంతో పాటు నిస్ప్ ప్రాజెక్ట్ ఇంటేక్ వెల్ అండ్ పంప్ హౌస్, క్రాస్ కంట్రీ పైప్‌లైన్ పనులు మేఘాకు కేటాయించారు. అయితే తమకు ఈ ప్రాజెక్ట్ వచ్చేలా చేసుకునేందుకు.. అనంతరం బిల్లుల క్లియరెన్స్‌లో అధికారులకు లంచాలు ముట్ట జెప్పిందనే ఆరోపణలు ఉన్నాయి.

గతనెల ఎన్నికల సంఘం విడుదల చేసిన డేటా ప్రకారం.. మేఘా ఇంజినీరింగ్ అధికంగా రూ.966 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్ల(ఇబి)ను కొనుగోలు చేసి రెండో స్థానంలో ఉంది. అత్యధికంగా దాదాపు రూ.586 కోట్లను బిజెపికి విరాళంగా ఇచ్చింది. అలాగే బిఆర్ఎస్‌కు రూ.195 కోట్లు, వైసిపికి రూ.37 కోట్లు, టిడిపికి రూ.25 కోట్లు చొప్పున నిధులను విరాళంగా సమకూర్చింది. కాగా.. అధికార, ప్రతిపక్ష పార్టీలకూ కోట్ల రూపాయల్లో విరాళాలు అందించిన మేఘా ఇంజనీరింగ్‌పై లోక్‌సభ ఎన్నికల ముందు సిబిఐ చర్యలు తీసుకోవటం చర్చనీయాంశంగా మారింది.

జగదల్‌పూర్‌లోని మెకాన్ కంపెనీకి దక్కిన ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ వద్ద ఇంటెక్ వెల్, పంప్ హౌస్, క్రాస్ కంట్రీ పైప్‌లైన్ పనులకు సంబంధించి రూ.174 కోట్ల బిల్లుల చెల్లింపుల్లో అధికారులకు లంచాలను ముట్టజెప్పింది. ఈ



ఆరోపణలపై సిబిఐ గతేడాది ఆగస్టు 10న ప్రాథమిక విచారణను నమోదు చేసింది. ప్రాథమిక విచారణలో తేలిన వివరాల ఆధారంగా మార్చి 31న సాధారణ కేసు నమోదైంది. ఎన్ఐఎస్‌పి, ఎన్ఎండిసి లిమిటెడ్‌కు చెందిన ఎనిమిది మంది అధికారుల పేర్లను సిబిఐ పేర్కొంది.. వీరు రూ. 73.85 లక్షల లంచం అందుకున్నారని ఆరోపించింది. అలాగే.. రూ. 5.01 లక్షల చెల్లింపును అందుకున్నారన్న ఆరోపణలతో మెకాన్ లిమిటెడ్‌కు చెందిన ఇద్దరు అధికారుల పేర్లనూ సిబిఐ చేర్చింది.

ఈ కేసులో ఎన్ఎండిసి, ఎన్ఐఎస్‌పి మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ దాస్, డైరెక్టర్ (ప్రొడక్షన్) డికె మోహంతి, డిజిఎం పికె భుయన్, డిఎం నరేష్ బాబు, సీనియర్ మేనేజర్ సుబ్రో బెనర్జీ, రిటైర్ట్ సిజిఎం (ఫైనాన్స్) ఎల్ క్రిష్ణ మోహన్, జిఎం (ఫైనాన్స్) కె రాజ శేఖర్, మేనేజర్ (ఫైనాన్స్) సోమ్నాత్ ఘోష్‌లు రూ.73.85 లక్షలు తీసుకున్నట్లు ఎఫ్ఐఆర్‌లో సిబిఐ చేర్చింది. మెకాన్‌కు సంబంధించి ఎజిఎం (కాంట్రాక్ట్స్) సంజీవ్ సహాయ్, డిజిఎం కె ఇల్లవర్సులు రూ.174.41 కోట్ల చెల్లింపుల్లో రూ.5.01 లక్షల లంచం తీసుకున్నారని సిబిఐ తెలిపింది. ఎంఇఐఎల్ జనరల్ మేనేజర్ సుభాష్ చంద్రకు చెందిన 73 ఇన్‌వాయిస్‌ల చెల్లింపులు జరగడంతో ఆయన పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చింది.

ఇజ్రాయిల్ నౌకను స్వాధీనం చేసుకున్న ఇరాన్

- ఆ నౌకలో 17మంది భారతీయులు సహా 25మంది

టెహరాన్ : సిరియాలో తమ దౌత్య కార్యాలయంపై బాంబులు చేసి ధ్వంసం చేసిన ఇజ్రాయిల్‌కు చెంప పెట్టు తప్పదని హెచ్చరించిన ఇరాన్ అనుకున్నంత పని చేసింది. పోర్చుగీస్ పతాకంతో ఉన్న ఎంఎస్‌సి అరీస్ అనే ఈ సరుకుల రవాణా నౌకను ఇజ్రాయిల్‌కు చెందిన జోడియాక్ మారిటైమ్ అనే షిప్పింగ్ సంస్థ నిర్వహిస్తోంది. ఈ నౌక శనివారం పర్షియన్ గల్ఫ్‌లో ప్రవేశించినప్పుడు ఇరానియన్ కమాండోలు మెరుపుదాడి చేసి దానిని తమ ఆధీనంలోకి తీసకున్నారు. ఇరాన్ చర్యను ఇజ్రాయిలీ విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ తీవ్రంగా ఖండించారు. ఇరాన్‌పై మరిన్ని ఆంక్షలు విధించాలని పశ్చిమ దేశాలను ఆయన కోరారు. హర్మజ్ జలసంధి సమీపంలో ఎంఎస్‌సి అరీస్ కంటైనర్‌షిప్‌ను ఇరాన్ రివల్యూషనరీ సాయుధ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ఈ నౌకను తమ ఆధీనంలోకి తీసుకుని హర్మజ్ జలసంధి గుండా తీసుకొస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా ఇర్నా తెలియజేసింది. ఎమిరటస్ ఓడరేవు ఫుజియారియా నుంచి బయల్దేరి సముద్ర మార్గం గుండా వస్తున్న ఈ నౌకలో 25మంది సిబ్బంది వున్నారని, వారిలో 17మంది భారతీయులని ఇటాలియన్-స్విస్ షిప్పింగ్ కంపెనీ ఎంఎస్‌సి ఒక ప్రకటనలో తెలిపింది. మిగిలిన వారిలో నలుగురు ఫిలిప్పీన్ జాతీయులు, ఇద్దరు పాకిస్తానీలు, ఒక రష్యన్, ఒక ఎస్తోనియా జాతీయుడు వున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతున్నామని, వారందరూ సురక్షితంగా వుండేలా, నౌక సజావుగా

నౌకను స్వాధీనం చేసుకుంటున్న ఇరానియన్ కమేండోలు



ముందుకు సాగేలా చూస్తున్నామని వెల్లడించింది. టెహరాన్‌లో, ఢిల్లీలో దౌత్య మార్గాల ద్వారా ఇరాన్ అధికారులతో మాట్లాడుతున్నామని, త్వరలో వారిని విడిపించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఇరాన్ ప్రాదేశిక జలాల వైపునకు ఈ నౌక కదులుతోందని తెలిపింది.

ఇజ్రాయిల్ బిలియనీర్ అయిన ఇయాల్ ఓఫర్, ఆయన కుటుంబం నిర్వహిస్తున్న జోడియాక్ గ్రూపులో భాగమైన జోడియాక్ మారిటైమ్‌తో ఈ నౌకకు సంబంధముంది. హెలికాప్టర్ నుండి సైనికులు ఓడలోకి దిగుతున్న దృశ్యం మీడియాకు లభించింది.. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన జలమార్గంగా భావిస్తున్న యుఎఇ ఫుజారియాకు ఈశాన్యంగా 50నాటికల్ మైళ్ల దూరంలో ప్రాంతీయ అధికారులు ఈ నౌకను అదుపులోకి తీసుకున్నారని బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ (యుకెఎంటిఓ) తెలిపింది. శుక్రవారం ఈ నౌక దుబాయ్ తీరం నుండి హర్మజ్‌జలసంధి వైపు కదులుతోంది. తన ట్రాకింగ్ డేటాను ఈ నౌక ఆఫ్ చేసింది. ఈ ప్రాంతంలో తిరిగే ఇజ్రాయిల్ అనుబంధ నౌకలకు ఇది సర్వసాధారణమే. తాజా పరిణామంతో మధ్యప్రాచ్యానికి మరిన్ని మిలటరీ సామగ్రిని అమెరికా తరలిస్తోంది. ఇజ్రాయిల్‌కు మద్దతుగా తాము నిలుస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు.

వేతనాలు పెంచాలని సమ్మె

శాంటియాగో : మరింత మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని, అధిక వేతనాలు కావాలని డిమాండ్ చేస్తూ చిలీవ్యాప్తంగా కార్మికులు సమ్మె నిర్వహించారు. శాంటియాగో సహా దేశం నలుమూలలా పలు నగరాల్లో గురువారం ప్రదర్శనలు జరిగాయి. యునిఫైడ్ వర్కర్స్ సెంటర్ (సియుటి) ఇచ్చిన సమ్మె పిలుపునకు 30 కార్మిక సంఘాలు, విద్యార్థి గ్రూపులు, చిన్న వ్యాపారాల సంఘాలు, పౌర సమాజ గ్రూపులు అందరూ మద్దతును ఇచ్చారు. చిన్న చిన్న పట్టణాలు, నగరాల్లో కూడా వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేశారు. మరింత బలమైన రీతిలో సమిష్టి బేరసారాల హక్కులు వుండాలని, మెరుగైన పెన్షన్లు ఇవ్వాలని, ఉచిత విద్య, నాణ్యత గల ఆరోగ్య సంరక్షణ అవసరమని వారు కోరుతున్నారు. కార్మిక కుటుంబాలకు మద్దతుగా నిలవాలని, మరిన్ని సామాజిక రక్షణ చర్యలకు నిధులు కోసం పన్నుల సంస్కరణలను ఆమోదించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



సమ్మె చేస్తున్న చిలీ మహిళా కార్మికులు



సంజయ్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బృందాకరత్ తదితరులు

కేజ్రీవాల్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం

- ఆప్ ఎంపి సంజయ్‌సింగ్

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను తీహార్ జైలులో చిత్రహింసలకు గురిచేస్తున్నారని, ములాఖత్‌లో ఆయన భార్య సునీత వ్యక్తిగతంగా కలవడానికి అనుమతించడం లేదని ఆప్ ఎంపి సంజయ్‌సింగ్ విమర్శించారు. శనివారం ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జైలు అధికారులు కేజ్రీవాల్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కేజ్రీవాల్‌తో కుటుంబ సభ్యులు వ్యక్తిగతంగా సమావేశమవడానికి అనుమతించడం లేదని, కేవలం మెస్‌కు అవతలి నుంచి కలవడానికి మాత్రమే అనుమతిస్తున్నారని చెప్పారు. తీహార్ జైలులో కేజ్రీవాల్‌ను ఆయన భార్య సునీత, వ్యక్తిగత కార్యదర్శి భిభవ్‌కుమార్ మంగళవారం కలవగా, వ్యక్తిగత కార్యదర్శిని విజిలెన్స్ తొలగించిన సంగతి తెలిసిందే.

సంజయ్‌సింగ్‌కు బృందాకరత్ సంఘీభావం

ఆప్ నాయకులు సంజయ్‌సింగ్‌కు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, పార్టీ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీ శనివారం సంఘీభావం తెలియజేశారు. మోడీ ప్రభుత్వ ప్రోద్భలంతో ఇడి ఆప్ నాయకులను లక్ష్యంగా చేసుకుందని బృందాకరత్ విమర్శించారు. అరెస్టుల తరువాత ఢిల్లీలో బిజెపిపై ప్రజల్లో ఆగ్రహావేశాలు పెరుగుతున్నాయని తెలిపారు.

యుపిలో 'ఇండియా' వేదికకు మద్దతు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో పోటీ చేసే 'ఇండియా' వేదిక అభ్యర్థులకు బేషరతుగా మద్దతు తెలుపుతున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. రాష్ట్రంలో ఎక్కడా తాము పోటీచేయబోమని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, నిరంకుశ పాలనను అంతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. లక్నోలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యుడు, ఆప్ నాయకుడు సంజయ్‌సింగ్ మాట్లాడారు. ఢిల్లీలో ఆపరేషన్ కమలంపై పోరాటంలో మద్దతు ఇచ్చినందుకు సమాజ్‌వాదీ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇవి సాధారణ ఎన్నికలు కాదని, అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని కాపాడి, అట్టడుగు, అణగారిన వర్గాల హక్కులను కాపాడేందుకు జరుగుతున్న ఎన్నికలని అన్నారు. నియంతృత్వ పాలన నుంచి దేశాన్ని కాపాడేందుకు ఇండియా వేదిక అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ప్రచారంలో ఉన్న కాంగ్రెస్ అధిష్టానంతో చర్చలు జరిపిన తరువాత తమ పార్టీ పాత్ర, ప్రచారానికి సంబంధించి నిర్ణయిస్తామని చెప్పారు. ఆప్ కార్యకర్తలంతా ఎస్‌పి అభ్యర్థులను గెలిపించేందుకు, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు కృషి చేస్తారని తెలిపారు. ఆప్‌కు అఖిలేష్ యాదవ్ మద్దతు తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే తప్పుడు కేసులు పెట్టి ఢిల్లీ సిఎం కేజ్రీవాల్, జార్ఖండ్ సిఎం హేమంత్ సొరేన్‌ను మోడీ ప్రభుత్వం జైలుకు పంపించిందని విమర్శించారు.

15న కేజ్రీవాల్ పిటిషన్ విచారణ

న్యూఢిల్లీ : తన అరెస్టును సవాలు చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనుంది. ఈ నెల 1న ట్రయల్ కోర్టు కేజ్రీవాల్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ జ్యుడీషియల్ రిమాండ్ ఏప్రిల్ 15తో ముగియనుంది. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాల్సిందిగా కేజ్రీవాల్ తరపు న్యాయవాదులు ఎఎం సింఘ్వీ, షాదన్ ఫర్సాత్ ఈ నెల 10 సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మెయితీల దాడిలో ఇద్దరు కుకీల మృతి

మణిపూర్ : ఎన్నికల నేపథ్యంలో మణిపూర్‌లో కుకీలపై మెయితీ దుండగులు మరోసారి దాడి చేశారు. కుకీలు ఎక్కువగా ఉండే కాంగ్‌పోక్సి జిల్లా సరిహద్దు గ్రామాల్లో మెయితీలు జరిపిన దాడుల్లో ఇద్దరు క్రిస్టియన్ కుకీ వాలంటీర్లు మరణించారు. వారి మృతదేహాలను ఛిద్రం చేశారని కుకీలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో వచ్చిన దుండగులు ఫిలాంగ్‌మోల్ ప్రాంతంలోని గ్రామాలపై కాల్పులు జరిపారు. కుకీ వాలంటీర్లు ప్రతిఘటించడంతో ఎదురుకాల్పులు జరిగాయి.

ఎన్నికల ముందు ఉద్రిక్తతలు పెంచేందుకే...

ఎన్నికల ముందు ఉద్రిక్తతలను మరోసారి పెంచేందుకే దాడులు జరిపారని పలువురు విమర్శిస్తున్నారు. మైతీలు అధికంగా నివసించే ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గంలో ఈ నెల 19న తొలి దశ పోలింగ్ జరగనుంది. కుకీలు, నాగాలు ఎక్కువగా ఉన్న ఔటర్ మణిపూర్ నియోజకవర్గంలో ఈ నెల 19, 26 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. ఔటర్ మణిపూర్‌లో కుకీల నుంచి ఎవరూ పోటీలో లేరు. నాగా పీపుల్స్ పార్టీ, కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొంది. ఎన్‌పిపికి బిజెపికి మద్దతు ప్రకటించింది.

పాలస్తీనా గ్రామాలపై సెటిలర్ల దాడులు

- సెంట్రల్ లండన్‌లో పాలస్తీనా అనుకూల ప్రదర్శన

గాజా : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనా గ్రామాలపై ఇజ్రాయిల్ సెటిలర్లు దాడులు చేస్తున్నారు. రమల్లా తూర్పు ప్రాంతం, నబ్లస్ నుండి వెస్ట్ బ్యాంక్ ఉత్తర ప్రాంతం వరకు గల గ్రామాల్లో ఈ దాడులు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల పాలస్తీనియన్లు నివసిస్తున్న ఇళ్లను తగలబెడుతున్నారు. ఈ దాడులను ఇజ్రాయిల్ బలగాలు బాహాటంగానే ప్రోత్సహిస్తున్నాయి. సెటిలర్ల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా రక్షణ దళాలను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా నబ్లస్ గవర్నర్ ప్రజలకు పిలుపిచ్చారు. సెటిలర్ల దాడులను ఇజ్రాయిల్ ప్రతిపక్ష నేత యార్ లాపిడ్ తీవ్రంగా ఖండించారు. టీనేజీ సెటిలర్ బాలిక ఆచూకీ తెలియకుండా పోయిన తర్వాత మరణించడంతో ఈ దాడులు మొదలయ్యాయి. ఇది చట్టాలను ఉల్లంఘించడమే కాగలదని ఆయన హెచ్చరించారు. ఈ అరాచకాన్ని ఆపాలని కోరారు.

మరోవైపు సెంట్రల్ గాజాలో ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడిలో ఐదుగురు మరణించగా, 30మందికి పైగా గాయపడ్డారు. డేర్ ఎల్ బలాహ్ ప్రాంతంతో సహా పలు చోట్ల ఇజ్రాయిల్ వైమానిక బలగాలు డజన్ల సంఖ్యలో దాడులు జరిపాయి. అనేకమంది మరణించారని వార్తలందాయి.

లండన్‌లో భారీ ప్రదర్శన

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని కోరుతూ సెంట్రల్ లండన్‌లో వేలాదిమంది ప్రజలు ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనా పతాకాలు చేబూని 'పాలస్తీనాకు విముక్తి', 'మారణకాండను ఆపండి' వంటి నినాదాలు చేశారు. రసెల్ స్క్వేర్ నుండి పార్లమెంట్ స్క్వేర్ వరకు ఈ ప్రదర్శన సాగింది. ఆరు మాసాలుగా ఈ ఊచకోత కొనసాగుతున్నా అంతర్జాతీయ సమాజం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వారు విమర్శించారు. అందువల్లే తమ వాణిని వినిపిస్తున్నామని లండన్‌వాసి ఒకరు వ్యాఖ్యానించారు.

9 మంది ప్రయాణికుల కిడ్నాప్, కాల్చివేత

- బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో తీవ్రవాదుల దారుణం
- మరో ఘటనలో ఇద్దరు మృతి

కరాచి : పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో గుర్తు తెలియని తీవ్రవాదులు తొమ్మిదిమంది బస్సు ప్రయాణికులతో సహా 11మందిని చంపేశారని అధికారులు శనివారం తెలిపారు. తొలుత సాయుధులైన వ్యక్తులు కొంతమంది నోషికి జిల్లాలోని హైవేపై బస్సును ఆపేశారని, తుపాకీతో బెదిరించి తొమ్మిది మందిని కిడ్నాప్ చేశారని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత బుల్లెట్ల గాయాలతో ఈ తొమ్మిది మంది మృతదేహాలు ఒక వంతెనకు సమీపంలోని పర్వత ప్రాంతాల్లో కనిపించాయని చెప్పారు. క్వెట్టా నుండి తఫ్తాన్‌కు ఈ బస్సు వెళుతోంది. అదే హైవేపై వెళ్తున్న కారుపై కాల్పులు జరిగాయి. ఆ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు మరణించగా, ఇద్దరు గాయపడ్డారు.



మీ కోసం

ఫ్రిజ్ నుంచి చెడు వాసన వస్తుంటే ఒక నిమ్మకాయను సగానికి కోసి ఓ మూలన పెట్టాలి. అది ఫ్రిజ్‌లోని చెడు వాసనలను పీల్చుకుంటుంది.

జీవన సౌరభం

చిన్నపాటి సమస్య కూడా కొన్నిసార్లు కొండంత ఇబ్బందిని తెచ్చి పెడుతుంది.

కూసే గాడిద - మేసే గాడిద

సీతాపతి పంతులు గారు పిల్లలందరి చేత ఎక్కాలు వల్లె వేయిస్తున్నారు. జారిపోతున్న నిక్కరు పొట్ట మీదకి ఎగేసుకుంటూ ఏడుస్తూ వచ్చి కాత్యాయిని పక్కన కూర్చున్నాడు రుద్ర.




పంతులు గారు చెప్పిన ఎక్కాలు వల్లె వేయకుండా కాత్యాయనితో మాట్లాడటం మొదలు పెట్టాడు. అది చూసిన పంతులు గారు 'ఒరేయ్ రుద్రా 'కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టడం' అంటే ఇదే మరి! నువ్వు ముందు వరుసలో కూర్చో' అని మందలించారు. మర్నాడు చదువుకోడానికి పంతులు గారి ఇంటికి వెళ్లకుండా పెద్దమ్మ ఇంటికి వెళ్ళాడు రుద్ర. పెరట్లో ఉన్న మొక్కలకు పాదులు తీసి నీళ్ళు పెడుతోంది పెద్దమ్మ.

'పెద్దమ్మా, నిన్న మా పంతులు గారు నన్ను చూసి, కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడ గొట్టింది' అన్నారు. నాకు అర్థం కాలేదు. అదేంటో చెప్పవా, పెద్దమ్మా?' అని అడిగాడు.

'పూర్వం ఒక ఆసామి దగ్గర రెండు గాడిదలు ఉండేవి. అవి ఒక రోజు మేతకు వెళ్ళాయి. మడి గట్టున ఏపుగా పెరిగిన గడ్డిని ఒక గాడిద మేస్తోంది. రెండవది అటూ ఇటూ తిరుగుతూ అరుస్తోంది. ఈ అరుపులు విన్న మడి యజమాని పరుగు పరుగున వచ్చి రెండింటినీ దూరంగా తరిమేశాడు. రెండింటికీ తిండి లేకుండా అయ్యింది. ఇదీ కథ. ఒకరి పనిని ఇంకొకరు పాడు చేసిన సందర్భంలో ఈ సామెతను వాడుతారు. ఇంతకూ తమరు చేసిన ఘనకార్యం ఏమిటో సెలవిస్తారా!' అని నవ్వుతూ అడిగింది పెద్దమ్మ.

జరిగినదంతా పక్కనే ఉన్న కాత్యాయిని చెప్పింది. 'వీడెప్పుడూ ఇంతే అల్లరోడు' అని ప్రేమగా రుద్ర తలని నిమిరింది పెద్దమ్మ.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.





తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ



- మనస్విని,
8వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు,
మంగళగిరి.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పుస్తకాల హోటల్ ..!

పిల్లల చేత సెల్‌ఫోను మరిపించి, పుస్తకాలు చదివిస్తూ, బువ్వ తినిపించేది ఎవరు? అనడిగితే ఠకీమని "ఇంకెవరు.. అమ్మ" అని చెబుతాం కదా. కానీ, ఇక్కడ ఆ పని చేస్తోంది ఒక హోటల్. మనం ఆ హోటల్‌కు వెళ్లి ఆర్డర్ ఇచ్చి "ఫుడ్ వచ్చేవరకు ఫోన్ చూసుకుంటాం" అంటే కుదరదు. "ఇదేం రూలండీ. ఫోన్ తియ్యకుండా ఎలా టైంపాస్ చెయ్యడం?" అనుకోకండి. అక్కడ మనతో మాట్లాడేందుకు వేలకొలదీ పుస్తకాలుంటాయి. అవి నవ్వుతూ మనల్ని పలకరిస్తాయి. ఇదంతా వినడానికే కాదు; అక్కడ తినడానికి, చదవడానికి కూడా చాలా బాగుంటుంది. ఫ్యామిలీతో ఆ హోటల్‌కు వెళ్తే, ఇంటిల్లిపాదికీ పనికొచ్చే పుస్తకాలు అక్కడ అందుబాట్లో ఉంటాయి. ఎవరికి నచ్చింది వారు చక్కా చదూకోవొచ్చు!

ఈ హోటల్ పెట్టింది ఎవరు? అంటే మళ్లీ 'అమ్మే' అని సమాధానం. అవును... చద్దన్నం లాంటి స్వచ్ఛమైన మనసున్న ఓ 74 నాలుగేళ్ల పెద్దమ్మ మదిలోని ఆలోచనే ఈ హోటల్. ఆమె పేరు భీమాబాయి జోంధాలే. మహారాష్ట్రలోని నాసిక్‌లో 'బుక్ హోటల్' పేరుతో దీనిని నడుపుతోంది.

భీమాబాయికి చిన్నప్పుడు చదువంటే చాలా ఇష్టం. పుస్తకాలంటే ప్రాణం. పేదరికం ఆమెను పుస్తకాల నుంచి పన్నెండేళ్లకే దూరం చేసింది. ఆరో తరగతిలో ఉండగానే ఇంట్లో వాళ్లు ఆమెకు పెళ్లి చేసి, అత్తింటికి పంపేశారు. భర్త తాగుబోతు. బాధ్యత లేని మనిషి. ఇంట్లోకి ఏమీ తెచ్చిపెట్టేవాడు కాదు. దీంతో, చాలా చిన్నప్పుడే బండెడు సంసారాన్ని ఈదాల్సిన బాధ్యత ఆమెపై పడింది. ఈ బతుకు పోరాటంలో ఆమె చదువు ఆశ నెరవేరకుండా పోయింది!

భర్త బలాదూరుగా తిరిగేవాడు. ఇరవై ఏళ్ల వయసైనా దాటకుండానే ఆమెకు ఇద్దరు పిల్లలు. వారిని పెంచుకుంటూ వ్యవసాయం చేసేది. తాగుబోతు భర్తకు ఇంటి బాధ్యతలు ఏమీ పట్టలేదు. ఇంటిపనీ, బయటపనీ, పొలం పనులూ అన్నీ ఆమె నెత్తిన పడ్డాయి. ఆమె పిల్లలూ ఆమెతో పాటే కష్టపడేవారు. ఎలాగోలా పొలం ఆధారంగా కుటుంబాన్ని నడుపుతున్న సమయంలో ఆ పొలాన్ని కూడా తాగుడు కోసం ఆమె భర్త అమ్మేశాడు. ఈ పరిస్థితి ఆమెను మరింతగా కుంగదీసింది. తన బిడ్డలకు కంచంలో ఇంత బువ్వ పెట్టడానికి వేరే వాళ్ల పొలాల్లో గంటల తరబడి కష్టపడేది.

తల్లి కష్టాన్ని అర్థం చేసుకున్న పిల్లలు ఇద్దరూ ఆమె వెన్నంటే ఉన్నారు. బాధ్యతలను, బాధలను పంచుకున్నారు. తల్లిలాగే చదువుకోవాలనే తపన కొడుకు ప్రవీణ్‌కు బాగా ఉండేది. కానీ, కుటుంబం కోసం పని వెతుక్కోవల్సి వచ్చింది. ఒక దిన పత్రిక పంపిణీ పనిలో చేరాడు. తన చదువుకు తానే డబ్బు సమకూర్చుకున్నాడు. తర్వాత వారి కుటుంబం 2008లో నాసిక్ నగరానికి మారింది. పుస్తకాల పట్ల ఆసక్తితో ఉన్న ప్రవీణ్ పుస్తక ప్రచురణ సంస్థ మొదలు పెట్టాడు. తల్లి ఎంతో సంతోషించింది. అంతా బాగానే నడుస్తోంది అనుకున్నంతలో ప్రచురణ సంస్థను మూసివేయాల్సి వచ్చింది.



అప్పటికే వారి వద్ద మరాఠీ భాషా పుస్తకాలు కొన్ని మిగిలిపోయాయి. భీమాబాయి కూతురి సహాయంతో రోడ్డు పక్కన ఒక చిన్న టీ స్టాల్‌ను ప్రారంభించింది. ఒక అరలో పుస్తకాలను ఉంచి, అక్కడికి వచ్చేవారిని టీ తయారయ్యేలోగా చదవమని ప్రోత్సహించేది. ఆ విధంగా అక్కడికి వచ్చే టీ ప్రియులకు పుస్తక పఠనం ఒక అలవాటుగా మారింది. వ్యవసాయం చేసుకోవాల్సిన వారు ఇలా రోడ్ల మీద టీ అమ్ముకోవటం ఏమిటని గ్రామస్తులు, బంధువులు సణుక్కున్నా ఆమె పట్టించుకోలేదు.

ఫోన్లువొద్దు.. పుస్తకాలు చదవండి...

కాస్త డబ్బు సమకూరాక 2010లో భీమాబాయి తన ఇద్దరు బిడ్డలతో కలిసి, ఇప్పుడు నడుపుతున్న అజ్జిచ్య పుస్తకాంచ హెూటల్‌ను ప్రారంభించింది. టిఫెన్లు, భోజనాల తయారీ కూడా మొదలు పెట్టారు. హోటల్‌కి వచ్చేవారు అదే పనిగా ఫోన్ చూడడం, తోటి వారితో మాటలు లేకుండా గడపటం భీమాభాయికి నచ్చలేదు. దీంతో, ఈసారి ఎక్కువ చోటు కూడా ఉంది కాబట్టి, మరిన్ని పుస్తకాలు రప్పించింది. అన్ని వయసుల వారికి పనికొచ్చే పుస్తకాలు అక్కడ అమర్చింది. "ఇక్కడ ఫోన్లు నిషేధం. చక్కగా పుస్తకాలు చదువుకోండి. తరువాత కడుపునిండా ఆరగించండి." అని బోర్డు కూడా పెట్టించింది. దీంతో, అది పుస్తకాల హోటల్‌గా అందరిలోనూ ప్రచారం జరిగింది. ఇప్పుడు అక్కడి వచ్చినవారెవరూ పుస్తకాలు చదవకుండా ఉండరు. కొంతమందైతే పుస్తకాల కోసమే ఆ హోటల్‌కు వస్తుంటారు. వచ్చినవాళ్లు చదువుకుంటూ పుస్తకాల్లో నిమగ్నమైపోతే, తన చిన్ననాటి ఆశను వారిలో చూసుకుంటూ మురిసిపోతుంది భీమాబాయి.

25 పుస్తకాలతో రోడ్డు పక్కన ప్రారంభించిన చిన్న టీస్టాల్ నుంచి 5000 పుస్తకాలున్న చక్కని లైబ్రరీ హోటల్‌గా ఆమె కల సాకారం అయింది. అక్కడి భాషలో 'అజ్జిచ్య పుస్తకాంచ హెూటల్' అని బోర్డు రాసి ఉంటుంది. అక్కడ చదవడానికి విలువైన పుస్తకాలతో పాటు, తినడానికి రుచికరమైన భోజనం అందిస్తూ హోటల్‌ను ఎంతో ఆహ్లాదంగా, విజ్ఞానదాయకంగా నడుపుతోంది ఆజీ అమ్మ. ఆమె ఉత్సాహం ముందు 74 ఏళ్ల వయసు కనిపించదు.

హోటల్‌కు వచ్చి వెళ్లే కష్టమర్లను చిరునవ్వుతో పలకరిస్తుంది. వారి టెన్షన్లన్నీ మాయమై మనసు ఉల్లాసం కలిగేలా ఎప్పుడూ హోటల్ వాతావరణాన్ని ఉంచుతుంది. హోటల్ అంతా కలియదిరుగుతూ కష్టమర్లను పలకరిస్తూ ఓ చక్కని పుస్తకాన్ని అందిస్తూ, కమ్మనైన ఆహారాన్ని వడ్డిస్తూ ఆమె ఎప్పుడూ బిజీగా గడుపుతుంది.

"నా కష్టమర్లందరూ ఆ పుస్తకాలను ఎంతో ఆసక్తిగా చదువుతున్నప్పుడు, వారిలో చాలామంది ఆహారం కోసం వచ్చామన్న విషయం కూడా మరిచిపోతారు. అంతగా లీనమై చదివే వారిని చూసి నా మనసు గర్వంతో ఉప్పొంగుతుంది" అని నవ్వుతూ చెబుతోంది భీమాబాయి.



దానిమ్మలో పోషకాలెన్నో...

ఏడాది పొడవునా లభించే పండ్లలో దానిమ్మ ఒకటి. తినటం వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందొచ్చు. వారంలో ఏడు రోజులపాటు క్రమం తప్పకుండా తింటే కొన్ని రకాల అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందొచ్చునని నిపుణులు పేర్కొంటున్నారు. దానిమ్మలో పోషకాలు, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్ సి, కె, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు వంటివి పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. వాటిని తినటం వల్ల శరీరానికి తక్కువ కేలరీలు అందుతాయి. యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగివున్నాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించటానికి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడానికి సహాయపడతాయి. రసం తాగటం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం తక్కువగా ఉంటుంది. వీటిలో ఉండే పాలీ ఫెనాల్స్ గుణాలు వ్యాయామం చేసేటప్పుడు శక్తిని అందిస్తాయి. త్వరగా అలసట రాదు. ఫైబర్ మలబద్ధకాన్ని నివారించటానికి, జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. విటమిన్-సి రోగ నిరోధకశక్తిని పెంచటానికి, జలుబు, ఫ్లూ వంటి అంటువ్యాధులను నివారించటానికి సహాయపడుతుంది.





చరణ్, జాన్వీ ఆ సీక్వెల్ చేయాలి
చిరంజీవి


'జగదేక వీరుడు.. అతిలోక సుందరి' రెండోభాగంలో రామ్‌చరణ్‌తేజ్, జాన్వీ కపూర్ నటిస్తే చూడాలనేది తన కల అని, దాని కోసం ఎదురుచూస్తున్నానని టాలీవుడ్ హీరో చిరంజీవి వ్యాఖ్యానించారు. గతంలో చిరంజీవి, శ్రీదేవి ఈ సినిమా చేసిన విషయం తెలిసిందే. సౌత్ ఇండియా ఫిల్మ్ ఫెస్టివల్-2024లో భాగంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'సినిమాల్లోకి రావాలనే ఆలోచన ఉన్నప్పుడు నేనెప్పుడూ మెగాస్టార్ అవుతానని అనుకోలేదు. కానీ, మంచిస్థానంలో ఉంటానని అనుకున్నారు. ఎందుకంటే నా ప్రతిభపై నమ్మకం ఉంది. ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకున్నా. దాని ఫలితమే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నా. నాకు మంచి పాత్రలు ఇచ్చిన దర్శకులకు ధన్యవాదాలు. అభిమానుల ప్రేమను కొలవలేను. నా అభిమానులు మాస్ సినిమాల్లో నన్ను చూడాలనుకునేవారు. నాకేమో క్లాసికల్ సినిమాలు చేయాలని ఉండేది. 'ఖైదీ' నాకు స్టార్ స్టేటస్ ఇచ్చింది. అందులోని యాక్షన్ సీన్లు, డ్యాన్సులు, భావోద్వేగ సన్నివేశాలు మంచి పేరు తెచ్చాయి. ఆ తర్వాత వచ్చిన 'మంత్రి గారి వియ్యంకుడు', 'శుభలేఖ' లాంటి చిత్రాలను కూడా ప్రేక్షకులు ఆదరించారు. ప్రేక్షకులు రెండు రకాల సినిమాలు చూడటానికి ఇష్టపడతారని అర్థమైంది. కె.బాలచందర్ దర్శకత్వంలో 'రుద్రవీణ' చేశాం. నాకు మంచి పేరు వచ్చింది. అయితే ప్రొడ్యూసర్‌గా నా తమ్ముడికి లాభాలు రాలేదు. అందుకే నిదానంగా కమర్షియల్ వైపు వెళ్లాల్సివచ్చింది. చరణ్‌తో కలిసి జాన్వీ ఓ సినిమా చేస్తోంది. ఇటీవల ఆమెతో మాట్లాడుతున్నప్పుడు కొంచెం భావోద్వేగంగా అనిపించింది. శ్రీదేవి గుర్తుకు వచ్చింది. జగదేక వీరుడు.. అతిలోక సుందరికి సీక్వెల్ చరణ్, జాన్వీ నటిస్తే చూడాలని ఉంది. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలు, సినిమాలతో సంతృప్తిగా ఉన్నానని చెప్పలేను. మనం ఎదురుచూసే పాత్రలు వాటంతట అవే రావాలి. నాకు ఫ్రీడమ్ ఫైటర్‌గా చేయాలని ఉండేది. సైరా చేశాను. ఆంధ్రాలో యావరేజ్‌గా నిలిచింది. మిగతా ప్రాంతాల్లో బాగానే ఆడింది. ఆ సినిమా వల్ల చాలానే నష్టపోయాం. నా సంతృప్తి కోసం సినిమాలు చేస్తే ప్రొడ్యూసర్ జేబు ఖాళీ అవుతుంది. మంచి కంటెంట్ కోసం ఎదురుచూస్తున్నా. నాకు ఎలాంటి అంచనాలు లేవు' అంటూ వ్యాఖ్యానించారు.

డాక్టరేట్ అందుకున్న రామ్‌చరణ్



తెలుగు నటుడు రామ్ చరణ్‌తేజ్ డాక్టరేట్‌ను అందుకున్నారు. చెన్నైలోని వేల్స్ యూనివర్శిటీ ఇటీవల డాక్టరేట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. చిత్ర పరిశ్రమతోపాటుగా సమాజానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లుగా వేల్స్ విశ్వవిద్యాలయం తెలిపింది. ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ టిజి సీతారామ్, వేల్స్ విశ్వవిద్యాలయం విసి డాక్టర్ ఐసరి కె.గణేష్ అందజేశారు. రామ్‌చరణ్‌తో పాటుగా చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి.వీరముత్తువేల్, త్రివిక్రన్ హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్, పౌండర్ ఛైర్మన్ డాక్టర్ జిఎస్‌కె వేలు, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ పద్మశ్రీ శరత్‌కమల్ ఆచంట కూడా ఈ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. చెన్నై పల్లావరంలోని వేల్స్ క్యాంపస్‌లో జరిగిన యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవంలో టిజి సీతారామ్ ముఖ్య అతిథిగా మాట్లాడారు.

19న 'టెనెంట్' సినిమా విడుదల



కమెడియన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తన కంటే ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సత్యం రాజేష్ హీరోగా 'టెనెంట్' సినిమాలో నటిస్తున్నాడు. శనివారం నాడు ఈ సినిమాకు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. వై.యుగంధర్ దర్శకత్వంలో మహాతేజ క్రియేషన్స్ బ్యానర్‌పై మోగుళ్ల చంద్రశేఖరరెడ్డి నిర్మిస్తున్నారు. మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేసేలా చాలా విలువైన కంటెంట్‌తోపాటు ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని నిర్మాతలు తెలిపారు.

'దర్శిని' పాటలు బాగున్నాయ్



వి4 సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై డాక్టర్ ఎల్‌వి సూర్యం నిర్మాతగా, డాక్టర్ ప్రదీప్ అల్లు దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'దర్శిని'. వికాస్, శాంతి హీరో హీరోయిన్లుగా నటించారు. సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ కాన్సెప్టుతో దీనిని తెరకెక్కించారు. త్వరలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్ చిత్రబృందానికి 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. 'ఈ సినిమాలోని పాటలు, టీజర్ చూశాను. చాలా బాగున్నాయి. సినిమా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. టీమ్ అందరికీ శుభాకాంక్షలు' అంటూ పేర్కొన్నారు.

'మేకప్ మ్యాన్' సినిమా ప్రారంభం



అభిరామ్ మూవీస్ బ్యానర్‌పై సీనియర్ మేకప్ మ్యాన్ కుమార్ మెట్టుపల్లి నిర్మాతగా, దివాకర్ యడ్ల దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'మేకప్ మ్యాన్'. ధర్మవరపు సుబ్రహ్మణ్యం మేనల్లుడు శ్రీకాంత్ అవుటూరి ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. పోలూరు ఘటికచలం డైలాగులు, ఎంఎం శ్రీలేఖ సంగీతం అందిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. దర్శకుడు రవికుమార్ చౌదరి, నిర్మాతలు లయన్ సాయి వెంకట్, భరత్ పారేపల్లి హాజరయ్యారు. రవిచౌదరి క్లాప్‌కొట్టగా, సాయి వెంకట్ కెమెరా స్విచ్చాన్ చేశారు. భరత్ పారేపల్లి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు.

ఎదురులేని రాజస్తాన్

- ఉత్కంఠ పోరులో పంజాబ్‌పై మూడు వికెట్ల తేడాతో గెలుపు
- టాప్‌లోనే రాజస్తాన్ రాయల్స్



ఛండీగఢ్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17లో రాజస్తాన్ రాయల్స్‌కు జైత్రయాత్ర కొనసాగుతోంది. ఈ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచుల్లో ఐదు మ్యాచుల్లో గెలిచి పాయింట్ల పట్టికలో టాప్‌లో కొనసాగుతోంది. మహరాజా ఇంటర్నేషనల్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు మూడు వికెట్ల తేడాతో గెలిచింది. చివరి ఓవర్లో 10 పరుగులు కావల్సిన దశలో హెట్‌మైర్ తొలి రెండు బంతులకు పరుగులేమీ చేయకపోయినా.. ఆ తర్వాత సిక్సర్లతో మ్యాచ్‌ను ముగించాడు. ఛేదనలో భాగంగా రాజస్తాన్ ఓపెనర్ జైస్వాల్(39), రియాన్ పరాగ్(23), హెట్‌మైర్(27నాటౌట్) కీలకపాత్ర పోషించారు. పంజాబ్ బౌలర్లు రబడా, సామ్ కర్రన్‌కు రెండేసి, అర్ష్‌దీప్, లివింగ్‌స్టోన్, హర్షల్ పటేల్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్‌కు శుభారంభం దక్కలేదు. నాల్గో ఓవర్‌లోనే ఓపెనర్ అథర్వ తైడే(15) ఔటయ్యాడు. ఆ కాసేపటికే చాహల్.. ప్రభ్‌సిమ్రాన్ సింగ్(10)ను వెనక్కి పంపాడు. మరోవైపు కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో చెలరేగడంతో 12 పరుగుల వ్యవధిలోనే పంజాబ్ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ సామ్ కరన్(11), శశాంక్ సింగ్(9)లు సైతం విఫలమయ్యారు. దీంతో పంజాబ్ 70 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో జితేశ్ శర్మ(29), లివింగ్‌స్టోన్‌లు ఆరో వికెట్‌కు 33 పరుగుల జోడించారు. చివర్లో అశుతోష్(31; 16బంతుల్లో ఫోర్, 3సిక్సర్లు) మెరుపు బ్యాటింగ్‌తో పంజాబ్‌ను ఆదుకున్నాడు. దీంతో పంజాబ్ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 147పరుగులు చేసింది. రాజస్థాన్ రాయల్స్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్, అవేశ్ ఖాన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హెట్‌మైర్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు...

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ఎ.తైడే (సి)కుల్దీప్ సేన్ (బి)ఆవేశ్ ఖాన్ 15, బెయిర్‌స్టో (సి)హెట్‌మైర్ (బి)మహరాజ్ 15, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి)ధృవ్ జురెల్ (బి)చాహల్ 10, సామ్ కర్రన్ (సి)ధృవ్ జురెల్ (బి)మహరాజ్ 6, జితేశ్ శర్మ (సి)రియాన్ పరాగ్ (బి)ఆవేశ్ ఖాన్ 29, శశాంక్ సింగ్ (సి)ధృవ్ జురెల్ (బి)ఆవేశ్ ఖాన్ 9, లివింగ్‌స్టోన్ (రనౌట్)కోటియన్/సంజు 21, అషుతోష్ శర్మ (సి)మహరాజ్ (బి)బౌల్ట్ 31, హర్‌ప్రీత్ బ్రార్ (నాటౌట్) 3, అదనం 8. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 147పరుగులు. **వికెట్ల పతనం:** 1/27, 2/41, 3/47, 4/52. 5/70, 6/103, 7/122, 8/147 **బౌలింగ్:** బౌల్ట్ 4-0-22-1, కుల్దీప్ సేన్ 4-0-35-1, ఆవేశ్ ఖాన్ 4-0-34-2, చాహల్ 4-0-31-1, మహరాజ్ 4-0-23-2.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)హర్షల్ పటేల్ (బి)రబడా 39, తనుష్ కోటియన్ (బి)లివింగ్‌స్టోన్ 24, సంజు శాంసన్ (ఎల్‌బి)రబడా 19, రియాన్ పరాగ్ (సి)రబడా (బి)అర్ష్‌దీప్ సింగ్ 23, ధృవ్ జురెల్ (సి)షంషేర్ సింగ్ (బి)హర్షల్ పటేల్ 6, హెట్‌మైర్ (నాటౌట్) 27, రుమన్ పావెల్ (సి)జితేశ్ శర్మ (బి)సామ్ కర్రన్ 11, కేశవ్ మహరాజ్ (సి) లివింగ్‌స్టోన్ (బి)సామ్ కర్రన్ 1, బౌల్ట్ (నాటౌట్) 0, అదనం 3. (19.5 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి) 152పరుగులు. **వికెట్ల పతనం:** 1/56, 2/82, 3/89, 4/113, 5/115, 6/136, 7/138 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3.5-0-45-1, కగిసో రబడా 4-0-18-2, కర్రన్ 4-0-25-2, లివింగ్‌స్టోన్ 3-0-21-1, హర్షల్ పటేల్ 2-0-21-1, హర్‌ప్రీత్ బ్రార్ 3-0-22-0

ఐపిఎల్‌లో నేడు

కోల్‌కతా × లక్నో
వేదిక: ఈడెన్ గార్డెన్స్, కోల్‌కతా; మ.3.30గం॥లకు
ముంబయి × చెన్నై
వేదిక: వాంఖడే, ముంబయి; రా.7.30గం॥లకు

మహిళల టెన్నిస్ జట్టుకు నిరాశ
న్యూజిలాండ్ చేతిలో ఓటమి

ఛాంగ్షా(చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్‌లో భారత మహిళా టెన్నిస్ క్రీడాకారిణులకు షాక్ తగిలింది. న్యూజిలాండ్ చేతిలో 2-1తో ఓడి చారిత్రాత్మక ప్లే-ఆఫ్ బెర్త్‌కు చేరే ఛాన్స్‌ను తృటిలో కోల్పోయింది. ఆసియా-ఓషియానా గ్రూప్-1కు చేరేందుకు ముందు జరిగిన ఈ టోర్నీలో భారత్ నిరాశపరిచింది .శనివారం జరిగిన తొలి సింగిల్స్‌లో రుతుజ భోంసాలే 6-2, 7-6(7-5)తో మోనిక్ బెర్రీ(న్యూజిలాండ్)ను చిత్తుచేసి భారత్‌కు 1-0 ఆధిక్యతను సంపాదించిపెట్టింది. ఆ తర్వాత స్టార్ క్రీడాకారిణి అంకిత రైనా 2-6, 0-6తో లులు సన్ చేతిలో ఓటమిపాలవ్వడంతో 1-1తో టై అయ్యింది. ఇక నిర్ణయాత్మక డబుల్స్‌లో అంకిత-ప్రార్థన 6-1, 7-5తో ఓటమిపాలవ్వడంతో కివీస్ గెలుపు లాంఛనమైంది. దీంతో ఈ గ్రూప్‌నుంచి ఆతిథ్య చైనా, కొరియా ప్రపంచ గ్రూప్ ప్లే-ఆఫ్స్‌కు అర్హత సాధించగా.. తైవాన్, భారత్, న్యూజిలాండ్ జట్లు లీగ్ దశలోనే నిష్క్రమించాయి. మూడోస్థానంలో నిలిచి భారత్, న్యూజిలాండ్ జట్లు వచ్చే ఏడాది జరిగే గ్రూప్-1 అర్హత పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాయి.

ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు
చరిత్ర పుటల్లో నేపాల్ బ్యాటర్



మస్కట్(ఒమన్): ఓవర్లో ఆరు సిక్సర్లు కొట్టి నేపాల్ బ్యాటర్ చరిత్ర పుటల్లోకెక్కాడు. ఒమన్ వేదికగా జరుగుతున్న ఎసిసి పురుషుల ప్రిమియర్ లీగ్‌లో దీపేంద్ర సింగ్ ఐరీ కతార్ బౌలర్ కమ్రన్ ఖాన్ వేసిన చివరి ఐదు బంతులను, ఆ తర్వాత మరో బౌలర్ వేసిన తొలి బంతిని సిక్సర్లుగా మలిచాడు. దీంతో వరుసగా ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు కొట్టిన మూడో ఆటగాడిగా రికార్డు పుటల్లోకెక్కాడు. ఈ మ్యాచ్‌లో దీపేంద్ర కేవలం 21బంతుల్లోనే 64పరుగులతో రాణించాడు. దీంతో నేపాల్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగి 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 210పరుగులు చేసింది. ఛేదనలో కతార్ జట్టు 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 178పరుగులే చేసింది.

టి20ల్లో వరుసబంతుల్లో ఆరు సిక్సర్లు కొట్టిన బ్యాటర్లు...

1. యువరాజ్ సింగ్(భారత్) : 2007 ఇంగ్లండ్‌పై
2. కీరన్ పొలార్డ్(వెస్టిండీస్) : 2021 శ్రీలంకపై...
3. దీపేంద్ర సింగ్(నేపాల్) : 2024 కతార్‌పై...

ఐదో మ్యాచ్‌లోనూ భారత్ ఓటమే..
ఆసీస్ చేతిలో వైట్‌వాష్

పెర్త్: ఐదు టెస్ట్‌మ్యాచ్‌ల హాకీ సిరీస్‌లో భారత హాకీజట్టు వైట్‌వాష్‌కు గురైంది. తొలి నాలుగు మ్యాచుల్లో ఓడి ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన భారత్.. శనివారం జరిగిన ఐదో, చివరి మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో 3-2గోల్స్ తేడాతో ఓడింది. తొలి అర్ధభాగం సమయం ముగిసేసరికి ఇరుట్లు 1-1తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున ఏకైక గోల్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 20వ ని.లో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. రెండో అర్ధభాగంలో ఆస్ట్రేలియా తరఫున కీ-విల్లంట్ 38వ, 39వ ని.లో చేశాడు. దీంతో ఆసీస్ 3-1గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. ఆ తర్వాత 53వ ని.లో 21ఏళ్ల ఫార్వర్డ్ ఆటగాడు బాబీసింగ్ ధమి 53వ ని.లో భారత్‌కు మరో గోల్ అందించడంతో భారత్ 2-3తో గోల్స్ అంతరాన్ని మాత్రమే తగ్గించగల్గింది. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన భారతజట్టు బెల్జియం, న్యూజిలాండ్, అర్జెంటీనా, ఐర్లాండ్‌లో సంయుక్తంగా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తన ఆస్ట్రేలియాతో కలిసి ఒకే గ్రూప్ గ్రూప్‌లో ఉన్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68